తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 16.10.2025 | సంపుటి : 12 సంచిక : 86 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# 2030 కామన్‌వెల్త్ గేమ్స్ భారత్‌లో..

## నిర్వహణ హక్కులు దక్కించుకున్న ఇండియా

- అహ్మదాబాద్‌ను వేదికగా ఎంపిక చేస్తూ కామన్‌వెల్త్ స్పోర్ట్ బాడీ నిర్ణయం
- నైజీరియాతో పోటీపడి ఆతిథ్య హక్కులు చేజిక్కించుకున్న వైనం
- 26న గ్లాస్గో జనరల్ అసెంబ్లీ సమావేశంలో అధికారికంగా ప్రకటన

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్ మరోసారి అంతర్జాతీయ క్రీడా వేదికగా నిలవబోతోంది. 2030 కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహణ హక్కులను భారత్ దక్కించుకుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని వేదికగా ఎంపిక చేస్తూ కామన్‌వెల్త్ స్పోర్ట్ బాడీ నిర్ణయం తీసుకుంది.లక్షా 32 వేల సామర్థ్యం కలిగిన నరేంద్ర మోదీ స్టేడియం లాంటి ప్రపంచ ప్రఖ్యాత క్రీడా ప్రాంగణం ఉండటంతో అహ్మదాబాద్‌కు ఈ గౌరవం దక్కింది. నైజీరియాలోని అబూజా నగరంతో పోటీపడి అహ్మదాబాద్ ఆతిథ్య హక్కులు దక్కించుకుంది. నవంబర్ 26న గ్లాస్గోలో జరగనున్న జనరల్ అసెంబ్లీ సమావేశంలో ఈ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు.కామన్‌వెల్త్ గేమ్స్ ఆతిథ్య హక్కులను దక్కించుకోవడం భారత్‌కు ఇది రెండో సారి. 2010లో న్యూఢిల్లీ వేదికగా భారత్‌లో తొలిసారి ఈ క్రీడలు జరిగాయి. 2030 గేమ్స్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఇవి శతాబ్ది వేడుకలుగా జరుగనున్నాయి. 1930లో తొలిసారి ఈ క్రీడలు పరిచయం మిగతా 2లో..

# మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

- ఆస్ బయోటెక్ సదస్సుకు ఆహ్వానం
- రెండేళ్లలో లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతిపై కీలకోపన్యాసం
- భారత్‌లో ఘనత దక్కించుకున్న తొలి మంత్రి



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. లైఫ్ సైన్సెస్ రంగంలో 'ఆసియా-పసిఫిక్' ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా పరిగణించే 'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో ఆయన కీలకోపన్యాసం చేయనున్నారు. ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ ఈ మేరకు ఆహ్వానం పలికారు. దేశంలో ఈ గౌరవం దక్కిన ఏకైక మంత్రి శ్రీధర్ బాబు కావడం గమనార్హం. ఈ నెల 21 నుంచి 24 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో సదస్సు జరగనుంది. ఈ రెండేళ్లలో లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతిపై మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగించ నున్నారు. తెలంగాణలో ఈ రంగంలో అనుకూలతలు, అవకాశాలపై మాట్లాడనున్నారు. రాష్ట్రానికి మిగతా 2లో..



# ఉధృతమవుతున్న బీసీ ఉద్యమపోరు

## బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తాం



బీసీ రిజర్వేషన్లు కోరుతూ 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఆర్.కృష్ణయ్య, కమిటీ ప్రతినిధులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన దృశ్యం.

- బీసీ రిజర్వేషన్ల కోసం అన్ని పార్టీలు సహకరించాలి : ఆర్.కృష్ణయ్య
- బీసీ ఐకాస ధర్నాకు బీఆర్ఎస్ మద్దతు
- కాంగ్రెస్ ప్రయత్నంతో రిజర్వేషన్లు రావు
- పార్లమెంటులో బిల్లు పెడితేనే సాధ్యం
- జాతీయ పార్టీలపైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతోనే ఇది సాకారం: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): బీసీ రిజర్వేషన్ల కోసం బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తామని ఆర్.కృష్ణయ్య తెలిపారు. ప్రజా ఉద్యమాలు బలంగా జరిగితేనే ప్రభుత్వాలు, పార్టీలు స్పందిస్తాయన్నారు. "ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమం దశాబ్దాలు నడిచింది. అన్నాదమ్ముల మధ్య వాటాలు ఎప్పటికైనా పంచాల్సిందే. బీసీలకు రిజర్వే షన్లు పెంచడం ఎప్పటికైనా తప్పదు. ప్రజల మధ్య విభేదాలు మిగతా 2లో..

# ఆయుధాన్ని అందించి లొంగిపోయిన మల్లోజుల

## మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో జనజీవన స్రవంతిలోకి..

## రూ. ఆరు కోట్ల రివార్డు అందజేసిన ముఖ్యమంత్రి

ఆయనతో పాటు మరో 61 మంది సభ్యులు లొంగుబాటు



ముంబై(జనంసాక్షి):మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి జనజీవన స్రవంతి లోకి వచ్చారు. మహారాష్ట్ర పోలీసుల ఎదుట మల్లోజుల మంగళవారం లొంగిపోయారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో మల్లోజుల సహా మావోయిస్టులు తమ మిగతా 2లో..

### ఛత్తీస్‌గఢ్ సీఎం ఎదుట లొంగిపోనున్న ఆశన్న

2లో..

- మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ
- ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది మావోయిస్టుల లొంగుబాటు

# హైకోర్టు స్టేపై సుప్రీంకోర్టులో నేడే విచారణ

బీసీ 42% రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌ను విచారించనున్న అత్యున్నత ధర్మాసనం

హైదరాబాద్(జనంసాక్షి):స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్‌ల జీవోను, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. రిజర్వేషన్ల మిగతా 2లో..

# మరణశిక్ష అమలులో పాతవిధానమే

## మార్చే ఉద్దేశం లేదు • సుప్రీంకు స్పష్టం చేసిన కేంద్రం



న్యూఢిల్లీ(జనంసాక్షి):మరణశిక్షఅమలు విధానాన్ని మార్చే ఉద్దేశం లేదని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. దేశంలో మరణశిక్ష పడిన ఖైదీలకు ప్రస్తుతం అనుసరిస్తున్న ఉరితీత విధానాన్ని తొలగించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై బుధవారం అత్యున్నత న్యాయస్థానం విచారణ జరిపింది. అయితే కేంద్రం ఇచ్చిన సమాధానంతో ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కాలానుగుణంగా మిగతా 2లో..

# నామినేషన్ వేసిన మాగంటి సునీత

## పదేళ్ల అభివృద్ధి, రెండేళ్ల అరాచకానికి మధ్య పోరు:కేటీఆర్




హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత గోపీనాథ్ తొలి సెట్ నామినేషన్ వేశారు. షేక్‌పేటలోని తహశీల్దార్ కార్యాలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు పద్మారావు, రావుల శ్రీధర్‌రెడ్డి, దీదీప్య రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, మిగతా 2లో..




# మొదటి ప్రాధాన్యత నాణ్యతకే

## ఇందిరమ్మ ఇళ్లు పథకంలో బీఐఎస్ రూపొందించిన నేషనల్ బిల్డింగ్ కోడ్‌ను పాటిస్తున్నాం : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు మొదటి ప్రాధాన్యతనిస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ఆధ్వర్యంలో బేగంపేట ద మనోహర్ హోటల్లో జరిగిన ప్రపంచ ప్రమాణాల దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు పథకంలో బీఐఎస్ రూపొందించిన నేషనల్ బిల్డింగ్ కోడ్‌ను పాటిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఇతర పనుల్లోనూ ప్రతిచోటా నాణ్యతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ స్థాపించిన ఈ శాఖ.. 79ఏళ్లలో దేశంలో 23వేలకు పైగా భారతీయ ప్రమాణాలను రూపొందించడం గొప్ప విషయమని కొనియాడారు.నిత్య వినియోగ వస్తువులపై ఐఎస్ఐ మార్కు, బంగారు, వెండి ఆభరణాలపై హాల్‌మార్కు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై రిజిస్ట్రేషన్ మార్కులు వినియోగదారులకు విశ్వాసాన్నిస్తున్నాయని తెలిపారు. ప్రతి పౌరుడూ బాధ్యతగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని.. బీఐఎస్ ధ్రువీకరించిన వస్తువులు మాత్రమే కొనాలని మంత్రి కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్య కార్యదర్శి తెలంగాణ రాష్ట్రంలో ముఖ్య కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటైందని.. ప్రమాణాల పెంపునకు ఈ కమిటీ కృషి చేస్తోందని తెలిపారు. స్టాండర్డ్ క్లబ్స్ ద్వారా విద్యార్థుల్లో నాణ్యతపై అవగాహన కల్పించే బీఐఎస్ ప్రయత్నాన్ని అభినందించారు.

**రాష్ట్రస్థాయి పురస్కారాలు**

జి ప్రసన్న కుమారి, తెలంగాణ మోడల్ స్కూల్, మహేశ్వరం, బండారి రజిత, పీఎం శ్రీ జెడ్పీ హైస్కూల్, శ్రీదేవి, జెడ్పీ హైస్కూల్, తీగలగుట్టపల్లి, కరీంనగర్‌లను ఉత్తమ మెంటార్లుగా మంత్రి సత్కరించారు. జెడ్పీ హైస్కూల్ ధర్మారావుపేట, కామారెడ్డి విద్యార్థులకు మానక్ వీర్ పురస్కారాల్ని అందజేశారు. వీరితో పాటు పలు ఉత్తమ పరిశ్రమలనూ మంత్రి సత్కరించారు. రాష్ట్రస్థాయిలో నాణ్యతా ప్రమాణాల పెంపులో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర ప్రభుత్వ శాఖలు.. కార్మిక శాఖ, టీజీఎస్పీడీసీఎల్ లను మంత్రి సత్కరించారు. 350 మంది పరిశ్రమ, విద్యా సంస్థలు, ప్రభుత్వ శాఖలు, వినియోగదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### కబ్జాకోరల నుంచి 4 పార్కులకు

# విముక్తి

## రాజేంద్రనగర్‌లో హైడ్రా కూల్చివేతలు

రాజేంద్రనగర్(జనంసాక్షి): హైదరాబాద్ శివారు రాజేంద్రనగర్ పరిధిలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. బద్వేల్-ఉప్పరపల్లి గ్రామాల్లో జనచైతన్య లేఔట్ ఫేజ్ 1, 2లో కబ్జాకు గురైన 4 పార్కులకు విముక్తి కల్పించింది. 19,878 గజాల భూమిని ఆక్రమణదారుల నుంచి స్వా ధీనం చేసుకుంది. దీని విలువ రూ.139 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. దాదాపు 120 ఎకరాల్లో ఫేజ్ 1, 2 హుడా అప్రూవల్ పేరు తో ఏర్పాటు చేసిన లేఔట్‌లో పార్కులు కబ్జాకు గురవుతున్నాయని హై డ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. మిగతా 2లో..





# జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిగా దీపక్ రెడ్డి

ఖరారు చేసిన అధిష్టానం

హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిని భాజపా ప్రకటించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ.. బీజేపీ అభ్యర్థిని ఆ పార్టీ అగ్రనాయకత్వం ఖరారు చేసింది. లంకల దీపక్‌రెడ్డి పేరు ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ మిగతా 2లో..

### అరుదైన ఖనిజాలపై బీజింగ్ నియంత్రణ ఎదుర్కొనేందుకు..

# భారత్ మద్దతు కావాలి

## అమెరికా మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు



వాషింగ్టన్(జనంసాక్షి):రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో ఓవైపు భారత్‌పై సుంకాల మోత మోగించిన అమెరికా.. చైనా విషయంలో మాత్రం మన సాయం కోరుతోంది. అరుదైన ఖనిజాలపై బీజింగ్ నియంత్రణను ఎదుర్కొనేందుకు భారత్ ఐరోపా మద్దతు కావాలని ఆశిస్తోంది. ఈ మేరకు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రపంచంలో ఎక్కడా దొరకని అరుదైన ఖనిజాల ఎగుమతిపై ఇటీవల చైనా నియంత్రణలు విధించింది. ఇకపై విదేశీ కంపెనీలు వాటిని దిగుమతి చేసుకోవాలంటే ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. దీనిపై తాజాగా స్కాట్ బెసెంట్ స్పందించారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్ష సవాలేనని బీజింగ్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. "ఇది చైనాకు, ప్రపంచ దేశాలకు మధ్య నెలకొన్న పోటీ. ప్రపంచ పంపిణీ వ్యవస్థలపై చైనా గురిపెట్టింది. మేం అలా జరగనివ్వం. బీజింగ్ దూకుడును మేం అడ్డుకుంటాం. ఇందుకోసం ఇప్పటికే మిత్రదేశాలను సంప్రదిస్తున్నాం. చైనాను ఎదుర్కొనేందుకు మాకు భారత్, ఐరోపా దేశాల మద్దతు కావాలి" అని ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా మంత్రి వెల్లడించారు. అమెరికా మిగతా 2లో..

### సరైన ధర లభిస్తే..

# అమెరికా చమురు కొనుగోలుపై ఆలోచిస్తాం

వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెరికా నుంచి చమురు కొనుగోలుకు భారత్ సిద్ధంగానే ఉందని వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. కానీ సరైన ధర లభిస్తేనే ఈ అంశాన్ని ఆలోచిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య కొనసాగుతున్న వాణిజ్య చర్చల నడుమ ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఒప్పందం జరిగితే మిగతా 2లో..



# జేడీయూ తొలి జాబితా

## 57 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటన

పట్నా(జనంసాక్షి):బీహార్‌లో నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. సీట్ల కేటాయింపు విషయంలో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ)లో తర్జన భర్జనలు జరుగుతుండగా, ఇదే సమయంలో సీఎం నితీష్ కుమార్‌కు చెందిన జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ)బుధవారం 57 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను విడుదల మిగతా 2లో..

# త్వరలో వందేభారత్ 4.0

## అత్యాధునిక వర్షన్‌ను అభివృద్ధి చేయబోతున్నాం: అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారతదేశపు సెమీ-హై-స్పీడ్ రైళ్ల జాబితాలో తర్వాత వర్షన్ రానుంది. వందేభారత్ 4.0 ను అభివృద్ధి చేయనున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం ప్రకటించారు. ఎగుమతి గిరాకీలకు అనుగుణంగా దాని రూపకల్పన ఉంటుందని వెల్లడించారు. రైళ్ల ఆధునిక సాంకేతికత విషయంలో దేశాన్ని గ్లోబల్ సప్లయిర్‌గా మార్చేదిశగా ఇది కీలక అడుగు కానుందని మిగతా 9లో..

# కొనసాగుతున్న ఉద్రిక్తతలు



## పాక్- ఆఫ్ఘన్ సరిహద్దు ఘర్షణల్లో పలువురు మృతి

ఇస్లామాబాద్(జనంసాక్షి): పాకిస్తాన్- ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయి. తాజాగా ఆఫ్ఘనిస్తాన్ దళాలు, స్థానిక ఉగ్రవాదులు సరిహద్దు వెంబడి జరిపిన కాల్పులకు తమ సైన్యం ప్రతీకారం తీర్చుకున్నదని పాకిస్తాన్ తెలిపింది.తాజా ఘర్షణల్లో పదుల సంఖ్యలో సైనికులతో పాటు పౌరులు కూడా మృతిచెందారని ఇరువైపుల భద్రతా అధికారులు మీడియాకు తెలిపారు.కాందహార్ ప్రావిన్స్‌లోని స్పిన్ బోల్డాక్‌లో ఆఫ్ఘనిస్తాన్-పాకిస్తాన్ సరిహద్దు సమీపంలో ఆఫ్ఘన్ తాలిబాన్ వర్గాలు గస్తీ తిరుగుతున్నాయి. కాగా ప్రధాన సరిహద్దు పోస్టులపై ఆఫ్ఘనిస్తాన్ తాలిబాన్లు చేసిన రెండు దాడులను తిప్పికొట్టామని, దక్షిణ కాందహార్ ప్రావిన్స్‌లోని ఆఫ్ఘన్ వైపున ఉన్న మిగతా 9లో..

## 2030 కామన్‌వెల్త్ గేమ్స్ భారత్‌లో..

చేయబడ్డాయి. నాడు కెనడాలో హామిల్టన్‌లో ఈ క్రీడలు జరిగాయి. భారత్‌కు కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహణ అవకాశం దక్కడంపై కామన్‌వెల్త్ గేమ్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు పి.టి ఉష స్పందించారు. 2030 కామన్‌వెల్త్ గేమ్స్ భారత యువతకు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. ఈ క్రీడల నిర్వహణ కామన్‌వెల్త్ దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలపరిచే గొప్ప అవకాశంగా పేర్కొన్నారు. కాగా, గత ఎడిషన్ (72వది) కామన్‌వెల్త్ గేమ్స్ ఇంగ్లండ్‌లోని బర్మింగ్హమ్ నగరంలో జరిగాయి. తదుపరి ఎడిషన్ వచ్చే ఏడాది జరుగనుంది. ఈసారి స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరం ఈ క్రీడలకు ఆతిథ్యమివ్వనుంది.

గర్వించదగిన విషయం : అమిత్ షా

కామన్వెల్త్ క్రీడలు భారత్‌లో జరగనుండడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. అహ్మదాబాద్‌లో నిర్వహించేందుకు కామన్వెల్త్ అసోసియేషన్ ఆమోదం తెలపడం గర్వించదగిన విషయమన్నారు. ప్రపంచ క్రీడా పటంలో భారత్‌ను ఉంచడానికి ప్రధాని మోదీ చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు ఇది నిదర్శనమన్నారు.

## నామినేషన్ వేసిన సునీత

రాజ్‌కుమార్ పటేల్, సమినా యాస్మిన్‌తో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందడంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఉప ఎన్నికల కోసం ఎన్నికల సంఘం సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 21 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 22న నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ పక్రియ ఉంటుంది. నవంబర్ 11న ఉప ఎన్నికల పోలింగ్ జరుగనుండగా.. అదే నెల 14న కౌంటింగ్ నిర్వహించనున్నారు. జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఎన్నిక పార్టీలు, ఇద్దరు వ్యక్తుల మధ్య జరుగుతున్న ఎన్నిక కాదని.. పదేండ్ల అభివృద్ధి, పాలనకి.. రెండు సంవత్సరాల అరాచక పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నిక అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. పదేళ్ల రైతుబంధు పాలనకు, రెండు సంవత్సరాల రాక్షస పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నికగా పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో ఆడబిడ్డ గెలుపు కోసం రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురు చూస్తున్నారని.. ఆమె గెలుపుతోనైనా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.2500 ఇస్తుందని ఆశిస్తున్నారన్నారు. లక్షల మంది రైతన్నలు ఈమె గెలుస్తుందని ఆశిస్తున్నారని తెలిపారు. ఆ తర్వాతే తమకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేస్తుందని.. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, తర్వాత మోసపోయిన యువతి యువకులు ఎదురు చూస్తున్నారు. తమ ఇళ్లు కూలగొట్టిన అరాచకాలను చూసిన తర్వాత, ఈ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి గెలవాలని, ఆ అరాచకాలు ఆగాలని హైదరాబాద్ నగర పేదలు కోరుకుంటున్నారన్నారు. మూతపడుతున్న బస్తీ దావఖానాలు, ఉచిత తాగునీరు ఆగిపోతున్న విషయాలు ప్రజలందరూ చూస్తున్నారని.. కాంగ్రెస్ పార్టీ ఒక ఇల్లు కూడా హైదరాబాదులో కట్టలేదని.. కేసీఆర్ కట్టిన హైదరాబాద్‌లో కట్టిన లక్ష ఇళ్లు, ఇచ్చిన ఇళ్ల పట్టాలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అన్నీ కూడా హైదరాబాద్ నగర ప్రజలకు గుర్తుకు వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన మైనార్టీలకు ఈ ఎన్నిక ఒక అవకాశంగా భావిస్తున్నారని.. ప్రభుత్వంలో ఒక్క మైనార్టీకి కూడా అవకాశం ఇవ్వకుండా దారుణంగా వారిని అవమానపరిచిన మైనార్టీలు, ఈ ఎన్నికను రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడానికి ఒక అవకాశంగా భావిస్తున్నట్లుగా చెప్పారు. తమకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్, రిజర్వేషన్లు అన్నీ మోసమని, ఈ అంశంలో గుణపాఠం చెప్పడానికి రాష్ట్రవ్యాప్తంగా బీసీలు సిద్ధంగా ఉన్నారని.. దళితబంధు, అభయహస్తం అని చెప్పి మోసం చేసిన దళితులు కూడా ఆగ్రహంతో ఉన్నారని.. తమ అభ్యర్థికి అన్ని వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతున్నదని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ ఆధ్వర్యంలో మరోసారి పాలన రావడానికి, హైదరాబాద్ నగరంలో జరుగుతున్న ఈ ఉప ఎన్నిక పునాది కాబోతున్నదన్నారు. మరోసారి రాష్ట్రంలో గులాబీ పార్టీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ నుంచే ప్రారంభం కాబోతున్నదని.. అన్ని వర్గాల మద్దతుతో, అండతో మా పార్టీ అభ్యర్థి సునీత ఘన విజయం సాధించబోతున్నారన్నారు. రెండు సంవత్సరాల ఈ విఫల కాంగ్రెస్ ప్రభుత్వానికి, పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రతి ఒక్కరూ మా పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రతి ఒక్కరికి, నియోజకవర్గానికి విశేషమైన సేవలు అందించిన నాయకుడు గోపీనాథ్ అన్నారు. హైదరాబాద్ నగరంలో అన్ని నియోజకవర్గాల్లో మా పార్టీ గెలుపొందిందంటే, అప్పటి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన గోపీనాథ్ కృషి కూడా ఉందని.. గోపీనాథ్ అకాల మరణంతో బాధపడుతున్న కుటుంబాన్ని అందరూ ఆదుకోవాలని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నిర్ణయించి, ఆయన సతీమణి సునీత గోపీనాథ్ గారికి టికెట్ కేటాయించడం జరిగిందన్నారు. సునీతకు సహాయం కోసం పార్టీ కీలక నాయకులంతా పనిచేయాలని కేసీఆర్ ఆదేశించారని.. అందరి ఆశీర్వాదాలతో సునీత ఎన్నికల్లో గెలువబోతున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రానికి చేసిందేమీ లేదు

### సునీతను అవమానించేలా మంత్రులు మాట్లాడటం సరికాదు: హరీశ్

**హైదరాబాద్(జనంసాక్షి):** భర్తను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానించే విధంగా కాంగ్రెస్ మంత్రులు మాట్లాడటం దుర్మార్గమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ సంస్కృతి అని విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో మాగంటి గోపీనాథ్ గెలిచారని తెలిపారు. దురదృష్టవశాత్తూ గోపీనాథ్ చనిపోయారని... ఆ కుటుంబాన్ని జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిపించాలని కోరారు. మాగంటి గోపీనాథ్‌కి పెళ్లికాని ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన పిల్లలు ఎంతో దుఖంలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ సమయంలో కాంగ్రెస్ మంత్రులు మాగంటి సునీతని అవమానించే విధంగా నానా మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. విజ్ఞత మరిచి, విచక్షణ లేకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు విజ్ఞులని.. మంచి, చెడులని ఆలోచిస్తారని తెలిపారు. మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపించాలని కోరారు హరీశ్‌రావు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి పలువురు నేతలు బీఆర్ఎస్ లోకి చేరారు. హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఒక ఆడబిడ్డను ఆశీర్వదించాలనే పలువురు బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ ఏం చేసిందనేది ఒకసారి ప్రజలు ఆలోచించాలని సూచించారు. తెలంగాణకి కాంగ్రెస్, బీజేపీ ద్రోహం చేశాయని విమర్శించారు హరీశ్‌రావు. కాంగ్రెస్, బీజేపీలు చెప్పేదొకటి, చేసేదొకటని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ మొహబ్బత్‌కి దుకాణ్ అని అంటారని.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటారని తెలిపారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతోంది ఏమిటి..?.. హైడ్రా పేరిట పేదవారి ఇళ్లు కూలగొట్టడం మొహబ్బత్ దుకాణ్ ఆ..? అని ప్రశ్నించారు. బడా బాబుల ఇళ్లు ఎందుకు కూలగొట్టడం లేదని నిలదీశారు. గరీబోళ్ల ఇల్లు కూలగొట్టి వేల కుటుంబాలను రోడ్డుమీదకి సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ బిహార్‌లో ఓటు చోరీ అంటున్నారని... జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి మాత్రం ఓటు చోరీ చేస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో రేవంత్‌రెడ్డి ఓటు చోరీ చేయకుండా నిజాయితీగా ఉండాలని చెప్పాల్సిన బాధ్యత రాహుల్ గాంధీకి లేదా అని ప్రశ్నించారు హరీశ్‌రావు. 'జూబ్లీహిల్స్‌లో భర్తను కోల్పోయిన సునీతని ఒడగొట్టాలని.. 20 వేల దొంగ ఓట్లను కాంగ్రెస్ కూడగట్టింది. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని అన్నారు. ప్రతి అక్కకు, చెల్లెకు కాంగ్రెస్ రూ.55,000 బాకీ పడింది. జూబ్లీహిల్స్‌లో మహిళలకు ఒక్కొక్కరికీ రూ.55,000 ఇచ్చి రేవంత్‌రెడ్డి సర్కార్ ఓటు అడగాలన్నారు.

# ఉధృతమవుతున్న బీసీ ఉద్యమపోరు

పెరగకముందే సామరస్యంగా పరిష్కరించాలి. బీసీ రిజర్వేషన్ల కోసం అన్ని పార్టీలు సహకరించాలి" అని పిలుపునిచ్చారు. బీసీ ఐకాస ధర్నాకు భారత రాష్ట్ర సమితి నైతిక మద్దతు ఉంటుందని కేటీఆర్ తెలిపారు. బీసీ–ఐకాస ఆధ్వర్యంలో 'బంద్ ఫర్ జస్టిస్' పేరిట ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఆర్.కృష్ణయ్య, కమిటీ ప్రతినిధులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. బీసీ ఐకాస ధర్నాకు భారత రాష్ట్ర సమితి నైతిక మద్దతు ఉంటుందని కేటీఆర్ తెలిపారు. బీసీ–ఐకాస ఆధ్వర్యంలో 'బంద్ ఫర్ జస్టిస్' పేరిట ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఆర్.కృష్ణయ్య, కమిటీ ప్రతినిధులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు బీసీల కోసం కేసీఆర్ ఎన్నో చేశారు. బీసీలకు లాభం జరగాలంటే పార్లమెంటులో బిల్లు చేయాలి. అసెంబ్లీలో చేసి నెపాన్ని ఇతరులపై నెట్టడం సమంజసం కాదు. బీసీల విషయంలో కాంగ్రెస్‌ది చిత్తశుద్ధి లేని శివపూజ. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు మాత్రమే సరిపోతాయా? రాజకీయ రిజర్వేషన్లతోపాటు అన్ని రకాలుగా మేలు జరగాలి. ధర్నాకు మద్దతు ఇస్తామంటున్న భాజపానే బిల్లు పెడితే అయిపోతుంది కదా అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం మాదిరే, సమస్యను ఢిల్లీ దాకా తీసుకువెళ్లి తెలంగాణ సాధించుకున్నట్లుగానే బీసీ రిజర్వేషన్లను సాధించుకుందాం. 18వ తేదీన బీసీ సంఘాలు నిర్వహించే బంద్‌కు మా పార్టీ మద్దతు ఇస్తుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రయత్నం మంచిది కాదు అని కేటీఆర్ హితవు పలికారు. పూటకో మాటతో బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. 2004లో ఆర్ కృష్ణయ్యను తీసుకొని ప్రధానమంత్రి దగ్గరకి వెళ్లి కేసీఆర్ మూడు విషయాలు చెప్పారు. ఒకటి దేశంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ పెట్టాలి, రెండు జనాభాకి అనుగుణంగా రాష్ట్రాలకు రిజర్వేషన్లు పెంచుకునే వెసులుబాటు కల్పించాలి, మూడు చట్టసభలో బీసీలకు రిజర్వేషన్లు కావాలని కేసీఆర్ అడిగారు. భారత దేశ స్థాయిలో ఈ మూడు అంశాల మీద మాట్లాడిన మొట్టమొదటి నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లపైన మా పార్టీ విధానాన్ని చాలా స్పష్టంగా మా పార్టీ చెప్పింది. గతంలో శాసనసభలో రెండుసార్లు రిజర్వేషన్ల కోసం తీర్మానం చేసి పంపించింది. కానీ కాంగ్రెస్ పార్టీ లెక్క ప్రచారం చేసుకోలేదు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా రిజర్వేషన్లు పెడతామని శాసనసభలో చెప్పినప్పుడు మేము ఆ పార్టీ తరఫున మద్దతు ఇచ్చాము. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు మంచిది కాదు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల పైన ఐదు రకాలుగా మాట్లాడుతోంది. రాజ్యాంగ సవరణ ద్వారా, పార్టీ తరఫున రిజర్వేషన్లు ఇస్తామని, ఆర్డినెన్స్ ద్వారా, బిల్లు ద్వారా, మరోసారి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాతనే బీసీ రిజర్వేషన్లు వస్తాయని చెప్పారు. ఇన్ని రకాలుగా మాటలు మార్చిన కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని మేము తప్పకుండా ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నన్ని రోజులు, ఆయన నాయకత్వంలో రానే రావు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి బలహీన వర్గాలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేదాకా నిలదీస్తూనే ఉంటాము. బీసీ డిక్లరేషన్లు ఇస్తామని చెప్పిన లక్ష కోట్ల బ్జడెట్ నుంచి మొదలుకొని బీసీ సబ్‌ప్లాన్ వంటి హామీలపైన నిలదీస్తూనే ఉంటాము. కాంగ్రెస్ తెచ్చిన 42 శాతం రిజర్వేషన్ కేవలం స్థానిక సంస్థల కోసం తీసుకువచ్చారు కానీ, విద్య, ఉపాధికి సంబంధించిన రిజర్వేషన్ల వాటా మిగిలిన అన్ని రంగాల్లో రావాల్సిన అవసరం ఉన్నది. కాంట్రాక్టులనుంచి మొదలుకొని అన్నింటికి సంబంధించిన వాటిలో 42 శాతం వాటా రావాలి అని బీసీ సమాజం డిమాండ్ చేయాలి అని కేటీఆర్ సూచించారు.

## హైకోర్టు స్టేపై సుప్రీంకోర్టులో నేడే విచారణ

అమలు జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని సవాల్ చేసింది. దీనిపై గురువారం సుప్రీం కోర్టులో విచారణ జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం విచారించనుంది. పిటిషన్ విచారణకు స్వీకరించాలో? లేదో? ఖరారు చేయనుంది. హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికల నిర్వహణకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైనందున ఇందులో హైకోర్టు జోక్యం సరికాదని వాదించనుంది. సుప్రీం కోర్టు తీర్పులకు అనుగుణంగా జనాభా గణాంకాలపై సర్వే నిర్వహించి, బీసీ జనాభా 57.6% ఉన్నందున 42% రిజర్వేషన్‌లు కల్పించామని, దీనికి అనుగుణంగా రిజర్వేషన్‌ల పరిమితిని సవరిస్తూ చట్టం తీసుకువచ్చిన విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లనుంది.

### మంత్రి శ్రీధర్ బాబుకు

## అరుదైన గౌరవం

కొత్త పెట్టుబడులు తీసుకొచ్చే అవకాశం ఆయనకు దక్కింది. తెలంగాణలో లైఫ్ సైన్సెస్ రంగంలో గత రెండు సంవత్సరాల్లో రూ.63,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, ఫార్మా, బయోటెక్, మెడ్‌టెక్ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదిగిన నేపథ్యంలో ఈ ఆహ్వానం వచ్చింది. తాజా సీబీఆర్ నివేదిక ప్రకారం హైదరాబాద్ ప్రపంచంలోని టాప్ 7 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ జాబితాలో చోటు దక్కిన ఏకైక భారత నగరంగా హైదరాబాద్ నిలిచింది.

## జేడీయూ తొలి జాబితా

చేసింది. రాబోయే ఎన్నికల్లో పోటీ చేయబోయే కీలక అభ్యర్థుల్లో సోన్‌బార్సా నుండి రత్నేష్ సదా, మోర్వా నుండి విద్యాసాగర్ నిషాద్, ఎక్మా నుండి ధుమల్ సింగ్, రాజ్‌గిర్ నుండి కౌశల్ కిషోర్ ఉన్నారు. ఈ జాబితాలో పలువురు సీనియర్ నేతలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న విజయ్ కుమార్ చౌదరి.. సరాయ్ రంజన్ నుంచి పోటీ చేయనున్నారు. ఆలంనగర్ నుంచి నరేంద్ర నారాయణ్ యాదవ్, బీహారీగంజ్ నుంచి నిరంజన్ కుమార్ మెహతా, సింగేశ్వర్ నుండి రమేష్ రిషి దేవ్, మాధేపురా నుండి కవితా సాహా, మహిసి నుండి గండేశ్వర్ షా, కుశేశ్వరస్థాన్ నుంచి అతిరెక్ కుమార్ ఎన్నికల బరిలోకి దిగనున్నారు. ఇతర ప్రముఖ అభ్యర్థుల విషయానికొస్తే అనంత్ కుమార్ సింగ్ (మొకామా), శ్యామ్ రజక్ (ఫుల్వారీ), కౌశల్ కిషోర్ (రాజ్‌గిర్), ధుమల్ సింగ్ (ఎక్మా), మహేశ్వర్ హజారీ (కళ్యాణ్‌పూర్), రత్నేష్ సదా , సంతోష్ కుమార్ నిరాలా (రాజ్‌పూర్), మదన్ సాహ్ని (, , ద్యా సాగర్ సింగ్ నిషాద్.. మోర్వా నుంచి పోటీ చేస్తున్నారు.

### కబ్జాకోరల నుంచి 4 పార్కులకు విముక్తి

రెవెన్యూ, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కబ్జా జరిగినట్లు నిర్ధరించారు. ఈ క్రమంలో బుధవారం ఆక్రమణలను హైడ్రా సిబ్బంది తొలగించారు. ప్రహరీలు నిర్మించుకుని వేసిన షెడ్‌లు, రూమ్‌లను తొలగించారు. అనంతరం ఫెన్సింగ్ నిర్మాణ పనులు చేపట్టారు.

## అరుదైన ఖనిజాలపై బీజింగ్ నియంత్రణ ఎదుర్కొనేందుకు.. భారత్ మద్దతు కావాలి

ప్రపంచ శాంతిని కోరుకుంటుంటే.. చైనా ఆర్థిక యుద్ధం చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. అరుదైన ఖనిజాలపై చైనా నియంత్రణ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు కోపం తెప్పించింది. దీంతో బీజింగ్‌పై 100శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. అవి నవంబరు 1వ తేదీ నుంచి గానీ, అంతకుముందు నుంచి గానీ అమల్లోకి వస్తాయని తెలిపారు. దీంతో పాటు చైనాకు అమెరికా సంస్థలు ఎగుమతి చేసే కీలక సాఫ్ట్‌వేర్‌లదీంతో పాటు చైనాకు అమెరికా సంస్థలు ఎగుమతి చేసే కీలక సాఫ్ట్‌వేర్‌ల పైనా నియంత్రణ విధిస్తామని వెల్లడించారు. ఇక, చైనాతో అమెరికా వాణిజ్య యుద్ధం నానాటికీ ముదురుతోంది. ఇప్పటికే ఇరుదేశాలు నౌకలపై పరస్పరం ప్రత్యేక ఫీజులను కూడా విధించాయి. ఈ నేపథ్యంలో తాజాగా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. బీజింగ్‌తో వంటనూనె సంబంధిత వ్యాపారాల రద్దుకు యోచిస్తున్నట్లు తెలిపారు. అమెరికా రైతుల నుంచి చైనా ఉద్దేశపూర్వకంగానే సోయాబీన్లను కొనుగోలు చేయడం లేదని ట్రంప్ ఆరోపించారు. ఇది ఆర్థిక ఉద్రిక్తతలను పెంచే చర్యగా అభివర్ణించారు. దీనికి ప్రతిగా చైనాతో వంట నూనె సంబంధిత వాణిజ్యాన్ని నిలిపివేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఆ దేశ వంట నూనె తమకు అక్కర్లేదని పేర్కొన్నారు.

బ్రిక్స్ కూటమి.. డాలర్‌పై దాడే:

ఈ సందర్భంగా బ్రిక్స్ కూటమిపై ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. డాలర్‌పై దాడి చేసేందుకే ఆ కూటమి ఏర్పడిందని విమర్శించారు. బ్రిక్స్‌లో ఉండాలనుకునే దేశాలపై టారిఫ్‌లు విధిస్తామని మరోసారి హెచ్చరించారు. ప్రస్తుతం ఆ కూటమి విచ్ఛిన్నమవుతోందని విమర్శించారు.

## సరైన ధర లభిస్తే.. అమెరికా చమురు కొనుగోలుపై ఆలోచిస్తాం

ప్రస్తుతం భారత దిగుమతులపై ఉన్న 50 శాతం సుంకాలు తగ్గే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. గతంలో అమెరికా నుంచి భారత్ 22-23 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం కొనుగోలు చేసేదని రాజేశ్ అగర్వాల్ ఈ సందర్భంగా తెలిపారు. ఇంకా అమెరికా నుంచి సుమారు 12-13 బిలియన్ డాలర్ల వరకు విలువైన చమురు కొనుగోళ్లను పెంచే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే, దీనిపై ఇంకా అధికారిక నిర్ణయం తీసుకోలేదని సమాచారం. కాగా.. రష్యా నుంచి తక్కువ ధరకు ముడి చమురు కొనుగోళ్లు కొనసాగిస్తున్నందుకు గాను భారత్‌పై అమెరికా అదనంగా టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే.

### 4.జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిగా దీపక్ రెడ్డి

వర్గాలు వెల్లడించాయి. 2023 ఎన్నికల్లోనూ దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. అభ్యర్థి ఎంపిక కోసం నియోజకవర్గంలోని పలువురి సీనియర్ల పేర్లను బీజేపీ పరిగణలోకి తీసుకుంది. అందుకు సంబంధించిన జాబితాను రూపొందించి.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు న్యూఢిల్లీ తీసుకు వెళ్లి.. బీజేపీ అధిష్టానం ముందు ఉంచారు. అధిష్టానం లంకల దీపక్ రెడ్డిని ఎంపిక చేసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నామినేషన్ పక్రియ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. దాంతో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత.. బుధవారం నామినేషన్ దాఖలు చేసారు. అంతకు ముందు జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్.. ఎన్నికల ప్రచారంలో ఇప్పటికే దూసుకు పోతున్నారు. 2023 ఏడాది చివరిలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ బరిలో దిగి గెలిచారు. అయితే అనారోగ్యం కారణంగా ఆయన ఇటీవల మరణించారు. దీంతో ఈ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. తాజాగా ఉప ఎన్నిక పోలింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఆ క్రమంలో మాగంటి గోపీనాథ్ భార్య సునీతను బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా బరిలో దింపింది. అలాగే నవీన్ యాదవ్ పేరును కాంగ్రెస్ ఖరారు చేసింది. ఇక బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి తాజాగా ప్రకటించింది. ఉప ఎన్నిక పోలింగ్ నవంబర్ 11వ తేదీన జరగనుంది. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14వ తేదీన వెల్లడి కానున్నాయి. అయితే జూబ్లీహిల్స్ ఓటరు ఏ పార్టీకి పట్టం కట్టాడనేది ఆ రోజుతో తెలిపోనుంది. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది.



## ఆయుధాన్ని అందించి లొంగిపోయిన మల్లోజుల

ఆయుధాలు సరెండర్ చేశారు. బుధవారం ఉదయం మల్లోజులతో పాటు మరో 61 మంది మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టారు. ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో తమ ఆయుధాలను పోలీసులకు అందించారు. ఇక, మల్లోజులపై దాదారు ఆరు కోట్ల రివార్డు ఉండటంతో(ఆరు రాష్ట్రాల్లో కోటి చొప్పున) ముఖ్య మంత్రి ఫడ్నవీస్.. రివార్డును ఆయనకు అప్పగించారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో మోస్ట్‌వాంటెడ్‌గా మల్లోజులు ఉన్నారు. ఈ సందర్భంగా మల్లోజులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. అనంతరం, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ..'మల్లోజుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. దేశంలో మావోయిజానికి చోటులేదు. నక్సల్ ఫ్రీ భారత్ నిర్మిస్తాం' అని చెప్పుకొచ్చారు. అయితే, మావోయిస్టు పార్టీ వైఖరి సరిగా లేదంటూ కొన్ని రోజులుగా మల్లోజుల బహిరంగ లేఖలు రాస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పార్టీలో దశాబ్దాలుగా జరుగుతున్న తప్పిదాలకు తానే కారణమని పేర్కొంటూ అత్యున్నత నిర్ణాయక కమిటీ పొలిట్‌బ్యూరో నుంచి వైదొలిగారు. తాజాగా ఉద్యమాన్ని పూర్తిగా వదిలిపెట్టి అజ్ఞాతం వీడారు. మల్లోజులపై వందకు పైగా కేసులు ఉన్నాయి.

## ఛత్తీస్‌గఢ్ సీఎం ఎదుట లొంగిపోనున్న ఆశన్న

### మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ

### ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల(జనంసాక్షి):** మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిశారు. బుధవారం ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఎదుట లొంగిపోయారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే మావోయిస్టు పార్టీకి మరో షాక్ తగిలింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న.. దాదాపు 70 మంది సహచరులతో కలిసి గురువారం ఉదయం ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ ఎందుట లొంగిపోనున్నట్టు సమాచారం. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్‌వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం అప్పటి హనుమకొండ మండలం కాజీపేటలోని ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్‌కు(ఆర్ఎసయూ) నాయకత్వం వహిస్తూ ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులో అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి.



### ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాల నిరంతర ఆపరేషన్‌తో మావోయిస్టులు పెద్దఎత్తున లొంగిపోతున్నారు. సుక్మా జిల్లాలో బుధవారం ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 27 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో పది మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన వారిపై మొత్తం రూ.50 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టులు అడవి బాట వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని సూచించారు. మావోయిస్టు కంచుకోట బస్తర్‌లో సైతం గడ్చిరోలి తరహా భారీ ఎత్తున మావోయిస్టులు లొంగిపోయేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీ ఉత్తర బస్తర్ డివిజన్ ఇన్‌ఛార్జి రాజ్ మాన్ సహా పలువురు లొంగిపోనున్నట్లు సమాచారం. బస్తర్ ఐజీ సుందర్ రాజ్, కాంకేర్ ఎస్పీ ఇంద్ర కళ్యాణ్ ఈ మేరకు మావోయిస్టులతో చర్చలు జరుపుతున్నారు.

## ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలవండి

### బీహార్‌లో బూత్ వర్కర్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిశానిర్దేశం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు చేరువయ్యేందుకు బిజెపి కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లాలని ప్రధాని మోదీ సూచించారు. అక్కడ అనుసరించాల్సిన వ్యూహంపై ఆ రాష్ట్ర బీజేపీ బూత్ వర్కర్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలను నేరుగా కలుసుకుని తెలియజేయాలని సూచించారు. 'మేరా బూత్ సబ్సే మజబూత్' ప్రోగ్రాంలో భాగంగా 'నమో యాప్' ద్వారా ప్రధానమంత్రి పార్టీ కార్యకర్తలతో బుధవారంనాడు సంభాషించారు. 'ప్రతి కార్యకర్త తమ తమ ఏరియాల్లో మోదీనే. నా తరఫున ప్రభుత్వ పథకాలపై ప్రజలకు గ్యారెంటీ ఇవ్వండి' అని మోదీ సూచించారు. ప్రభుత్వ పథకాలకు, పౌరులకు మధ్య వారధిగా కార్యకర్తలు నిలవాలన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలకు ఏవిధమైన లబ్ధి చూకూరుతోందో ఇంటింటికి వెళ్లి వారికి వివరించాలని కోరారు. ఐక్య ఎన్డీయే ఈ ఎన్నికల్లో విజయాన్ని సాధించి, రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. జీవికా యోజన' పథకంలో లబ్దిదారుగా ఉన్న పూర్ణియాకు చెందిన బీజేపీ కార్యకర్త మేఘా దేవితో మోదీ మాట్లాడుతూ, మహిళా లబ్దిదారులను కలుసుకుని ప్రభుత్వ పథకాలతో వారికి ఏ విధంగా మేలు జరుగుతుందో వివరించాలని సూచించారు. దీపావళి పండుగ వస్తున్నందున ఇంటింటికి వెళ్లి జీఎస్‌టీ తగ్గింపుతో మహిళలకు ఏవిధంగా లబ్ది చేకూరుతోందో వివరించాలని, అందుకు సంబంధించిన డాటాను ఫోన్లలో రెడీ చేసుకుని ఆయా కుటుంబాలకు షేర్ చేయాలని సూచించారు. స్థానిక మహిళా గ్రూపులను కలుసుకుని వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, వాటిని రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని పేర్కొన్నారు. ఈసారి బిహార్‌లో రెండుసార్లు దీపావళి రానుందని, మొదటిది అక్టోబర్ 20న అయితే రెండవది నవంబర్ 14న ఎన్డీయే సాధించబోయే విజయోత్సవమని అన్నారు. ఉమెన్ ఎంఎ÷-లాయిమెంట్ స్కీమ్ ద్వారా బీహార్‌లోని 1.2 కోట్ల మంది మహిళలకు లబ్ది చేకూర్చామని చెప్పారు. కేంద్రం, నితీష్ కుమార్ ప్రభుత్వ హయాంలో అమలవుతున్న పథకాల లబ్దిదారుల జాబితాను తయారు చేసుకోవాలని, సంక్షేమ పథకాల సక్సెస్ స్టోరీలతో కూడిన వీడియోలను తమతమ ఏరియాల్లోని కుటుంబాలకు షేర్ చేయాలని దిశానిర్దేశర చేశారు. ఓటింగ్‌ను పండుగలా జరుపుకోవాలని, కమ్యూనిటీ స్ఫూర్తిని పటిష్టం చేసేందుకు బూత్ టీమ్‌లు లంచ్ షేర్ చేసుకోవాలని అన్నారు. ఆర్జేడీ హయాంలోని ఆటవిక రాజ్యంలో ఎన్నో అకృత్యాలు జరిగాయని, అప్పటి తప్పిదాల పాలన, ప్రస్తుత అభివృద్ధి పాలనకు మధ్య తేడాను యువతకు తెలియజేసే ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. 'బూత్ పటిష్టంగా ఉంటే విజయం మరింత పటిష్టంగా ఉంటుంది' అంటూ ఉత్సాహపరిచారు.

## మరణశిక్ష అమలులో పాతవిధానమే

మార్పులను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధంగా లేకపోవడమే ఇక్కడ సమస్య అని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా దాఖలు చేశారు. కనీసం మరణశిక్ష పడిన ఖైదీకి.. ఉరితీతా? లేదా ప్రాణాంతక ఇంజెక్షనా? అని ఎంచుకునే అవకాశమైనా ఇవ్వాలని పిటిషనర్ కోరారు. అమెరికాలోని 49 రాష్ట్రాలు మరణశిక్ష అమలులో ప్రాణాంతక ఇంజెక్షన్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. దీని వల్ల మరణ సమయంలో శిక్షపడ్డ నేరస్థుడికి తక్కువ వేదన ఉంటుందని ఇప్పటికే పలు అధ్యయనాల్లో తేలిందని పిటిషనర్ అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్ ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి దాన్ని పరిగణించేలా చూడాలని ప్రభుత్వం తరఫున వాదిస్తున్న న్యాయవాదికి సూచించారు. అయితే, పిటిషనర్ సూచన సాధ్యమయ్యేది కాదని.. దాన్ని ఇప్పటికే తమ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు కేంద్రం తరఫు కౌన్సిల్ కోర్టుకు వివరించింది. ఇది విధానపరమైన నిర్ణయమని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని గతంలో పరిశీలించినట్లు కోర్టుకు తెలిపారు. కేంద్రం సమాధానంపై ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. కాలానుగుణంగా ఎన్నో అంశాల్లో మార్పులు వచ్చాయి. కానీ, ప్రభుత్వం మాత్రం ఆ మార్పులను స్వీకరించేందుకు సిద్ధంగా లేదు. అదే ఇక్కడ సమస్యగా మారిందని వ్యాఖ్యానించింది. అయితే, ప్రస్తుతానికి దీనిపై తాము ఎలాంటి విధానపరమైన ఆదేశాలు ఇవ్వలేమని పేర్కొంది. అనంతరం ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను నవంబరు 11వ తేదీకి వాయిదా వేసింది.

# ‘దొంతికి’ ముఖ్యమంత్రి పరామర్శ

• ఎమ్మెల్యే మాతృమూర్తి కాంతమ్మకు నివాళి



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని బుధవారం పరామర్శించారు. దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ ఇటీవల మరణించగా కాజీపేట ప్రశాంత్ నగర్ సమీపంలోని పిజిఆర్ గార్డెన్ లో బుధవారం మాతృ యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, రఘువీర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ప్రజా ప్రతినిధులు ఇతర ప్రముఖులు హాజరు కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తదితరులు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

హెలికాప్టర్ లో హైదరాబాద్ నుండి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ని పరామర్శించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా హనుమకొండ సుబేదారి లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద దిగారు. దొంతి మాధవ రెడ్డి ని పరామర్శించేందుకు హెలికాప్టర్ ద్వారా ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి కి రాష్ట్ర మంత్రి అనసూయ సీతక్క, ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కే ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణ, యశశ్విని రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పుష్ప గుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుండి రోడ్డు మార్గం లో పీజీఆర్ గార్డెన్ లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృ మూర్తి దొంతి కాంతమ్మ మాతృ యజ్ఞం కార్యక్రమం లో పాల్గొన్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే లు దొంతి కాంతమ్మ చిత్రపటం వద్ద పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు మాట్లాడారు. ఎమ్మెల్యే మాధవ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్ట్స్ కళాశాల మైదానానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే లు చేరుకున్నారు. అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుండి హెలికాప్టర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి బయలుదేరారు. హెలిపాడ్ వద్ద మంత్రులు అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే లు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్. నాగరాజు,యశశ్విని రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, ఎన్పీడీసీఎల్ వరుణ్ రెడ్డి, తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి వరంగల్ పర్యటన నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశారు.

# మాగంటి సునీతకు సంపూర్ణ మద్దతు

• బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడు నాగరాజు గుర్రాల



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మాగంటి సునీత గారికి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడు నాగరాజు గుర్రాల తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా నాగరాజు గుర్రాల మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సదుపాయాలు, పారదర్శక పాలన కోసం బీఆర్ఎస్ పార్టీని విశ్వసించాలని, మాగంటి సునీత తెలంగాణ అభివృద్ధి పథంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. అదనంగా, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా కమిటీ ఈ ఉపఎన్నికల ప్రచారంలో పూర్తి ఉత్సాహంతో పాల్గొననుందని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా మెడసాని నరేందర్ రెడ్డి, గుండా జైవిష్ణు నాయకత్వంలో సౌత్ ఆఫ్రికా ప్రతినిధి బృందం జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రచార కార్యక్రమాల్లో భాగస్వామ్యం కానుంది. నాగరాజు గుర్రాల ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ‘ఒక్కసారి ఆలోచించండి, కాంగ్రెస్ ఏం చేసింది? బీజేపీ ఏం చేసింది? తెలంగాణ విషయంలో ఈ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయి. విదేశాల్లో ఉన్న తెలంగాణ వాసులు, ముఖ్యంగా సౌత్ ఆఫ్రికాలోని బీఆర్ఎస్ మద్దతుదారులు, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం కోసం సోషల్ మీడియా, ప్రజా ప్రచార కార్యక్రమాల ద్వారా తమ మద్దతు కొనసాగిస్తారని తెలిపారు.

# ఎర్రగడ్డలో రూ.70 వేల నగదు పట్టివేత

**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో కొనసాగుతున్న తనిఖీల్లో భాగంగా బుధవారం రాత్రి సనత్‌నగర్ పోలీసులు రూ. 70 వేల నగదును పట్టుకున్నారు. బోరబండకు చెందిన సుభాష్ పాటిల్ సనత్‌నగర్ పీఎస్ పరిధిలోని ఎర్రగడ్డ మీదుగా మోతీనగర్ వెళ్లే మార్గంలో బ్రిగేడ్ సిటడెల్ ఎదురుగా పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో సుభాష్ పాటిల్‌ను రూ.70 వేల నగదుతో పట్టుకున్నారు. ఈ నగదు సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని సనత్‌నగర్ సీఐ కె. శ్రీనివాసులు తెలిపారు.




# బీసీ జేఏసీ రాష్ట్ర బంద్ జయప్రదం చేయండి

• పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగాని మల్లేశ్వర్

**హనుమకొండ (జనంసాక్షి) :** బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఈ నెల 18న తలపెట్టిన బంద్ ను విజయవంతం చేయాలని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం కాకతీయ విశ్వవిద్యాలయం పూలే ప్రాంగణంలో పాస్ ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ ఈ నెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్ లో సబ్బండ వర్గాలు పార్టీలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని, అప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చి రిజర్వేషన్ అమలుకు అడ్డంకులు సృష్టించరని విజ్ఞప్తి చేశారు. ఈ బంద్‌లో రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలు, కుల సంఘాలు పాల్గొని ఐక్యత చాటినప్పుడే రిజర్వేషన్ వ్యతిరేకల్లో వణుకు పుట్టుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, పాస్ జిల్లా ఉపాధ్యక్షులు మెరుగు బాబు యాదవ్, పాస్ నాయకులు బోళ్ల వీర ప్రతాప్, డాక్టర్ వంగల సుధాకర్, నీలం ప్రనూప్ తదితరులు పాల్గొన్నారు.

# 18న బంద్‌కు తెలంగాణ యువజన సంఘం మద్దతు

• తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు



**సూర్యాపేట (జనంసాక్షి) :** బీసీ రిజర్వేషన్ల సాధనకు వివిధ బీసీ సంఘాలతో ఏర్పడిన బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ (బీసీ జేఏసీ) ‘బంద్ ఫర్ జస్టిస్’ పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు తెలంగాణ యువజన సంఘం మద్దతు ప్రకటిస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్పందన డిగ్రీ కళాశాలలో తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ ల సాధన కొరకు భవిష్యత్తు లో జరిగే ప్రజా ఉద్యమలకి తెలంగాణ యువజన సంఘము సంపూర్ణ మద్దత్తు తెలియజేస్తూ, ప్రత్యక్ష పోరాటలలో భాగస్వామ్యం అవుతుంది అని ప్రకటించారు. విద్యా సంస్థ లు, వాణిజ్య సంస్థ లు స్వచ్ఛందంగా బంద్ కి మద్దత్తు ప్రకటించి బీసీ ప్రజల న్యాయమైన డిమాండ్ కి అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు భాషిపంగు సునీల్, రాష్ట్ర అధికార ప్రతినిది పంతం యాకయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పోరెళ్ల విప్లవ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మజహార్, జిల్లా నాయకులు ధరవత్ నాగేశ్వరావు, దారావత్ శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లాలో భారీగా గంజాయి పట్టివేత

**సంగారెడ్డి, అక్టోబర్15 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. మునిపల్లి ఎస్సై రాజేశ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈమేరకు కంకోల్ టోల్ఎ÷–లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. రెండు వాహనాల్లో తరలిస్తున్న 260 కిలోల గంజాయి పొట్లాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పారిపోయేందుకు యత్నించగా.. నలుగురిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.1.30 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. వాహనాలను స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బీజేపీ, బీసీ సంఘాల నేతల బాహాబాహీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఫొటోల విషయంలో బీజేపీ, బీసీ సంఘాల నేతల మధ్య వాగ్వాదం జరగడంతో ఇరువర్గాల నేతలు తన్నుకున్నారు. ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీ ఆర్.కృష్ణయ్య వారించేందుకు ఎంత ప్రయత్నించినా వినిపించుకోలేదు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 18వ తేదీన బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరేందుకు బీసీ సంఘాల నేతలతో కలిసి ఆర్.కృష్ణయ్య ఇవాళ ఉదయం బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిశారు. అనంతరం ఇద్దరూ కలిసి ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్న క్రమంలో బీజేపీ, బీసీ సంఘాల నేతల మధ్య వాగ్వాదం నెలకొంది. జూనియర్ అయ్యి ఉండి ఫొటోలకు ఎలా ముందుకు వెళ్తావని గుజ్జా కృష్ణ, గుజ్జా సత్యం ఒకరినొకరు తిట్టుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఆర్.కృష్ణయ్య, రాంచందర్‌రావు ఎదురుగానే ఈ గొడవంతా జరిగింది. కొట్టుకోవడం ఆపేయాలని వారిద్దరూ ఎంత వారించినా వినిపించుకోలేదు. ఈ క్రమంలో సహచర నాయకులు అతి కష్టం మీద అదుపు చేయాల్సి వచ్చింది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి బయటకొచ్చింది.

# అజారుద్దీన్‌తో సినీ దర్శకుడు సయ్యద్ రఫీ భేటీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మొహమ్మద్ అజారుద్దీన్‌తో సినీ దర్శకుడు, తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ రఫీ బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని కలిసిన వివరాలు మీడియాతో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

‘భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి నేను దీర్ఘకాలంగా సానుభూతి చూపించే వ్యక్తిగా ఉన్నాను. ముఖ్యంగా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ పోషించిన పాత్ర పట్ల నాకు ఎనలేని కృతజ్ఞత ఉంది. ఫిల్మ్ మేకర్‌గా, తెలంగాణ ఉద్యమకారుడిగా, జూబ్లీహిల్స్ ఓటరుగా సమాజ రాజకీయ అంశాలపై రచయితగా నా పాత్రలో, రాబోయే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో, కాంగ్రెస్ నాయకత్వానికి ఒక లేఖ ద్వారా నా సూచనను తెలియజేసాను. ఆ లేఖలో, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా మొహమ్మద్ అజారుద్దీన్‌ని పరిగణనలోకి తీసుకోవాలని వినమ్రంగా అభ్యర్థించాను. క్రికెట్‌లో భారత జాతీయ జట్టుకు మాజీ కెప్టెన్‌గా ఆయన సాధించిన ఖ్యాతి, ఆయన స్వచ్ఛమైన, మతనిరపేక్ష ప్రజా ప్రతిష్ట మరియు అన్ని వయస్సుల, వర్గాల ప్రజల మధ్య ఆయనకు ఉన్న ఆదరణ ం ఇవన్నీ ఆయనను జూబ్లీహిల్స్ లాంటి భిన్నాభిప్రాయాల సమాహారమైన్న నియోజకవర్గానికి అనువైన నాయకుడిగా చేస్తాయి. హైదరాబాద్ నగరంపై ఆయనకు ఉన్న లోతైన అనుబంధం, ఎంపీగా ఆయనకు ఉన్న అనుభవం, మైనారిటీలతో పాటు యువత, మధ్య తరగతి ఓటర్ల మధ్య ఆయనకు ఉన్న గౌరవం ం ఇవన్నీ పార్టీకి వ్యూహాత్మక ప్రయోజనాలుగా మారతాయి. ఆయన అభ్యర్థిత్వం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపగలదు. ప్రజల్లో, మీడియాలో ఆసక్తిని రేకెత్తించగలదు. కాంగ్రెస్ నాయకత్వ పునరుజ్జీవనానికి, మతసామరస్యానికి, విశ్వసనీయతకు ఇది బలమైన సందేశంగా నిలవగలదు. తరువాత, ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేసినట్లు ప్రకటించారు. కానీ అది గవర్నర్ ఆమోదం కోసం ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. దీంతో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ రాదని స్పష్టమైంది. ఈ నామినేషన్ ఒక గుర్తింపుగా మేము అంగీకరిస్తున్నాము. కానీ అజారుద్దీన్ స్థాయికి కేవలం ఎమ్మెల్సీ పదవి సరిపోదని భావిస్తున్నాం. ఇప్పటివరకు తెలంగాణ మంత్రివర్గంలో మైనారిటీలకు ప్రాతినిధ్యం లేకపోవడం గమనార్హం. ఎన్నికల కోడ్ అమలులోకి రావడానికి ముందు మంత్రివర్గ విస్తరణ జరిగి ఉంటే, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అది కాంగ్రెస్‌కు ఒక బలమైన అస్త్రంగా ఉండేదే. ఉపఎన్నిక అనంతరం కూడా మంత్రివర్గంలో మైనారిటీ ప్రాతినిధ్యం కల్పించకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల్లో మైనారిటీ ఓట్లను ఆకర్షించడం పార్టీకి సవాలుగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఇటీవల మొహమ్మద్ అజారుద్దీన్‌తో సమావేశమయ్యాను. ఆయనకు తెలంగాణ ప్రభుత్వంలో మరింత విశిష్టమైన స్థానం దక్కాలని నా ఆశాభావాన్ని వ్యక్తపరిచాను. మేము ఆయనకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం’ అని తెలిపారు.

# నకిలీ లెక్చరర్లు అనేది దుష్ప్రచారం మాత్రమే

• తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ జబి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నకిలీ లెక్చరర్లు అనేది దుష్ప్రచారం మాత్రమేనని తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ జబి తెలిపారు. 2023లో రెగ్యులరేషన్ పొందిన జూనియర్ లెక్చరర్లు గత 20 ఏండ్ల నుండి ప్రభుత్వ కళాశాలలను కాపాడుతూ అతి తక్కువ జీతాలకు పని చేస్తూ తమ విలువైన సమయాన్ని పూర్తిగా కాంట్రాక్ట్ ఉద్యోగానికే పరిమితం అయినందుకు అప్పట్లో మానవతా కోణంలో ప్రభుత్వం, హైకోర్టు ఆదేశాల ప్రకారంగానే రెగ్యులరేజషన్ చేసారని, వంద సార్లు సర్టిఫికెట్ల పరిశీలన జరిగిందని, మూడంచెల వ్యవస్థలో ఒరిజినల్ సర్టిఫికెట్ల తనిఖీ చేసారని గుర్తు చేశారు. మొత్తం 3వేల మంది సభ్యులలో తప్పుడు పత్రాలు, ఇతరత్రా కారణాలు గల వారు కేవలం 1 లేదా 2 శాతం ఉండవచ్చు లేక ఉండకపోవచ్చని తెలిపారు. దానిని అధికారులు నిర్ధారిస్తారు కానీ కొందరు నాయకులు ఇంటర్ విద్యా వ్యవస్థను దిగజార్చే విధంగా కావాలని తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం తగదని అన్నారు. అధ్యాపకులు బోధించే సబ్జెక్టు సర్టిఫికెట్లు కాక వేరే పత్రాలు ఉండవచ్చు, లేదా బదిలీల్లో భాగంగా రెగ్యులర్ లెక్చరర్లు వచ్చినపుడు, కాంట్రాక్టు లెక్చరర్ల సర్దుబాటులో కాలయాపన జరిగితే సర్వీస్‌లో కొంత బ్రేక్ ఉండచ్చని, ఇగ కొంత మంది ఇతర రాష్ట్రలలో చదివి ఉండవచ్చు, ఇలాంటి కారణాలను చూపి నకిలీ అని పేరుపెట్టడం, దుష్ప్రచారం చేయడం తప్పు అని సూచించారు. డిగ్రీ అనేది విశ్వ విద్యాలయ స్థాయిలో ఉంటుందని, అది దేశంలో ఎక్కడి నుండైనా చదవచ్చు, కానీ వేరే రాష్ట్రంలో చదివితే నకిలీ అనడం కరెక్ట్ కాదు, నకిలీ సర్టిఫికెట్లు ఉంటే వారి పైన చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవస్థలో 2 శాతం ఉద్యోగుల తప్పులుంటే మిగితా 98 శాతం ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. తమ రెగ్యులరేజేషన్‌ను జీర్ణించుకోలేక కొందరు నాయకులు పనిగట్టుకొని కుట్రలు కుతంత్రాలు చేస్తూ ఇటు లెక్చరర్లను, అటు అధికారులను ఇబ్బంది పెట్టడానికి విఫలయత్నం అవుతున్నారని, అమాయక నిరుద్యోగులను రెచ్చగొడుతూ కోర్టులల్లో కేసులు వేయించడం, దుష్ప్రచారం చేయిస్తూ ఆధ్యాపక విలువలను దిగజార్చు కుంటున్నారని తెలిపారు. రెండో ఇంక్రిమెంట్ విషయంలో అధికార్లను తప్పు దోవ పట్టించి పోలీస్ తనిఖీ పేరుతో కాలయాపనతో ఇంక్రిమెంట్ రాకుండా చేసారని, ప్రభుత్వం వీటన్నింటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ సర్టిఫికెట్లని దుష్ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోని ఇంటర్ విద్యా, లెక్చరర్ల విలువలని కాపాడాలని కోరారు. ఇప్పుడు మంత్రి ద్వారా సీఎస్ పైన ఒత్తిడి తెస్తున్నారని ప్రచారం చేసి ప్రభుత్వాన్ని బద్నామ్ చేయడానికి కుట్రలు చేస్తున్న నాయకులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, విద్యా శాఖ అధికారులను కోరారు.

# సుబేదారి మహిళా కాలేజీలో ఎంబిఎ,ఎంసిఎ సీట్ల భర్తీ

**హనుమకొండ, అక్టోబర్15 (జనంసాక్షి) :** తెలంగాణ ఐసెట్- 2025 కన్వీనర్ విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా 2025-26 విద్యాసంవత్సరానికి కాకతీయ విశ్వవిద్యాలయం సుబేదారి యూనివర్సిటీ మహిళా కాలేజీలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు కొన్ని సీట్లు ఉన్నాయని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 17 నుంచి 21 వరకు స్పాట్ అడ్మిషన్ కోసం ఈ కళాశాలలో హాజరుకావచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.ఎల్. సౌజన్య తెలిపారు. సీట్ల ఖాళీల వివరాలు కాలేజీ నోటీసు బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, అడ్మిషన్లు టీజీఐసెట్-2025 సమన్వయకర్త మార్గదర్శకాలకు అనుగుణంగా ఇవ్వబడతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

• స్కూటీని ఢీకొన్న టిప్పర్...ముగ్గురు అక్కడికక్కడే మృతి

• చికిత్స పొందుతూ 4 నెలల బాలుడు మృతి



**కామారెడ్డి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా, బిక్కనూర్ మండలం, జంగంపల్లి గ్రామం వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 44వ జాతీయ రహదారిపై చోటుచేసు కున్న ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, బోనకల్ మండలం, ముష్టికుంట్ల గ్రామానికి చెందిన గద్దల ఆగన్ (భరత్ కుమార్)కు, ఆదిలాబాద్‌కు చెందిన జాశ్విన్ (25)తో 2020లో వివాహం జరిగింది. వారికి జోయల్ (4), జాట్సన్ (4 నెలలు) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈనెల 8వ తేదీన పిల్లలిద్దరిని తీసుకొని జాశ్విన్ నిద్ర చేసేందుకు పుట్టింటికి వెళ్లింది. ఆమె తండ్రి కిషన్ కామారెడ్డి చర్చి పాస్టర్‌గా పనిచేస్తున్నారు. దీంతో ఆ కుటుంబం ఆదిలాబాద్ నుండి కామారెడ్డి వచ్చింది. జాశ్విన్ తన ఇద్దరు పిల్లలను తీసుకుని కామారెడ్డిలోని తండ్రి వద్దకు వచ్చింది. బుధవారం చిన్న బాబుకు టీకా వేయించేందుకు సమీప బంధవు అయిన ఆశా వర్కర్ జంగంపల్లిలో ఉండటంతో అక్కడకు జాశ్విన్ స్కూటీపై ఇద్దరు పిల్లలతోపాటు తండ్రితో కలిసి వెళ్తోంది. అదే సమయంలో కామారెడ్డి జిల్లా 44వ నెంబర్ జాతీయ రహదారి బిక్కనూర్ మండలం, జంగంపల్లి శివారు వద్ద రాంగ్ రూట్‌లో వచ్చిన టిప్పర్ స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కిషన్ (50), అతని కూతురు జాశ్విన్, మనవడు జోయల్ అక్కడిక్కక్కడే మృతి చెందగా 4 నెలల బాబు జాట్సన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. మృతురాలు జాశ్విన్ భర్త ఆగన్.. చింతకాని మండలం, చిన్నమండల గ్రామంలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందటంతో విషాదఛాయలు అలుముకొన్నాయి.

# నకిలీ లెక్చరర్లు అనేది దుష్ప్రచారం మాత్రమే




2023లో రెగ్యులరేషన్ పొందిన జూనియర్ లెక్చరర్లు గత 20 ఏండ్ల నుండి ప్రభుత్వ కళాశాలలను కాపాడుతూ అతి తక్కువ జీతాలకు పని చేస్తూ తమ విలువైన సమయాన్ని పూర్తిగా కాంట్రాక్ట్ ఉద్యోగానికే పరిమితం అయినందుకు అప్పట్లో మానవతా కోణంలో ప్రభుత్వం మరియు హైకోర్టు ఆదేశాల ప్రకారంగానే రెగ్యులరేజషన్ చేసారు, దీని కోసం వందసార్లు మా సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది, ముడంచెల వ్యవస్థలో ఒరిజినల్ సర్టిఫికెట్ల తనిఖీ చేసారు, మొత్తం 3వేల మంది సభ్యులలో తప్పుడు పత్రాలు, ఇతరత్రా కారణాలు గల వారు కేవలం 1 లేదా 2 శాతం ఉండవచ్చు లేక ఉండకపోవచ్చు.! దానిని అధికారులు నిర్ధారిస్తారు కానీ కొందరు నాయకులు ఇంటర్ విద్యా వ్యవస్థను దిగజార్చే విధంగా కావాలని తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం తగదని ఇంటర్ విద్యా అధ్యాపక ఫోరం నాయకులు మరియు మైనారిటీ అధ్యాపక సంఘ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ జబి తెలిపారు, అధ్యాపకులు బోధించే సబ్జెక్టుకు సంబంధించిన సర్టిఫికెట్లు కాక వేరే పత్రాలు ఉండవచ్చు, లేదా బదిలీలలో భాగంగా రెగ్యులర్ లెక్చరర్లు వచ్చినపుడు, కాంట్రాక్టు లెక్చరర్ల సర్దుబాటులో కాలయాపన జరిగితే సర్వీస్ లో కొంత బ్రేక్ ఉండచ్చు, ఇగ కొంత మంది ఇతర రాష్ట్రలలో చదివి ఉండవచ్చు, ఇలాంటి కారణాలను చూపి నకిలీ అని పేరుపెట్టడం, దుష్ప్రచారం చేయడం తప్పు, డిగ్రీ అనేది విశ్వ విద్యాలయ స్థాయిలో ఉంటుంది, అది దేశంలో ఎక్కడి నుండైనా చదవచ్చు, కానీ వేరే రాష్ట్రం లో చదివితే నకిలీ అనడం కరెక్ట్ కాదు, నకిలీ సర్టిఫికెట్లు ఉంటే వారి పైన చర్యలు తీసుకోవాలి, కానీ వ్యవస్థలో 2 శాతం ఉద్యోగుల తప్పులుంటే మిగితా 98 శాతం ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదు, మా రెగ్యులరేజేషన్‌ను జిర్ణించుకోలేక కొందరు నాయకులు పనిగట్టుకొని ప్రతి రోజు కుట్రలు కుతంత్రాలు చేస్తూ ఇటు లెక్చరర్లను, అటు అధికారులను ఇబ్బంది పెట్టడానికి విఫలయత్నం అవుతున్నారు, అమాయక నిరుద్యోగులను రెచ్చ గోడుతూ కోర్టులల్లో కేసులు వేయించడం, దుష్ప్రచారం చేయిస్తూ ఆధ్యాపక విలువలను దిగజార్చు కుంటున్నారు, రెండవ ఇంక్రిమెంట్ విషయంలో అధికార్లను తప్పు దోవ పట్టించి పోలీస్ తనిఖీ పేరుతో కాలయాపనతో ఇంక్రిమెంట్ రాకుండా చేసారు, ప్రభుత్వం విటన్నిటిపై వెంటనే చర్యలు తీసుకోవాలి, నకిలీ సర్టిఫికెట్లని దుష్ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోని ఇంటర్ విద్యా మరియు లెక్చరర్ల విలువలని కాపాడాలని కోరుతున్నాం, అలాగే ఇప్పుడు మంత్రి ద్వారా సి.ఎస్ పైన ఒత్తిడి తెస్తున్నారని ప్రచారం చేసి ప్రభుత్వాన్ని బద్నామ్ చేయడానికి కుట్రలు చేస్తున్న నాయకులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి గారికి మరియు ఇంటర్ విద్యా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు

సయ్యద్ జబి (రాష్ట్ర అధ్యక్షులు )
ప్రభుత్వ మైనారిటీ ఆధ్యాపక సంఘం-తెలంగాణ

# అరుణ కవిత్వం అవలోకనం

"లోకానికి అక్షరాలు అప్పు పడ్డాను/అందుకే కవిత్వం రాస్తున్నా అంటూ రెండు దశాబ్దాలుగా కవిత్వాన్ని రాస్తూ ఇటీవల అస్తమించిన ఉత్తమ కవయిత్రి ఎన్.అరుణ. తెలుగు సాహిత్యంలో రచయిత్రుల సంఖ్యతో పోలిస్తే కవయిత్రుల సంఖ్య పరిమితం అని చెప్పవచ్చు. కానీ వారి ప్రభావం చెప్పుకోదగినది. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన అరుణ మానవీయ విలువలను సంబంధాలను ఉట్టిపడేలా పాఠకులను అనుభూతి చెందేలా మరోవైపు ఆలోచింపచేసేలా కవితల్ని రాసి మరి ఎంతోమంది కవయిత్రులకు మార్గదర్శనం చేసిన మానవీయ కవయిత్రి అరుణ. నిరంతరం కవిత్వాన్ని శ్వాసిస్తూ ఒకవైపు సృజనాత్మక రంగంలోనూ మరోవైపు పరిశోధన రంగంలోనూ అందె వేసిన సుప్రసిద్ధ కవి ఆచార్య ఎన్ గోపి గారి శ్రీమతి అరుణ. ప్రతి పురుషుని విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందన్న నానుడిని నిజం చేస్తూ అందుకు ఉదాహరణగా ఆమెను చెప్పవచ్చు. ఒకవైపు కుటుంబ బరువు బాధ్యత నిర్వహిస్తూనే అంతర్లీనంగా ఆమెలో ఆవహించిన ఆర్ద్రత ఆ కవయిత్రి హృదయం నుంచి "మౌనము మాట్లాడుతుంది" అనే కవితా సంపుటి నుండి పాటల చెట్టు, గుప్పెడు గింజలు, అమ్మ ఒక మనిషి, హృదయమే వదనం, సూది నా జీవన సూత్రం, నిరీక్షణే ఒక గాయం అనే పేరుతో ఏడు కవితా సంపుటాలను వెలువరించింది. గోపి అరుణ దంపతులు ఇరువురు ఏకధాటిగా కవిత్వాన్ని వెలువరిస్తూ తెలుగు కవిత్వాన్ని సంపన్నం చేశారు. ముఖ్యంగా 2013లో అరుణ కవిత్వాన్ని విశ్లేషిస్తూ 48 మంది కవి పండితులు అరుణ కవిత్వం అవలోకనం పేరుతో డాక్టర్ నీరజ జవ్వాజి సంపాదకత్వంలో విశ్లేషణ గ్రంథాన్ని వెలువరించారు.




**అరుణ ప్రతి కవితలో ఆర్ద్రత అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. "వచ్చేటప్పుడు ఏం వెంట తెచ్చానో తెలియదు/పోయేటప్పుడు ఏం తీసుకెళ్తానో కూడా తెలియదు/ఈ అనుభవాల జ్ఞాపకాలే కదా జీవితం" అంటూ ఆమె రాసిన వాక్యాలు జీవన భాష్యంగా చెప్పవచ్చు.**

అరుణ తీసుకున్న వస్తువు ఏదైనా దాన్ని కవిత్వీకరించడంలో సిద్ధహస్తురాలు. సంపాదకీయ వ్యాసంలో చెప్పినట్టుగా "కవిత్వం వ్యక్తిత్వం రెండు వేరువేరుగా, తూర్పు పడమరల్లా ఉన్న కాలంలో అరుణ గారి వ్యక్తిత్వం కవిత్వంలో ఉషోదయమంత వాస్తవంగా వ్యక్తమైంది"అన్న సంపాదకుల మాటలు అక్షర వాస్తవాలు. "కుప్పనూర్చి, వడ్లను తూర్పార బడితే, తాలు గాలికి కొట్టుకుపోయి, మిగిలిన గట్టి గింజల్లా, నా అక్షరాలు" అంటూ ఆమె చెప్పిన మాటలు మాగిన పండులా పండిన ఆమె అనుభవంలో నుంచి వచ్చిన ప్రతీ కవితకు వర్తిస్తుంది అంటే అతిశయోక్తి కాదు. దంపతులు ఇరువురు కవిత్వం రాసే వాళ్ళు కాబట్టి అది గమనంలోకి తీసుకొని "కవిత్వం అలా ఎగురొచ్చి, మా ముంగిట్లో వాలుతుంది, అక్షరాల గింజల కోసం" అని భావుకతతో భావ గర్భితంగా చెప్పింది. జీవన ప్రస్థానంలో అప్పుడప్పుడు మనిషి లక్ష్యసాధనలో నిరాశ నిస్పృహలకు గురవడం సహజం. కానీ దానివల్ల కృంగిపోకుండా మనిషి ఆశాజీవిగా బ్రతకాలని చెబుతూ "శిశిరంలో మోడువారినప్పుడు, చిలుకలే ఆకులు, ఎర్రని ముక్కులే మొగ్గలు అని ప్రబోధిస్తుంది. పచ్చదనానికి చిలుకలను ఎర్రదనానికి వాటి ముక్కులను సంకేతించడం కవయిత్రిగా ఆమె ప్రతిభకు నిదర్శనం. ప్రపంచీకరణ, పట్టణీకరణ పెరగడంతో పర్యావరణం దెబ్బతింటుందని గుర్తు చేస్తూ అక్కడ చెట్టు, చేమ లేక గూళ్లను ఏర్పాటు చేసుకోలేని పక్షుల నిస్సహాయతను వ్యక్తం చేస్తూ "ఇంత పిట్టవు, ఈ ప్రపంచంలో నువ్వు పట్టవు?" అని మనలో లేని పట్టింపుతనాన్ని గుర్తుచేస్తుంది. ఆడపిల్లలను గుండె మీద కుంపటిగా భావించే సంప్రదాయాన్ని వారిని స్వాభిమాన లతలుగా కీర్తిస్తూ "గుండెల మీద కుంపట్లు, ఎప్పటి మాట, గుండె గూటిలో వెన్నెల దీపాలు, అడవిలో మానులు కాదు, జనారణ్యంలో కదిలే కాంతి దీపాలు" అని అమ్మాయిలలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేస్తుంది. నగరాలలో నడిరోడ్లపై ట్రాఫిక్ సిగ్నల్స్ పడగానే పరుగెత్తుకుంటూ కారు అద్దాలను తుడవడానికి వచ్చే పసి వాళ్ళను తలుచుకుంటూ "బుగ్గల మీద పసితనం ఇంకా ఆరిపోలేదు, వాడు తుడిచే గుడ్డకు వాడి అంగీకీ తేడా లేదు" అని మానవీయ కోణంతో ఆలోచించి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంటుంది. సూది నా జీవన సూత్రం అనే కవితా సంపుటిలో నీటి గింజలు పేరుతో రాసిన కవితలో "చెడిపోయిన నల్లాలోంచి/ఒక్కొక్క బిందువే రాలి పడుతుంటే/అవి వ్యర్థమయ్యే/ధాన్యం గింజలా ఉన్నాయి" అంటుంది. దారి వెంట పోతూ నిత్యం మన కళ్ల ముందు కనిపించే సన్నివేశాన్ని ఎంతచక్కగా ఆవిష్కరించిందో ఈ కవిత వెల్లడిస్తుంది.

ఎన్.గోపి ట్రెండ్ సెట్టర్ గా ఎంతోమంది యువకులను కవులుగా తీర్చిదిద్దింది నానీల ప్రక్రియ. ఆ ప్రభావంతో వందలాదిమంది నానీల కవితా సంపుటులను వెలువరించారు. సహజంగా ఆ ప్రక్రియను నచ్చిన అరుణ గుప్పెడు గింజలు పేరుతో నానీలు రాశారు. "గింజలు, గుప్పెడే అయినా, కడుపులోకి వెళ్తే, రక్త కణాలు" అంటూ అభివర్ణించారు. అవి కవులకే కాదు, పాఠకులకు నూతన శక్తిని బలాన్ని అందిస్తాయి. మమతానురాగాలకు మారుపేరైన బాల్యాన్ని తలచుకుంటూ "సముద్రంలో అల వెనక్కి పోయినట్టు,కాలం వెనక్కి నడిస్తే బాగుండు" అని అంటుంది. ఆమె కవిత్వంలో నోస్టాల్జియాతో పాటు తాత్వికత కూడా అదే స్థాయిలో ఉంటుంది. అందుకే "మనసులో వెలిగే, అపురూప చైతన్య దీపాన్ని, నిరంతరం కాపాడుకోవటమేగా, జీవితమంటే" అని వ్యాఖ్యానిస్తుంది. అరుణ ప్రతి కవితలో ఆర్ద్రత అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. "వచ్చేటప్పుడు ఏం వెంట తెచ్చానో తెలియదు/పోయేటప్పుడు ఏం తీసుకెళ్తానో కూడా తెలియదు/ఈ అనుభవాల జ్ఞాపకాలే కదా జీవితం" అంటూ ఆమె రాసిన వాక్యాలు జీవన భాష్యంగా చెప్పవచ్చు. ఈ సందర్భంగా కదిలించే కవిత్వం రాసి కానరానిలోకాలకు వెళ్లిన అరుణ గారికి అక్షర నివాళులర్పిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
9989148305

## గ్రంథాలయ సహకారం, వనరుల భాగస్వామ్యం - గ్రంథాలయ నెట్వర్కింగ్

గ్రంథాలయాలు సమాచారానికి ముఖ్యమైన కేంద్రాలు. అవి పుస్తకాలు, జర్నల్స్ మరియు డిజిటల్ వనరులను అందిస్తాయి. నేటి కాలంలో గ్రంథాలయాలు ఒంటరిగా పనిచేయడం కష్టం. ఖర్చులు పెరుగుతున్నాయి. వనరులు పరిమితం. అందువల్ల గ్రంథాలయ సహకారం అవసరం. ఇది గ్రంథాలయాల మధ్య సంబంధాలను పెంచుతుంది. వనరుల భాగస్వామ్యం ద్వారా వినియోగదారులకు మరిన్ని సౌకర్యాలు లభిస్తాయి. గ్రంథాలయ నెట్వర్కింగ్ ఇందుకు సాంకేతిక మద్దతు ఇస్తుంది. ఈ మూడు భావనలు పరస్పర సంబంధితాలు. అవి గ్రంథాలయ సేవలను మెరుగుపరుస్తాయి.

గ్రంథాలయ సహకారం అంటే ఏమిటి? ఇది రెండు లేదా అంతకంటే ఎక్కువ గ్రంథాలయాల మధ్య సహకారం. అవి కలిసి పనిచేస్తాయి. లక్ష్యాలను సాధించడానికి సహాయపడతాయి. సహకారం పాత కాన్సెప్ట్. 19వ శతాబ్దంలోనే మొదలైంది. అమెరికాలో మొదటి సహకారాలు చూశాం. ఇది వివిధ రూపాల్లో ఉంటుంది. ఉదాహరణకు, ఇంటర్-లైబ్రరీ లోన్ సిస్టమ్. ఒక గ్రంథాలయంలో లేని పుస్తకాన్ని మరొకటి నుంచి తెచ్చుకోవచ్చు. సహకారం ద్వారా ఖర్చులు తగ్గుతాయి. సమాచారాన్ని వేగంగా పొందవచ్చు. వినియోగదారుల సంతృప్తి పెరుగుతుంది.

వనరుల భాగస్వామ్యం గ్రంథాలయ సహకారానికి ముఖ్యమైన భాగం. ఇది గ్రంథాలయాల మధ్య వనరులను పంచుకోవడం. వనరులు అంటే పుస్తకాలు, పీరియడికల్స్, డేటాబేసెస్. డిజిటల్ కంటెంట్ కూడా ఉంటుంది. భాగస్వామ్యం ద్వారా ప్రతి గ్రంథాలయం తన స్వంత వనరులను మాత్రమే కాకుండా ఇతరాలను ఉపయోగిస్తుంది. ఇది డూప్లికేషన్ ను తగ్గిస్తుంది. అంటే ఒకే పుస్తకాన్ని అనేక గ్రంథాలయాలు కొనాల్సిన అవసరం లేదు. భాగస్వామ్యం రెండు రకాలు. ఒకటి ఫిజికల్ షేరింగ్. మరొకటి డిజిటల్ షేరింగ్. ఫిజికల్ లో పుస్తకాలను లోన్ ఇస్తారు. డిజిటల్ లో ఆన్లైన్ యాక్సెస్ ఇస్తారు.



వనరుల భాగస్వామ్యం ప్రయోజనాలు ఎన్నో. ఖర్చు సమర్థత పెరుగుతుంది. వనరులను మెరుగ్గా ఉపయోగిస్తారు. వినియోగదారులకు విస్తృత సమాచారం లభిస్తుంది. పరిశోధకులు మరిన్ని మూలాలను పొందుతారు. అయితే సవాళ్లు కూడా ఉన్నాయి. కాపీరైట్ సమస్యలు వస్తాయి. ట్రాన్స్పోర్ట్ ఖర్చులు పెరుగుతాయి. సమన్వయం అవసరం. ఇవి పరిష్కరించాలి.

గ్రంథాలయ నెట్వర్కింగ్ సాంకేతిక విప్లవం. ఇది గ్రంథాలయాలను డిజిటల్ గా కలుపుతుంది. నెట్వర్క్ అంటే కంప్యూటర్ల మధ్య కనెక్షన్. గ్రంథాలయాలు తమ క్యాటలాగ్ లను షేర్ చేస్తాయి. వినియోగదారులు ఆన్లైన్ లో శోధించవచ్చు. నెట్వర్కింగ్ రకాలు వివిధం. "లోకల్ ఏరియా నెట్వర్క్ " (లాన్). వైడ్ ఏరియా నెట్వర్క్ (వాన్)-(వర్లడ్ - వైడ్ ఏరియా నెట్వర్క్ . మెట్రోపాలిటన్ ఏరియా నెట్వర్క్ (ఎం.ఏ.ఎన్. )-

నెట్వర్కింగ్ ద్వారా రిసోర్స్ షేరింగ్ సులభం అవుతుంది. ఉదాహరణకు, OCLC (ఆన్ లైన్ కంప్యూటర్ లైబ్రరీ సెంటర్). ఇది ప్రపంచవ్యాప్త గ్రంథాలయ నెట్వర్క్. మిలియన్ల రికార్డులు ఉన్నాయి. ఇండియాలో (ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్ వర్క్)(ఇన్ఫ్లిబినెట్). ఇది యూనివర్సిటీలను కలుపుతుంది. ఈ-జర్నల్స్, థీసెస్ షేర్ చేస్తుంది.(డిల్ నెట్ వర్క్) (డెవలప్మెంగ్ లైబ్రరీ నెట్ వర్క్) కూడా ఉంది. ఇది ఢిల్లీలో మొదలైంది. ఇప్పుడు దేశవ్యాప్తం. ప్రపంచంలో ఉదాహరణలు చూద్దాం. అమెరికాలో రీసెర్చ్ లైబ్రరీస్ గ్రూప్ (ఆర్.ఎల్.జీ.ఆర్). ఇది పరిశోధన గ్రంథాలయాలను కలుపుతుంది. యూరప్ లో (లైబ్రరీ) (ఇండియాలో నేషనల్ నాలెడ్జ నెట్వర్క్) (ఎన్.కే.ఎన్).ఇది హై-స్పీడ్ నెట్వర్క్. విద్యా సంస్థలను కలుపుతుంది. సవాళ్లు ఏమిటి? సాంకేతిక సమస్యలు. శిక్షణ అవసరం. ఫండింగ్ కొరత. ప్రైవసీ ఇష్యూస్. కానీ ప్రయోజనాలు ఎక్కువ. భవిష్యత్తులో (ఏఐ) (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) సహాయంతో మెరుగవుతుంది. వర్చువల్ లైబ్రరీలు వస్తాయి. గ్రంథాలయ సహకారం, వనరుల భాగస్వామ్యం మరియు నెట్వర్కింగ్ ఆధునిక గ్రంథాలయాలకు అవసరం. అవి సమాచార సమాజాన్ని బలపరుస్తాయి. ప్రతి ఒక్కరికీ సమాచారం అందుబాటులో ఉంటుంది. ఇవి కొనసాగించాలి.

# ప్రపంచ ఆర్థిక సంక్షోభం కారణాలు - భారత్‌పై ప్రభావం

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు ఇప్పుడు ఒక క్లిష్టమైన దశలో ఉన్నాయి. ఎందుకంటే కోవిడ్-19 మహమ్మారి తర్వాత కూడా అనేక దేశాలు పూర్తిగా కోలుకోలేదు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రకారం, 2025లో ప్రపంచ ఆర్థిక వృద్ధి 3.2 శాతంగా ఉండనుంది. ఇది 2024లోని 3.3 శాతం నుండి తగ్గుదలను సూచిస్తుంది.

ఈ మందగమనం వెనుక ప్రధాన కారణాలు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం మరియు సరఫరా గొలుసు ఆటంకాలు. ముఖ్యంగా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇంధన ధరలను పెంచి, ఆహార అభద్రతను తీవ్రతరం చేసింది, దీని వల్ల ప్రపంచ ఆర్థిక వృద్ధి 2022లోనే 0.5 శాతం తగ్గినట్లు అంచనా. ఇలాంటి యుద్ధాలు ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయి, కానీ వాటి ప్రభావం అన్ని దేశాలపై సమానంగా ఉండదు.యూరప్ దేశాలు ఎక్కువగా నష్టపోతుండగా, ఇతరులు ఎగుమతి అవకాశాలను పెంచుకుంటున్నాయి. భారతదేశం ఈ సంక్షోభంలో ఒక విశేష స్థానం కలిగి ఉంది. దేశ జీడీపీ 2025లో 6.5-7.8 శాతం వృద్ధి చెందనుంది. ప్రపంచంలోని అతిపెద్ద నాలుగో ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుంది.అయితే, ఈ సంఖ్యల వెనుక లోతైన అసమానతలు దాగి ఉన్నాయి. నిరుద్యోగం 5.1 శాతం వద్ద ఉండగా, ద్రవ్యోల్బణం1.5-3.4 శాతం మధ్య ఊగిసలాడుతుంది.అలాగే పేదరికం రోజుకు 3 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో 5 శాతం ప్రజలను ప్రభావితం చేస్తోంది. పేద, మధ్య తరగతి వర్గాలు ధరల పెరుగుదల, విద్యా-వైద్య ఖర్చులతో సతమతమవుతున్నాయి.

**సంపద అసమానత ఇక్కడ విమర్శనీయం:**

వరల్డ్ బ్యాంక్ 'గినీ' ఇండెక్స్ 25.5గా చూపుతుంది.దీని ప్రకారం భారత్ ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాల్లో ఒకటి. కానీ,ఇతర నివేదికలు టాప్ 1 శాతం 40 శాతం సంపదను కలిగి ఉండటం సూచిస్తున్నాయి. ఇది జీడీపీ వృద్ధిని ప్రజల జీవన ప్రమాణాలతో సమానంగా చేయడంలో విఫలమవుతుందని విమర్శిస్తుంది. ప్రభుత్వ రాయితీలు మరియు పెన్షన్లపై 80 శాతం ప్రజలు ఆధారపడటం దీర్ఘకాలిక సమస్యలను సూచిస్తుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ నిర్ణయాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత దెబ్బతీస్తున్నాయి. 2025లో సగటు టారిఫ్ 18 శాతానికి పెరిగింది. దీని వల్ల ప్రపంచ వాణిజ్యం మందగించి, ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఇజ్రాయెల్-పాలస్తీనా సంఘర్షణ కూడా స్థానికంగా ఇజ్రాయెల్‌కు 55 బిలియన్ డాలర్ల నష్టాన్ని కలిగిస్తుంది. ప్రపంచ సరఫరా గొలుసులను ఆటంకపరుస్తుంది. చైనాలో వృద్ధి 4.7-5.3 శాతం మధ్య ఉండనుంది, కానీ రుణాలు, ఆస్తి సంక్షోభం మరియు వృద్ధాప్య జనాభా సవాళ్లు ఎదుర్కొంటుంది. జపాన్‌లో వృద్ధ జనాభా (80 ఏళ్లు పైబడినవారు అధికం) శ్రామిక శక్తిని తగ్గిస్తుంది, ఆర్థిక మందగమనానికి దారితీస్తుంది. శ్రీలంక, పాకిస్తాన్ వంటి దేశాలు రాజకీయ అస్థిరత్వం మరియు ప్రకృతి విపత్తులతో కుప్పకూలుతున్నాయి. ఈ సమస్యలు విమర్శనీయమైనవి ఎందుకంటే అవి మానవ నిర్మితమైనవి. ఆధిపత్య ధోరణులు, యుద్ధాలు అలాగే అసమాన ఆర్థిక విధానాలు ఉదాహరణకు, భారత్‌లో ప్రైవేటీకరణ విద్యా-వైద్య రంగాలను ఖరీదైనవిగా చేస్తుంది, దీని వల్ల 70 శాతం కుటుంబాలు అప్పుల్లో చిక్కుకుంటున్నాయి. ప్రపంచంలో గ్లోబలైజేషన్ వల్ల దేశాలు పరస్పర ఆధారితమయ్యాయి, కానీ టారిఫ్ యుద్ధాలు దీన్ని దెబ్బతీస్తున్నాయి. విమర్శకులు చెప్పినట్లు, అగ్రదేశాలు తమ అజమాయిషీని తగ్గించి,



**కేంద్ర రుణం జీడీపీలో 57 శాతానికి తగ్గింది, కానీ ఇంటరెస్ట్ పేమెంట్స్ రెవెన్యూ రసీప్ట్స్‌లో 35.72 శాతం. అన్‌రియలైజ్డ్ ట్యాక్స్ రూ.31.11 లక్షల కోట్లు. ఎఫ్ఆర్బీఎమ్ అనుసరణలో పారదర్శకత లోపాలు చాలా ఎక్కువగా ఉన్నాయి.నిబంధనలు సులభతరం చేయాలి.**

ఐక్యరాజ్యసమితి ఆశయాలకు కట్టుబడాలి.

**మెరుగైన మార్గాలు:**

దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంచడం, ఎగుమతి-దిగుమతి సుంకాలను సమంజసంగా ఉంచడం మరియు వలసలను ప్రోత్సహించడం. క్లైమేట్ చేంజ్‌పై దృష్టి పెట్టి, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలి. భారత్ వంటి దేశాల్లో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చి, రైతులకు భరోసా కల్పించాలి. ఉద్యోగ అవకాశాలు పెంచడానికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక పాలన మరియు ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలి. ఉచిత పథకాలకు బదులు స్వయం సమృద్ధిని ప్రోత్సహించడం ద్వారా, పొదుపు సంస్కృతిని పునరుద్ధరించాలి. ఇలా చేస్తే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కళకళలాడుతుంది, మరియు ప్రజల ఆర్థిక-సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుంది.

**భారత ఆర్థిక వ్యవస్థలో ఒడిదొడుకులు:**

ఇండియన్ ఎకనామిక్ సర్వే 2024-25 (ఇది 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ముందు ప్రదర్శించబడినది) దీని ప్రకారం, భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు సానుకూలంగా ఉంది. కానీ కొన్ని సవాళ్లు ఎదరవుతున్నాయి. 2024-25లో రియల్ జీడీపీ వృద్ధి రేటు 6.4 శాతంగా అంచనా వేయబడింది. 2025-26లో 6.3 శాతం నుండి 6.8 శాతం మధ్య వృద్ధి ఉంటుందని ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే, కనీసం దశాబ్ద కాలం పాటు ఎడతెగకుండా 8 శాతం వార్షిక వృద్ధి రేటు కొనసాగాల్సిన అవసరం ఉంటుంది. పెట్టుబడులు, వినియోగదారుల విశ్వాసం, కార్పొరేట్ వేతనాల పెరుగుదల వంటివి వృద్ధిని సాధించటానికి ముఖ్యం. గ్రామీణ డిమాండ్ పెరుగుదల,అలాగే ఆహార ద్రవ్యోల్బణం తగ్గుదల వల్ల దీర్ఘకాలిక వృద్ధి ఉండవచ్చు. అయితే, వస్తువుల ధరల ఆకస్మిక పెరుగుదల షాక్‌లు, వాణిజ్య మరియు భౌగోళిక అనిశ్చితులు వంటి రిస్కులు ఉటాయి.

**రంగాల వారీగా ప్రధాన సమస్యలు-సవాళ్లు:**

**వ్యవసాయం - సంబంధిత రంగాలు:**

2024-25లో 3.5 శాతం వరి, గోధుమ పంటల దిగుబడిలో వృద్ధి కనపడింది. ముఖ్యంగా కంది,పెసర, మినుములు,శనగ పప్పుల దిగుమతులు ,వంట నూనెల కొరత చాలా ఎక్కువగా ఉంది. విదేశాల నుండి వీటి దిగుమతులను బాగా తగ్గించుకోవాలి.కానీ ఇతర దేశాలతో పోలిస్తే ఈ పంటల్లో మన ఉత్పత్తి జనాభాకు సరిపోయే పరిస్థితి ఏ మాత్రం కనపడటంలేదు. ఈ రంగంపై మన రైతులు దృష్టి పెట్టాలి. కేంద్ర ప్రభుత్వం ఈ పంటలకు ఆర్థిక సహాయం చేసి ప్రోత్సహిస్తే కొంతమేరకు అయినా ఉపశమనం దొరుకుతుంది. ఈ పంటల ఉత్పాదకత పెంచుకోవాల్సిన అవసరం ఉంది. నాణ్యమైన బీజాలు, సాగునీరు, మట్టి ఆరోగ్యం వంటివి అవసరం. వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి సవాళ్లతో. ఆహార ద్రవ్యోల్బణం 8.4 శాతానికి పెరిగింది. సరఫరా గొలుసు ఆటంకాలు, కూరగాయలు, పప్పులు వంటివి ప్రభావితం చేస్తున్నాయి. వాతావరణ నిరోధక పంటలు, రైతుల శిక్షణ, ధరల మానిటరింగ్ అవసరం.రైతులకు ఈ పంటను పండించేలా గ్రామీణ బ్యాంకులు రుణాలు విరివిగా ఇవ్వాలి.నిబంధనలు రైతుల కోసం సడలింపులు ఇవ్వాలి.

**పరిశ్రమలు:**

2024-25లో 6.2 శాతం వృద్ధి, కానీ రెండవ త్రైమాసికంలో 3.6 శాతానికి తగ్గింది. ఎగుమతుల మందగమనం, వాణిజ్య పోటీ, వర్షాల ప్రభావం వల్ల మైనింగ్, నిర్మాణాలు బాగా దెబ్బతిన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో (గుజరాత్, మహారాష్ట్ర మొ.) 43 శాతం వాటా, ఈశాన్య రాష్ట్రాల్లో 0.7 శాతం మాత్రమే. ఆర్ అండ్ డీ వ్యయం జీడీపీలో 0.64 శాతం మాత్రమే, ప్రైవేట్ పాల్గొనడం పెంచాలి. వాణిజ్య ఖర్చులు తగ్గించి, ఎగుమతి పోటీతత్వం పెంచాలి.

**సర్వీస్ సెక్టార్‌లో :**

2022-23 నుండి 8.3 శాతం సగటు వృద్ధి, జీడీపీలో 55 శాతం వాటా. నైపుణ్యాల శిక్షణ అవసరం, ప్రభుత్వ-ప్రైవేట్ సహకారం. నిబంధనలు, రూల్స్ సంక్లిష్టతలు వృద్ధిని అడ్డుకుంటున్నాయి.

**బాహ్య రంగం:**

కరెంట్ అకౌంట్ డెఫిసిట్ 1.2 శాతం జీడీపీకి, వస్తువుల వాణిజ్య లోటు పెరిగింది. సర్వీసులు, ట్రాన్స్‌ఫర్లు సహాయపడ్డాయి. వాణిజ్య ఖర్చులు తగ్గించి, గ్లోబల్ సప్లై చైన్‌లలో పాల్గొనడం పెంచాలి. వస్తువుల ధరల షాక్‌లు, భౌగోళిక అనిశ్చితులు సవాళ్లుగా ఉన్నాయి.

ఫిస్కల్ రంగం:

ఫిస్కల్ డిసిప్లిన్ మెరుగుపడింది, క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ 21 శాతం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అవసరాలు పెద్దవి, ప్రైవేట్ గా పాల్గొనడం పెంచాలి. ప్రభుత్వ బడ్జెట్ లో పరిమితులు ఉన్నాయి.

మానిటరీ - ద్రవ్యోల్బణం:

రీటైల్ ద్రవ్యోల్బణం 4.9 శాతానికి తగ్గింది.కానీ ఆహార ద్రవ్యోల్బణం 8.4 శాతం. సరఫరా ఆటంకాలు, వాతావరణ ప్రభావాలు ఎక్కువ ప్రభావ కారణంలు గా కనపడుతున్నాయి.

**ఉద్యోగాలు:**

నిరుద్యోగ రేటు 3.2 శాతానికి తగ్గింది, స్వయం ఉద్యోగాలు 58 శాతానికి పెరిగాయి. శాలరీడ్ జాబ్స్ 22 శాతానికి తగ్గాయి. లేబర్ మార్కెట్ ఫ్లెక్సిబిలిటీ పెంచాలి. అమెరికా,ఇతర ఐరోపా దేశాల్లో నిబంధనలు సంక్లిష్టంగా ఉన్నాయి. ఆ మేరకు మన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు బాగా దెబ్బతింటున్నాయి. నిరుద్యోగులకు, ప్రస్తుత ఉద్యోగులకు న్యూ స్కిల్స్ లెర్నింగ్ అవుట్‌కమ్స్ ను మెరుగుపరచాలి. ఏఐ వంటి స్కిల్స్ అవసరం.

**డీరెగ్యులేషన్ (క్రాస్-సెక్టరల్):**

చిన్న కంపెనీలు పెద్దవి కావడానికి నిబంధనలు అడ్డుగా ఉన్నాయి. బ్యాంకు రుణాల నిబంధనలు, కార్మిక చట్టాలు సరళంగా ఉండటానికి చిన్న పాటి సవరణలు అవసరం. ల్యాండ్, లేబర్, ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ రంగాల్లో డీరెగ్యులేషన్ అవసరం.

**సీఏజీ రిపోర్టులు భారత ఆర్థిక వ్యవస్థపై చేసిన విమర్శలు:**

సీఏజీ రిపోర్టులు (2025లో విడుదలైనవి) పలు ఆర్థిక సమస్యలపై విమర్శలు చేశాయి, ముఖ్యంగా రుణాలు, ఫిస్కల్ పారదర్శకత, జీఎస్టీ సిస్టమ్ వంటివి.

**రాష్ట్రాల రుణాలు:**

2013-14లో రూ.17.57 లక్షల కోట్ల నుండి 2022-23లో రూ.59.6 లక్షల కోట్లకు మూడింతలు పెరిగాయి, జీఎస్డీపీలో 23 శాతానికి చేరింది. కోవిడ్-19 వల్ల పెరిగిన రుణాలు, జీఎస్టీ నష్టాలు, పాపులిస్ట్ స్కీములు కారణం. 11 రాష్ట్రాలు రుణాలను రెవెన్యూ డెఫిసిట్‌కు ఉపయోగిస్తున్నాయి, 'గోల్డెన్ రూల్' ఉల్లంఘన. పంజాబ్ (40.35 శాతం), నాగాలాండ్ (37.15 శాతం) లలో అధికంగా ఉన్నా యి.


**కేంద్ర ఫిస్కల్ మ్యానేజ్‌మెంట్ డిస్క్రెపెన్సీలు:**

ఫిస్కల్ డెఫిసిట్ ఫిగర్లలో అసమానతలు (రూ.17.56 లక్షల కోట్లు యూజీఎఫ్ఏలో వర్సెస్. రూ.17.38 లక్షల కోట్లు బీఏజీలో). అన్‌రియలైజ్డ్ టాక్స్ రెవెన్యూ రూ.21.3 లక్షల కోట్లు, డిస్ప్యూట్ లేని రూ.5.28 లక్షల కోట్లు వసూలు కాలేదు. లోన్లు, ఆర్రియర్స్ ఫిగర్లలో వ్యత్యాసాలు. పారదర్శకత లోపం, డేటా స్థిరత్వం కనపడటం లేదు.

**జీఎస్టీలో ఈ-వే బిల్ సిస్టమ్ లోపాలు:**

ఈ-వే బిల్ పోర్టల్ మరియు జీఎస్టీ పోర్టల్ మధ్య సమన్వయం లేదు. రిటర్న్ ఫైల్ చేయని, రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ అయినవారు బిల్లులు జనరేట్ చేయగలరు. ఒకే ఇన్‌వాయిస్‌కు బహుళ బిల్లులు, కంపోజిషన్ స్కీమ్ ట్యాక్స్‌పేయర్లకు ఇంటర్-ఇంట్రా స్టేట్ వ్యత్యాసం లేదు. నిల్ రిటర్న్ తర్వాత కూడా బిల్లులు. రెవెన్యూ లీకేజ్, ట్యాక్స్ ఖచ్చితత్వం సమస్యలు. ఎన్ఐసీను సరిచేయాలని సిఫార్సులు కూడా ఎప్పటి నుంచో ఉన్నాయి.కానీ వాటిని ఎవరూ పాటించటం లేదు.

చివరిగా.. కేంద్ర రుణం జీడీపీలో 57 శాతానికి తగ్గింది, కానీ ఇంటరెస్ట్ పేమెంట్స్ రెవెన్యూ రసీప్ట్స్‌లో 35.72 శాతం. అన్‌రియలైజ్డ్ ట్యాక్స్ రూ.31.11 లక్షల కోట్లు. ఎఫ్ఆర్బీఎమ్ అనుసరణలో పారదర్శకత లోపాలు చాలా ఎక్కువగా ఉన్నాయి.నిబంధనలు సులభతరం చేయాలి. పై రంగాల్లో నిష్ణాతులైన వారి సలహాలతో వెంటనే కేంద్ర ప్రభుత్వం సంస్కరణల ప్రక్రియ చేయాలి.బడా కార్పొరేట్ కంపెనీల కు కేవలం 3-5 శాతం పన్ను వసూలు చేస్తే దేశంలో చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి.



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496

# ధాన్యం సేకరణ కోసం విస్తృత ఏర్పాట్లు

- పొరుగు రాష్ట్రాల ధాన్యం రాకుండా చెక్ పోస్టులు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత ఏర్పాట్లు, పొరుగు రాష్ట్రాల ధాన్యం రాకుండా సరిహద్దులలో గట్టి నిఘా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్ళపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రులు. ఖరీఫ్ లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం




సేకరణ కోసం జిల్లాలో చేపట్టిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ మంత్రుల దృష్టికి తెచ్చారు. జిల్లాలో ఈసారి ఖరీఫ్ లో 1 .52 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారని, 3,84,800 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాలలో ధాన్యం దిగుబడులు వస్తున్నందున జిల్లాలో 129 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఈ కేంద్రాలలో ధాన్యం సేకరణ జరిపేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. రవాణా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, రైతులు ధాన్యం విక్రయించిన 24 గంటల లోపే ట్యాబ్ ఎంట్రీ జరిగేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ సజావుగా జరగాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. రైతుల నుండి ఏ చిన్న ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు సరిపడా గిడ్డంగులు, స్టోరేజ్ పాయింట్లను గుర్తించాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ , ట్రైనీకలెక్టర్ హర్ష్ చౌదరి ,డీఆర్డీఓ శ్రీనివాస్, డీఎస్ఓ సుదర్శన్, సివిల్ సప్లైస్ డీఎం మోహన్ కృష్ణ,, జిల్లా వ్యవసాయ అధికారి రాజా రత్నం , డీసీఓ నాగార్జున, లీగల్ మెట్రోలజి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ సారంగా పాణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వ్యతిరేకిస్తున్నాం



**శామీర్‌పేట్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** శామీర్‌పేట్ ఎంపీడీఓ కార్యాలయం వద్దకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించాలని కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా బుధవారం శామీర్ పేట్ ప్రెస్ క్లబ్ లో వేణుగోపాల్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మీడియా సమావేశంలో వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 16న శామీర్ పేట్ లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభోత్సవం ఉన్నందున దానిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నానన్నారు. శామీర్‌పేట్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద గదులు ఖాలీగా ఉన్నాయని అందులోకి సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాన్ని మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రొసిడింగ్ కాపీ ఆధారంగా మార్చాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించడం వల్ల అందరి అందుబాటులో ఉండడంతో పాటు ప్రతి ఒక్కరికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ నెల 16న శామీర్ పేట్ దర్గా వద్ద ప్రారంభించుకోనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాన్ని ప్రారంభం కాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి భిక్షపతి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కముటం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హెూంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించి జీవితాల్లో వెలుగులు నింపాలి

- హైదరాబాద్ నూతన సిపి సర్జనార్‌కు హెూంగార్డుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి



**ఖైరతాబాద్, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** హెూంగార్డ్సుకు ఉద్యోగ భద్రత కల్పించి తమ జీవి తాలలో వెలుగులు నింపాలని కోరుతూ హైదరాబా ద్ పోలిస్ కమీషనర్ సజ్జనార్ కు తెలంగాణ హెూం గార్డుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు హనుమం త్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న దాదాపు 16 వేల పైచిలుకు మంది హెూంగార్డులు శాంతి భద్రతల పరిరక్షణలో సమాజ సేవలో సంఘ విద్రోహశక్తులను అణిచి వేయడంలో ప్రకృతి వైపరిత్యాలు సంభవించిన ప్పుడు కరోనలాంటి విపత్కర పరిస్థితులలో ఫ్రంటై న్ వారియర్స్ గా ప్రాణాలు లెక్క చేయకుండా సమాజసేవే లక్ష్యంగా పోలిస్ శాఖలో కానిస్టేబుల్స్ తో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపా రు. ఐనప్పటికి తమకు ఉద్యోగ భధ్రత, ఆరోగ్య భద్రత, డైలి అలవెన్సులు, ట్రావెలింగ్ అలవెన్స్ లు, పి.ఎఫ్, సాధరణ సెలవులు, మెడికల్ సెలవులు, రిటైర్మెంట్ అయినవారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎలాంటి బేనిఫీట్స్ లేక మా కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు.చనిపోయిన వారి కుటుంబాల పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉందన్నా రు. కావున హెూంగార్డుల కుటుంబాలపై దయఉంచి చనిపోయిన వారి కుటుంబాలలో ఒకరికి కారుణ్య నియామకం క్రింద హెూంగార్డుగా ఉద్యోగం ఇప్పించా లని కోరారు.తమ అర్థిక స్థితిగతులను, పిల్లల భవి షత్తును దృష్టిలో పెట్టుకోని పెద్ద మనుసుతో స్పెష ల్ పోలిస్ సెక్రటరీ రాజీవ్ త్రివేది సారు రూపకల్పన చేసిన స్పెషల్ పోలిస్ అసిస్టెంట్ ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. వి.ఆర్.ఏ, సెర్ప్ ఉద్యో గుల మాదరిగా తమ విద్యార్హతలను బట్టిహెూంగా ర్డుల ఏదైనా యూనిఫామ్ సర్వీసులలో విలీనం చేసే విధంగా తగుచర్యలు తీసుకోని తమకు బం గారు భవిషత్తు అందించి జీవితాలలో వెలుగులు నింపి హెూంగార్డుల సంక్షేమానికి కృషిచేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్వో ఆకుల రాజేం దర్ ప్రసాద్, ట్రెజరీ గోపాల్ నాయక్, సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి, హైదరాబాద్ సిటీ హెూంగార్డు ప్రెసిడెంట్ ఏడుకొండలు, సైబరాబాద్ సీనియర్ నాయకులు బొక్క గోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటకుల భద్రతే లక్ష్యం

- జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా ఎస్పీ నారా యణ రెడ్డి, జిల్లా ఫారెస్ట్ అధికారి శ్రీజ్ఞానేశ్వర్ తో కలసి ఇటీవల జిల్లాకు చెందిన "టూరిస్ట్ పోలీస్" అధికారులుగా "నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్" నందు ప్రత్యేక శిక్షణ పొందిన 10 మంది పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసి, పర్యాటకులకు అత్యుత్తమ భద్రత కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ టూరిస్ట్ పోలీస్ వ్యవస్థను తొలిసారిగా ప్రవేశపెట్టింది అని, పర్యాటకుల భద్రత, రక్షణ విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రముఖ పర్యాటక కేంద్రాలైన శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం, అనంతగిరి అటవీ ప్రాంతం, కోట్‌పల్లి రిజర్వాయర్ వంటి కీలక ప్రాంతాల్లో పర్యాటకులు వచ్చే మార్గాల్లో టూరిస్ట్ పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అధికారులు పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వారి యాత్ర ఆహ్లాదకరంగా ఉండేందుకు మార్గదర్శనం చేస్తూ, అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ ఆదేశించారు.ప్రత్యేక శిక్షణలో భాగంగా అధికారులు నేర్చుకున్న కమ్యూనికేషన్ నైపుణ్యాలు, విపత్తుల నిర్వహణ, పర్యాటక ప్రాంతాలలో నిఘా వ్యవస్థ పర్యవేక్షణ, ప్రథమ చికిత్స వంటి అంశాలను విధుల్లో సమయస్ఫూర్తిగా వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా, పర్యాటక ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ,ప్రత్యేక నిఘా ఉంచి, శాంతిభద్రతలను పటిష్ఠంగా కాపాడాలని స్పష్టం చేశారు. టూరిస్ట్ పోలీసులు స్థానిక అటవీ, రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, జిల్లా పర్యాటక అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ నూతన వ్యవస్థ వికారాబాద్ పర్యాటక ప్రాంతాల ప్రతిష్ఠను ఇనుమడింపజేసి, పర్యాటకుల సంఖ్యను మరింత పెంచుతుందని ఎస్పీ నారాయణ రెడ్డి ఆకాంక్షించారు. ఇట్టి కార్యక్రమం లో డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్ , సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** మిస్సైల్ మాన్ భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన సేవలను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గుర్తు చేశారు.బుధవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో )లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ గా పనిచేసిన ఆయన భారతదేశపు మిస్సైల్ మ్యాన్‌గా పేరుగాంచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల చందర్ , పట్టణ మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

అండర్ 14,అండర్ 17 బాల, బాలికలకు నిర్వహించే ఖోఖో ,కబాడీ, వాలీబాల్ చెస్ అథ్లెటిక్స్ క్రీడలను బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులచే గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఒలంపిక్ జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 మండలాల నుంచి క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, విద్యాశాఖ అధికారులు ఆయా మండలాల క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థులు వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలి



**కొడంగల్, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని సిపిఐ నియోజకవర్గ నాయకులు గంటి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా గంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ, "దేశంలోని జనాభా గణాంకాలను పరిగణనలోకి తీసుకొని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ, దాన్ని కొట్టివేయడం బాధాకరం" అని అన్నారు. బీసీల హక్కుల కోసం సిపిఐ పోరాడుతుందని, ఆ జీవోను కాపాడేందుకు కోర్టు కేసులో పార్టీ ఇంప్లీడ్ అయిందన్నారు.మోదీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ ప్రతిపాదన చేసినప్పటికీ, పార్లమెంట్‌లో చట్టంగా అమలుపర్చకుండా కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవడంలేదన్నారు. బీజేపీ నిజంగా బీసీల పక్షాన ఉంటే, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి అని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ నాయక్, హుస్సేన్, భీమప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో హైడ్రాతో పార్క్ భూముల విముక్తి



రాజేంద్రనగర్, అక్టోబర్ 15 (జనం సాక్షి) : రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండల పరిధిలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కఠిన చర్యలు చేపట్టింది. బుధవారం బుద్వేల్, ఉప్పరపల్లి గ్రామాల పరిధిలోని జనచైతన్య లేఔట్ ఫేజ్-1, ఫేజ్-2 ప్రాంతాల్లో పార్కులుగా గుర్తించిన స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా బుధవారం భారీ స్థాయిలో తొలగింపు చర్యలు చేపట్టింది. మొత్తం 19,878 గజాల పార్క్ భూమిని ఆక్రమణదారుల నుండి స్వాధీనం చేసుకుని, దాని విలువ సుమారు రూ.139 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు వెల్లడించారు.దాదాపు 120 ఎకరాల్లో హుడా ఆమోదంతో ఏర్పాటు చేసిన జనచైతన్య లేఔట్‌లోని 4 పార్క్ స్థలాలను కొందరు వ్యక్తులు ప్రహరీలు నిర్మించి, షెడ్డులు, గదులు వేసి ఆక్రమించుకున్నట్లు హైడ్రా విచారణలో బయటపడింది. రెవెన్యూ, మున్సిపల్ శాఖల సమన్వయంతో హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆక్రమణలను తొలగించింది. 3,000 గజాలు, 1,000 గజాలు, 500 గజాల చొప్పున నిర్మించిన షెడ్డులను నేలమట్టం చేసింది. ఆక్రమణల తొలగింపు అనంతరం భూములపై ఫెన్సింగ్ పనులను వెంటనే ప్రారంభించడంతో, పార్క్ స్థలాలు కబ్జాల చెరనుండి పూర్తిగా విముక్తి పొందడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## అప్పుల భారంతో ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఆత్మహత్య



**రాజేంద్రనగర్, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మహత్య ఘటన చోటుచేసుకుంది. నార్సింగి పోలీసుల ప్రకారం రామ్‌దేవ్‌గూడ, గోల్కొండ మండలం, హైదరాబాద్‌కి చెందిన ఎం.బి. రాములు (55), ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్, ఆయన గత కొంతకాలంగా వ్యాపారంలో నష్టపోయి తీవ్రమైన అప్పుల బారిన పడి మానసిక ఆందోళనకు గురయ్యాడు.14 అక్టోబర్ 2025 ఉదయం 10 గంటల సమయంలో తన భార్య ఉమారాణితో చిన్న వాగ్వాదం జరిపి ఇంటి నుండి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆయన ఆచూకీ లభ్యం కాలేదు.అయితే 15 అక్టోబర్ ఉదయం 8 గంటల సమయంలో మంచిరేవుల గ్రామంలోని గోపాలస్వామి ఆలయం సమీపంలో రాములు చెట్టుకు తాడు కట్టి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు గుర్తించారు. ఈ విషయం తెలిసిన వెంటనే భార్య ఉమారాణి నార్సింగి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, అనంతరం పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో రాములు తీవ్ర అప్పుల భారంతో మానసిక ఆందోళనకు లోనై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# వికారాబాద్ జిల్లాలో ఆటవిక అరాచకం

- అక్రమ సంబంధం కలిగిన ఇద్దరు వ్యక్తుల నిర్బంధం
- నగ్నంగా చెట్టుకు కట్టి చిత్రవధ
- పెండ్లి రకం కింద రెండు లక్షల వసూలు చేసిన బంధువులు
- మొగలిగుండ్ల గ్రామంలో ఘటన

**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** నాగరిక సమాజంలో నాగరికత తెలిసిన వారు దారుణాలకు ఒడిగడుతున్నారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా ఆటవిక అరాచకానికి పాల్పడుతున్నారు. అక్రమ సంబంధం నేపంతో అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులను నిర్బంధించి. నగ్నంగా ఊరేగించి చిత్రవధ చేసిన సంఘటన వికారాబాద్ జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళితే మర్పల్లి మండలం మొగిలి గుండ్ల గ్రామంలో ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కొన్ని సంవత్సరాల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వారికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ప్రేమ పెళ్లి చేసుకున్న వారు గత నాలుగు సంవత్సరాలుగా వేరువేరుగా ఉంటూ జీవనోపాధి గడుపుతున్నారు. భర్త స్వగ్రామంలో ఉండగా భార్య సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరువులోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఆయాగా పనిచేస్తుంది. దీంతో అదే పాఠశాలలో పనిచేస్తున్న ఒక బస్సు డ్రైవర్‌తో అక్రమ సంబంధం పెట్టుకుంది. వీరి వివాహేతర సంబంధం విషయమై వారి ముగ్గురు కూతుళ్లకు తెలిసింది. అయితే దసరా పండగ తర్వాత వీరి కూతుళ్లు స్వగ్రామానికి రావడం. తల్లి అక్రమ సంబంధం విషయమై వారు తమ తండ్రికి తెలియజేశారు. దీంతో మొగిలి గుండ్ల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పఠాన్ చెరువుకు వెళ్లి అక్రమ సంబంధం కలిగి ఉన్న బస్సు డ్రైవర్ తో ఒక అద్దె ఇంట్లో సహజీవనం చేస్తుండగా పట్టుకున్నారు.

అదే రోజు రాత్రి ఇరువురిని నిర్బంధించి మొగిలి గుండ్ల గ్రామానికి తీసుకువచ్చారు. ఇద్దరిని నగ్నంగా బజారులో ఊరేగించారు. అనంతరం తెల్లవారుజాము దాదాపు మూడు గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు స్తంభానికి చెట్టుకు కట్టి కర్రలు ఇనుప రాడ్లతో కొట్టి చిత్రవధ చేశారు. ఈ విషయం బస్సు డ్రైవర్ బంధువులకు తెలియడంతో వారు మర్పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ విషయమై మర్పల్లి పోలీసులు సమాచారాన్ని సేకరించే లోపు గ్రామస్తులు కొందరు ఇద్దరు వ్యక్తుల కట్లు విడిచి మర్పల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ విషయమై బస్సు డ్రైవర్ బంధువులు బాధిత మహిళ బంధువులు కలిసి పంచాయతీ పెట్టారు. సదరు మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నందుకు పెండ్లి రకం కింద రెండు లక్షలు ఇవ్వాలని ఇరువురు అంగీకారానికి వచ్చినట్లు తెలిసింది. అయితే తీవ్ర మనస్థాపానికి గురైన మహిళ ఇంట్లో నుంచి కాలకృత్యాలకు వెళుతున్నట్లు చెప్పి పారిపోవడంతో ఈ విషయం ఆ నోట ఈ నోట వెలుగులోకి వచ్చింది. ఊరి నుంచి పారిపోయే ముందు ఆ మహిళ ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

## కేసీఆర్ రిసార్ట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



**మహేశ్వరం, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** మహేశ్వరం మండలంలోని గట్టుపల్లి గ్రామంలో ఉన్న కేసీఆర్ రిసార్ట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మహేశ్వరం మండలం బీజేపీ అధ్యక్షుడు యాదిష్ డిమాండ్ చేశారు. బుధవారం మహేశ్వరం మండలంలోని నాగారంలోని కుండే వెంకటేష్ ఫామ్ హౌస్‌లో బీజేపీ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదిష్ మాట్లాడుతూ...వీరాంజనేయ స్వామి గుడి సమీపంలో అసాంఘిక కార్యక్రమాలు రేవ్ పార్టీలు నిర్వహించిన కేసీఆర్ ఫామ్ హౌస్ ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.నేడు ఉదయం 11 గంటలకు నాగారం గ్రామంలో కుండే వెంకటేష్ ఫామ్ హౌస్ లో మహేశ్వరం మండల బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం ఉంటుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బీజేపీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ,రఘునందన్ రావు,బీజేపీ నాయకులు రానున్నారన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మిద్దె సుదర్శన్ రెడ్డి,అనంతయ్య గౌడ్,మాధవచారి,అయిల్ల యాదయ్య గౌడ్,కుండే వెంకటేష్,యాదయ్య,దేశ్యా నాయక్ పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
16 అక్టోబర్ 2025

# ర్యాలంపాడు పునరావాస కేంద్రంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

• జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్

**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** ర్యాలంపాడు పునరావాస కేంద్రంలో పెండింగ్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. పునరావాస కేంద్రంలో అన్ని సదుపాయాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయబడుతున్నందున, గ్రామ ప్రజలు ఇక్కడికి వచ్చి ఇళ్లు నిర్మించి జీవితం కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. బుధవారం ధరూర్ మండలంలో ర్యాలంపాడు పునరావాస కేంద్రంలోని సదుపాయాలు కల్పించే అంశమై జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్,గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి గ్రామస్తులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాలంపాడు గ్రామ ప్రజలు తమ భూములను అందజేయడం వలన,జిల్లాలో ఒక లక్ష 80 వేల ఎకరాలకు సాగునీరు అందించే 4 టీఎంసీ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. భూములు కోల్పోయిన ప్రజలకు ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వాటిని పునరాసవ కేంద్రాలలో అందజేస్తోందని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం రోడ్లు, త్రాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాము,గ్రామ పంచాయతీ భవనాలు, సబ్ సెంటర్లు,అంగన్వాడి కేంద్రాలు, దేవాలయాలు, చర్చిలు లాంటి



అన్ని అవసరాలను లేఅవుట్ ప్లాన్ ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ప్రతి ప్లాన్‌కి అనుగుణంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. భూసేకరణలో 67 ఎకరాల 28 గుంటలు భూమిలో మొత్తం 823 ప్లాట్లను ఏర్పాటు చేయగా, ఇప్పటికే 695 ప్లాట్లును భూ నిర్వాసితులకు మంజూరు చేయడం జరిగిందని, సమస్యలు ఉన్న 5 ప్లాట్లను ఖాళీ ఉన్న ప్లాట్లలో మళ్లీ అందించడం జరుగుతుందని తెలిపారు. 78 ప్లాట్లలో నీరు నిలుస్తున్నందున, మట్టితో భర్తీ చేసే వాటిని లెవెల్ చేస్తామని తెలిపారు. అనుకూలంగా లేని మరో 14 ప్లాట్లను కూడా ఖాళీ ప్లాట్లలో మంజూరు చేయడం జరుగుతుందని, లేదా వాటికి సంబంధించిన నూతన భూసేకరణ కోసం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ సమస్యలు, త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు లింక్ రోడ్లను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామానికి స్మశాన వాటికకు స్థలం కేటాయించడం జరుగుతుందని, అలాగే పెండింగ్‌లో ఉన్న షిఫ్టింగ్ చార్జీలను వెంటనే చెల్లించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ఈ గ్రామంలో 250 పైగా ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, మంజూరైన ప్రతి ఒక్కరు తమ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం వారి ఖాతాల్లో నిధులు జమ అవుతాయని, అవసరమైతే మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించబడతాయని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలించి,అన్ని పనుల వివరాలు, ప్రగతి పనుల పురోగతి గురించి చర్చించారు. అనంతరం గ్రామ ప్రజలు తమ సమస్యల పట్ల జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యేకు వినతిపత్రాలను అందజేయగా, వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, ఆర్డీవో అలివేలు, తహసీల్దార్ నరేందర్, నీటి పారుదలశాఖ ఈ.ఈ శ్రీనివాసులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



**జడ్చర్ల, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** టి.జి.ఎస్.ఆర్.టి.సి లో విధులు నిర్వహిస్తున్న ఎస్సి, ఎస్టి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టిపిసిసి కోఆర్డినేటర్, టీజీఎస్ఆర్టిసి ఎస్సి, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన గౌరవ అధ్యక్షులు ధార భాస్కర్ అన్నారు. టి.జి.ఎస్.ఆర్.టి.సి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని బుధవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అందరి సమక్షంలో సంఘం గౌరవ అధ్యక్షులుగా దార భాస్కర్ ను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ధార భాస్కర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, సంఘ సభ్యులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించుటకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. అనంతరం ధారా భాస్కర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధార సుందర్, చంద్రయ్య, నరసింహ, కృష్ణా నాయక్, రామన్న, వెంకటయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన సామన్ చెరువును కాపాడాలి



**మాగనూరు, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** మండల కేంద్రమునకు సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర గల సామన్ చెరువు 22 ఎకరాల విస్తీర్ణం ఉన్నదని కొందరు రైతులు అక్రమంగా అలుగుని మరియు భూమిని కబ్జా చేయడం జరిగిందని రైతు సంఘం మండల అధ్యక్షులు బాల్ రాజు తెలిపారు, బుధవారం తాసిల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ యాదయ్య కు వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ అధికారులు సర్వే నిర్వహించి చెరువు యొక్క హద్దులను గుర్తించాలని కోరారు, కబ్జా చేయడం వల్ల పక్క పొలాలకు సాగునీరు సరిగ్గా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు, వెంటనే సర్వే చేయించి అక్రమంగా కబ్జా చేసినటువంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో రైతులు నరేష్, గోవిందు, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

# అయిజ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ బుధవారము అయిజ పోలీసు స్టేషన్ ను సందర్శించి సిబ్బంది యూనిఫామ్ టర్న్ ఔట్, స్టేషన్ రికార్డ్స్, పరిసరాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అయిజ పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల మెంటేనేన్స్ ను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేస్తూ.. కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను తనఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని, ఆస్థి సంబంధిత నేరాలకు సంబంధించి, అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్‌లుగా గుర్తించి, పగలు, రాత్రి బీట్ డ్యూటీల ద్వారా నిఘా కట్టుదిట్టం చేయాలని సూచించారు. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు పోలీస్ స్టేషన్‌గా ఉన్నందున ఎలాంటి ఇల్లీగల్ రవాణా జరుగకుండా చెక్ పోస్ట్‌ల దగ్గర పటిష్ట నిఘా ఉండాలని ఎస్సై శ్రీనివాస్ కు సూచించారు. రిసిప్షన్ సిబ్బంది స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ లో నమోదు చేయాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని అన్నారు. విపిఓలు గ్రామాలపై పూర్తి అవగాహనా ఉండాలని, రౌడీ షిటర్స్, సస్పెక్ట్‌ల పై నిఘా ఉంచాలని, గ్రామాలలో తిరుగుతూ ప్రజలతో మమేకం అవ్వాలని, తద్వారా గ్రామాలలో ఎలాంటి సమాచారం కావాల్లన్న ముందస్తుగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామాలలో అనుమానిత వ్యక్తులను పాపిలోన్ డివైస్ ను వినియోగించి, వేలిముద్రాలను చెక్ చేస్తూ,పాత నేరస్తులను గుర్తించాలని అన్నారు. నేరాల అదుపులో, జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ ప్రజలే స్వచ్ఛందంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ



విధి నిర్వాహణలో అంకిత భావంతో పని చేయాలని. ఎవరికీ కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. ఈ తనిఖీలలో ఎస్పీ వెంబడి అదనపు. ఎస్పీ కె. శంకర్, డి.ఎస్పీ మొగిలయ్య, శాంతినగర్ సీఐ టాటా బాబు,ఎస్సై శ్రీనివాసులు, తరుణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి



• జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రోడ్డు భద్రతపై జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు కీలకమైనవని అన్నారు. ఈ చర్యలను తీసుకోవడంలో అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని, ప్రతి శాఖ సమిష్టిగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) గుర్తించి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే మీద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్నచోట్ల ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మానవ తప్పిదాలు, వాహనాలు, అత్యధిక వేగం వలన రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. రోడ్లపై రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటి రహదారి సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారి ఇరువైపులా పెద్దగా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. పెద్ద చెట్ల వలన లైటింగ్ కనిపించకుండా ఉంటుందన్నారు.ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయంతో జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు సంభవించకుండ పటిష్టంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అధిక వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వేగ పరిమితిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఎక్కువగా ప్రమాదాలు జరిగే స్పాట్స్‌ని గుర్తించాలన్నారు. రోడ్డులు సరిగా లేని చోట్ల, వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే చోట సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అరాచక పాలనతో రాష్ట్రం అధోగతి

• మాగంటి.సునీత గెలుపు ఖాయం
• మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రచారం



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** కాంగ్రెస్ అరాచక పాలనతో, రాష్ట్రం అధోగతి పాలు అయ్యిందని,,కె.సి.ఆర్ ది ప్రజా పాలనఅని,రేవంత్ రెడ్డిది విధ్వంసక పాలనగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభివర్ణించారు. ప్రజలకు అండగా నిలిచిన మాగంటి.గోపీనాథ్ భార్య మాగంటి సునీతను ఆదరించి ఆశీర్వదించాలని జూబ్లిహిల్స్ ప్రజలను మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కోరారు.బుధవారం రహ్మత్ నగర్ డివిజన్లో హనుమాన్ దేవాలయం నందు పూజలు నిర్వహించిన అనంతరం, వనపర్తి నాయకులతో కలసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైన కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కులేదని ఘాటుగా విమర్శించారు.పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానకరంగా మాట్లాడిన మంత్రులు మహిళలకు,క్షేమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లిహిల్స్‌తో పాటు హైదరాబాద్ నగరాని అభివృద్ధి చేసిన కె.సి.ఆర్ బలపరిచిన సునితమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

• గుడెబల్లూర్ కాంప్లెక్స్ ఎచ్ ఎం గణేశ్ సింగ్

**కృష్ణ, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ద చూపాలనీ గుడెబల్లూర్ స్కూల్ కాంప్లెక్స్ ఎచ్ ఎం గణేష్ సింగ్ అన్నారు.బుధవారం కృష్ణ మండలం ముడుమాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి అకాడమీక్ అంశాలను పరిశీలించారు. తరగతి గది భోదన, సి గ్రేడ్ విద్యార్థుల సామర్థ్యాలు, టీయల్ యం వియోగం, టీచింగ్ డైరీ ఏఐ కంప్యూటర్ ల్యాబ్ నిర్వహణ, డిజిటల్ కరికులమ్ అమలు గ్రంథాలయ పుస్తకాల వినియోగం, విద్యార్థుల పఠన సామర్థ్యాలు, గ్రంథాలయ రిజిస్టర్ నిర్వహణ మధ్యాహ్నం భోజనం అమలు తీరుతెన్నులను పరిశీలించారు. పాఠశాల రికార్డులు, రిజిస్టర్ లను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్నది, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్, ఉపాధ్యాయులు భారతి రవికుమార్, ఆస్మా నిషాత్, పద్మావతమ్మ , వాలంటీర్ శిరీష, సర్వీస్ పర్సన్స్ సోఫీ, శివమ్మ, మధ్యాహ్న భోజన సిబ్బంది పద్మమ్మ, నర్సమ్మ, సురేఖ, హాఫీజా పాల్గొన్నారు.



# ధాన్యం సేకరణ ప్రక్రియ కొనుగోలుకు విస్తృత ఏర్పాట్లు

• జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** ఖరీఫ్ 2025-26 - వానాకాలం లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. ఖరీఫ్ 2025-26 - ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లలో ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాల కలెక్టర్లు కు సూచించారు . ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ సజావుగా జరగాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సంగారెడ్డి జిల్లా నుండి కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మాధురి, జిల్లా పౌరసరఫరాల శాఖ, వ్యవసాయశాఖ, సహకారశాఖ ,గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష జరిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత ఏర్పాట్లు



చేయాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ముందుగా హార్వెస్టర్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేయరాదని, ప్రతి మండలం, నియోజకవర్గానికి ప్రత్యేక అధికారులు, సూపర్వైజర్లు నియమించాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, వాతావరణ శాఖ రిపోర్టులను కేంద్ర నిర్వాహకులకు తెలియజేయాలని అన్నారు. జిల్లాలో వరి కొనుగోలు కంట్రోల్ రూమ్, టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇతర జిల్లాల నుండి ధాన్యం రాకుండా ఇంటర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓపీఎంఎస్ వ్యవస్థలో మిల్లుల ట్యాగింగ్ పనులు పూర్తి చేయాలని, పిపిసి సెంటర్ల నుండి నిర్ధారిత రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో తాగునీటి వసతులతో పాటు విద్యుత్ సౌకర్యం రైతుల విశ్రాంతి కోసం షెడ్ల ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాలకు దాన్యం తీసుకువచ్చే రైతులు సరియైన తేమ శాతం ఉండేలా చూడడంతో పాటు ధాన్యం తూర్పార బట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. తార్పాలిన్లు, ఆటోమేటిక్ వరి శుభ్రపరచే యంత్రాలు, పెద్ద/చిన్న వరి క్లీనర్లు, ధాన్య కొలమాన పరికరాలు (గ్రేయిన్ కాలిపర్స్), తేమ కొలిచే మీటర్లు (మొయిసచర్ మీటర్స్), ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, పొట్టు తొలగించే యంత్రాలు (హుస్క్ రిమోవర్స్), ఫీల్డ్ తూకం యంత్రాలు (ఫీల్డ్ బాలన్స్), మొబైల్ ఎండబెట్టే యంత్రాలు (మొబైల్ డ్రైయర్స్) వంటి మౌలిక వసతులు కేంద్రాలలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులును ఆదేశించారు.ఈ సమావేశంలో డి.ఎం సివిల్ సప్లై అధికారి అంబదాస్ రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్, పి.డి డిఆర్డిఏ జ్యోతి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు దీపిక, ప్రతిభ, తూనికలు కొలతల శాఖ అధికారులు,పోలీస్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలి

• జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** డ్రగ్స్ రహిత మెదక్ జిల్లా గా తీర్చి దిద్దాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాస్ రావు,జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ నిర్మూలించాలన్నారు. గ్రామాల్లో డ్రగ్స్ వ్యతిరేక కమిటీలు వేయాలన్నారు. గంజాయి సాగు చేస్తే రైతు బంధు,ఇతర ప్రభుత్వ పథకాలు నిలుపు చేయాలన్నారు. రైతు వేదికల వద్ద గంజాయి సాగు చేస్తే జరిగే పరిణామాలను రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పాఠశాల ,కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో వివిధ కూడళ్ల వద్ద ,మెడికల్ షాప్ లు,పరిశ్రమల వద్ద తనిఖీలు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ డాబాలు వద్ద,వివిధ రాష్ట్రాల నుంచి పరిశ్రమలకు ఉపాధి కోసం వచ్చే వారిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంతంలో 'పేకాట'

- 10మందిని పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు
- రూ.50,500ల నగదు, కారు, బైక్ స్వాధీనం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అటవీ ప్రాంతంలో రహస్యంగా పేకాట ఆడుతున్న శిబిరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 10మందిని పట్టుకుని, వారి వద్ద గల రూ.50,500ల నగదు స్వాధీన పర్చుకున్నారు. కారు, బైక్, మొబైల్ ఫోన్లు స్వాధీన పర్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ సీఐ రమేష్ బృందం కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడిచర్ల అటవీ ప్రాంతంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. విశ్వాసనీయ సమాచారం మేరకు నిర్వహించిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.50,500ల నగదు, 10 మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, ఒక షిఫ్ట్ డిజైర్ కారు, 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను కొయ్యూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని అన్నారు. పేకాట, బెట్టింగ్ వంటి కార్యకలాపాల వలన అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతింటున్నాయని, ముఖ్యంగా యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో చెడు మార్గాలను ఎంచుకోవడం ఆందోళనకర పరిస్థితులకు దారితీస్తాయని, కష్టపడి సంపాదించినదే నిలుస్తుందని తెలియజేశారు. ప్రజలు ఇలాంటి సమాచారాన్ని పోలీసులకు అందించి సహకరించాలని ఎస్పీ కోరారు.

# ఆలయాల అభివృద్ధి జరగాలి

- భక్తులకు మెరుగైన సదుపాయాలను కల్పించాలి
- ఆలయాల భూములను కాపాడాలి
- స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి
- ఆలయాల అభివృద్ధి కి పూర్తి సహకారం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ ప్రతినిధి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** స్టేషన్ ఘనపూర్ పరిధి లో గల ప్రధాన ఆలయల పైన లిజిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎండోమెంట్ జాయింట్ కమిషనర్ రామ క్రిష్ణ రావులతో కలిసి దేవస్థానల చైర్మన్, ఈఓ, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి సమీక్షించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ... స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో గల అన్ని దేవస్థానాల అభివృద్ధి కి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. జీడికల్ - రామచంద్ర స్వామి ఆలయం, చిల్పూర్ - బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం, స్టేషన్ ఘనపూర్ - తిరుమలనాథ స్వామి ఆలయం, నవాబ్ పేట - కోదండ రామస్వామి ఆలయం, చిన్నపెండ్యాల - లక్ష్మి నరసింహ స్వామి ఆలయం, జఫర్ గడ్ - లక్ష్మి నరసింహ స్వామి ఆలయం...మొత్తం ఆరు దేవస్థానాలకు సంబంధించి ఆలయల అభివృద్ధి పైన క్షుణ్ణం గా రివ్యూ నిర్వహించారు. నవంబర్ 10 వ తేదీన జరిగే జీడికల్ లక్ష్మి నర్సింహా స్వామి కళ్యాణన్ని పురస్కరించుకొని... తగు ఏర్పాట్లు చేయాలన్నారు.సీసీ రోడ్ వేయడం, ల్యాండ్ లేవలింగ్, జంగిల్ క్లియరెన్స్, మొక్కలను నాటడం అలాగే ఫెన్సింగ్, సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు, తదితర చర్యలను వెంటనే చేపట్టాలన్నారు. భక్తులు ఉండేందుకు రూమ్ లను నిర్మించాలన్నారు. భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నార. కోదండ రామస్వామి గుడిలో కోతుల బేదద ను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న పెండ్యాల లక్ష్మి నర్సింహా స్వామి దేవస్థానం కి సంబందించి... రోడ్, విద్యుత్ సదుపాయాలను కల్పించాలన్నారు. దేవాలయాల భూములు అన్యాక్రాంతం కావద్దని... దేవస్థానం పేరు మీదున్న అన్ని భూముల సర్వే జరిపించి... రికార్డ్ లు పక్కాగా ఉండలని, హద్దులను పెట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ... ఆలయాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని అందుకు తగ్గట్టుగా రెవెన్యూ పరంగా వేగవంతం గా చర్యలు తీసుకుంటామన్నారు. దేవాలయల భూములను త్వరగా సర్వే చేపిస్తామన్నారు.ఎండోమెంట్ అధికారులతో కో ఆర్డినేట్ చేసుకొని హద్దు లను ఏర్పాటు చేయాలనీ తహసీల్దార్ లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారు. ఈ సమావేశం లో జనగాం, స్టేషన్ ఘనపూర్ ఆర్డీ ఓ లు గోపీరామ్, వెంకన్న స్టేషన్ ఘనపూర్, చిల్పూర్, లింగాలఘనపూర్ జఫర్ గడ్, రఘునాథ్పల్లి తహసీల్దార్ లు, జీడికల్, చిల్పూర్ దేవస్థానం కమిటీ చైర్మన్ లు, దేవస్థానాల ఈ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# రణదివెనగర్ కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్

- వంద మంది పోలీసు సిబ్బందితో తనిఖీలు



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్డెన్ అండ్ సెర్చ్ లను నిర్వహించడం జరుగుతుందని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని రణదివె నగర్ కాలనీలో బుదవారం ఉదయం ఐదు గంటల నుండి 100 మంది పోలిస్ సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేనటువంటి 60 ద్విచక్ర వాహనాలు, 31 ఆటోలు, రెండు ట్రాక్టర్స్ తాత్కాలికంగా స్వాదీనం చేసుకున్నారు. అదేవిధంగా నార్కోటిక్ డాగ్ రోమా సహాయంతో గంజాయి కై తనిఖీ నిర్వహించారు. అదేవిధంగా 16 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండాలని సూచించారు. ఇదివరకే నమోదైన రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లను పరిశీలించడం జరుగుతుందని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనని వారిపై ఒక సంవత్సరం పాటు పరిశీలించి రౌడీ షీట్లను, సస్పెక్ట్ షీట్లను ఎత్తివేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు యువత వాహనాలలో ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ఉండాలని ఎలాంటి గృహహింస చర్యలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. రాత్రి సమయాలలో అనవసరంగా తిరగరాదని, ఈవిటీజింగ్ మరియు మహిళలను వేధించడం లాంటివి నిర్వహించకూడదని, గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, కె ఫణిదర్, కర్ర స్వామి, ఎస్ఐలు వి విష్ణువర్ధన్, డి రాధిక, మహేందర్, రాకేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దండారి సంబరాల్లో జిల్లా ఎస్పీ

- ఆదివాసీలతో కలిసి సామూహిక భోజనం



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** దండారి సంబరాల్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సంబురంగా కనిపించారు. ఆదివాసీలు తమ ఆరాధ్య దైవంగా భావించే దండారి ఉత్సవాలలో భాగంగా జిల్లాలో బుదవారం నుంచి ప్రారంభమైన గుస్సాడీ సంబరాల్లో ఎస్పీ స్వయంగా పాల్గొని అందరిని ఆశ్చర్యానికి గురిచేశారు. ఆరాధ్యంగా కొలిచే సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం దండారి ఉత్సవాలు. జిల్లావ్యాప్తంగా దీపావళి పండుగ సందర్భంగా ఆదివాసీలు నిర్వహించే దండాలు ఉత్సవాలలో భీంపూర్ మండలం భగవాన్పూర్, గుబిడి గ్రామాలలో నిర్వహించిన దండారి కార్యక్రమానికి అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరై ఆదివాసీలతో మమేకమై వారితో కాసేపు ముచ్చటించారు. జిల్లా ఎస్పీకి గ్రామ ప్రజలు సాంప్రదాయ డప్పు వాయిద్యాల నడుమ గుస్సాడి నృత్యాల నడుమ గౌరవ సాదరంగా ఆహ్వానాన్ని పలికారు. అనంతరం సాంప్రదాయ నృత్యాలను ప్రదర్శించి జిల్లా పోలీసు అధికారులతో కలిసి ఆదివాసీలు గ్రామ పెద్దలు యువత సామూహిక భోజన కార్యక్రమంలో కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీలది ప్రపంచంలోనే అత్యంత విభిన్న సంస్కృతి కలిగిన సాంప్రదాయమని పేర్కొన్నారు. తన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించి భావితరాలకు తమ సాంప్రదాయాలను తెలియజేసే విధంగా అభివృద్ధిని సాధించాలని సూచించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ విద్య, ఉపాధి వ్యవసాయం రంగాలలో ఉన్నత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ముఖ్యంగా యువతకు, పిల్లలకు చదువు పట్ల ప్రాధాన్యతను తెలియజేసి విద్యకు మొదటి ప్రాధాన్యతను కేటాయించాలని తెలియజేశారు. తల్లిదండ్రులు యువతను విద్యార్థులను ఉన్నత చదువుల అభ్యసించేలా ప్రోత్సహించాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని గంజాయి లాంటి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జిల్లా పోలీసులతో కలిసి పోరాడాలని సూచించారు. ముఖ్యంగా ఎలాంటి వైద్య సమస్యలు ఉన్న వైద్య రంగాన్ని సంప్రదించాలని ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను సంప్రదించి చికిత్సలను తీసుకోవాలని, ఎలాంటి బాబాలను మంత్రాలను తంత్రాలను నమ్మవద్దని సూచించారు. గ్రామ సమస్యలు తెలియజేసిన ప్రజలు వారికి సంబంధిత అధికారుల ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని హామీ ఇచ్చారు. అదేవిధంగా జిల్లా పోలీసుల తరఫున 24 గంటలు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, జైనథ్ సిఐ జి శ్రావణ్, భీంపూర్ ఎస్ఐ విక్రమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### గాలికుంటు వ్యాధి నిర్మూలన టీకాల
# గోడప్రతుల ఆవిష్కరణ



**నిర్మల్ రూరల్, అక్టోబర్15 (జనం సాక్షి) :** జిల్లాలో పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత టీకాల కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,అక్టోబర్ 15వ తేదీ నుండి నెల రోజులపాటు జిల్లాలోని అన్ని మండలాల్లో గాలికుంటు వ్యాధి నిర్మూలన టీకాల కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.పశువులకు ఉచితంగా టీకాలు వేసి వ్యాధి వ్యాప్తిని అరికట్టడం ద్వారా పశువుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యమని తెలిపారు.ప్రతి గ్రామంలో ప్రత్యేక పశువైద్య బృందాలు ఏర్పాటుచేసి ఇంటింటికీ తిరిగి పశు వులకు టీకాలు అందించాలని, కార్యక్రమం ఎక్కడా లోటుపాట్లకు తావు లేకుండా సమన్వయంతో అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులు, పశు యజమానులు ఈ కార్యక్రమానికి చురుకుగా సహకరించాలని,టీకాలు వేయించుకోవడంలో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి రాజేశ్వర్,సహాయ పశు వైద్యాధికారి బాలిక్ అహ్మద్,తదితరులు పాల్గొన్నారు.

# పేద కళాకారుడికి ఇందిరమ్మ గృహం మంజూరు చేయండి

- గృహ నిర్మాణ సంస్థ కార్యదర్శి వీపీ గౌతమ్ కు అభ్యుదయ సేవా సమితి వినతి



**వరంగల్ ఈస్ట్ ,అక్టోబర్ 15 (జనం సాక్షి) :** పేద కళాకారుడు కంచా నర్సింగరావు కి ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని రంగసాయిపేటలోని అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు మండల పరశు రాములు తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ముఖ్య కార్యదర్శి వి. పి. గౌతమ్ ఐ.ఏ.ఎస్ కి మెయిల్ ద్వారా అభ్యర్థన చేశారు.కురుమ కమ్యూనిటీకి చెందిన కంచా నర్సింగరావు వరంగల్ తూర్పు లోని 40 డివిజన్ ఉరుసు కురుమవాడ, శ్రీ వెంకటేశ్వర హై స్కూల్ సమీపం లో ఉంటున్న నర్సింగరావుకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పోషణలో ఎన్నో సవాళు ఎదుర్కొంటున్నప్పటికీ, సుమారు 55 సంవత్సరాలుగా వూలెన్ కార్పెట్ నేయడం వృత్తిగా కొనసాగిస్తూ, తన కుటుంబాన్ని పోషిస్తున్నారు.ఇతని కళా ప్రతిభకు తెలంగాణ రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ సంస్థ 2016, 2017 సంవత్సరాలలో రెండు సార్లు ప్రశంసాపత్రాలు అందజేసింది. అదనంగా, 2025 ఆగస్టు 7న, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వూలెన్ వర్గంలో ఉత్తమ కళాకారుడు అవార్డు కంచా నర్సింగరావు కి సమర్పించింది.అయితే, ఆయనకు ఇంకా తగిన నివాస స్థలం లేదు. ఆయన కుటుంబం బెలో పావర్టీ లైన్ లోకి వస్తుంది. కాబట్టి, ఆయనకు ఇంద్రమ్మ గృహం మంజూరు చేయాలని మరియు తగిన సహాయం అందించాలని మండల పరశురాములు ప్రత్యేకంగా కోరారు.

# కన్నతండ్రిని హత్యచేసిన తనయుడు



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్15 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎల్వి గ్రామంలో మిస్సింగ్ అయిన వన్నెవాడ్ లక్ష్మన్‌ను తన కొడుకే హత్య చేశాడని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల పేర్కొన్నారు. భైంసాలోని ఎస్పీ క్యాంపు ఆఫీసులో హత్య కేసు వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.నెలన్నర క్రితం వన్నెవాడ్ లక్ష్మన్ అదృశ్యమైన కేసు నమోదైంది.పొలానికి వెళ్లిన లక్ష్మణ్ తన కొడుకు (మైనర్)ను మందలించగా, గొడ్డలితో చంపి పొలంలోనే గుంత తవ్వి పూడ్చి పెట్టాడు. తన పెంపుడు కుక్క గుంతను తవ్వగా డెడ్ బాడీ బయట పడిందన్నారు.దీంతో పోలీసులు కొడుకును అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు.తండ్రిని తానే హత్య చేశానని కొడుకు ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు.కేసును ఛేదించిన ముధోల్ సిఐ మల్లేష్, ఎస్సై జుబేర్ లను అభినందిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

# కాళేశ్వర ఆలయ హుండీ ఆదాయం 31.64 లక్షలు



**కాళేశ్వరం, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం హుండీలను బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ మహేష్ ఆధ్వర్యంలో విప్పి డబ్బులు లెక్కించడం జరిగినది. హుండీల పర్యవేక్షణాధికారిగా దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ నందనం కవిత పాల్గొన్నారు.4 నెలల 12 రోజులకు గాను 31,64,858/- రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఎస్.మహేష్, పర్యవేక్షణాధికారి ఎన్. కవిత, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, కరీంనగర్ శ్రీ వల్లి సేవ ట్రస్ట్ సభ్యులు , హైదరాబాద్ నరసింహ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ దిష్టిబొమ్మ దహనం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో గురువారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ దిష్టిబొమ్మ దహనం చేశారు. తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జెక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాకర్ మాట్లాడుతూ ఆనందాజీ పై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఆర్ఎస్ఎస్ నాయకుల తీరును ఖండిస్తూ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగిందన్నారు. కేరళకు చెందిన యువ సాఫ్ట్వేర్ ఆనందాజీ పై చిన్న వయసు నుంచే కొంతమంది ఆర్ఎస్ఎస్ వాదులు లైంగిక వేధింపులకు గురిచేస్తూ మానసిక వేదనకు, శారీరకంగా వేదనకు గురిచేసి ఆయనను ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపించి అతని చావుకు కారణమయ్యారని ఆరోపించారు. తన ఇన్స్టాగ్రామ్ లో స్వయంగా నాకు ప్రేమ వ్యవహారాలలో జోక్యం లేదని, ఆర్థిక ఇబ్బందులు లేవని కేవలం ఆర్ఎస్ఎస్ నాయకులు చేసిన లైంగిక వేధింపులకే మానసిక ఇబ్బందుల వల్లనే నేను చనిపోతున్నాను అని స్పష్టంగా తెలియజేయడం జరిగిందన్నారు. అసలు ఈ ఆర్ఎస్ఎస్ తెర వెనక ఇలాంటి దారుణాలు జరగడం చాలా దురదృష్టకరమని, తక్షణమే లైంగిక వేధింపులు చేసిన ఆర్ఎస్ఎస్ నాయకులపై కేరళ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, వారిపై చర్యలు తీసుకునే విధంగా ముందుకు వెళ్లాలని అంతేకాకుండా వారి కుటుంబానికి కేరళ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటూ వారిని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రసాద్, అఖిల్, తిలక్, ప్రేమ్ కుమార్, అఖిల్, భాస్కర్, రిజ్వాన్, వినోద్, శేఖర్, శ్రీకాంత్, సాగర్, రేవంత్, రవీందర్, మల్లేష్, సంపత్, నదీమ్, సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూకు జిపిఓలు కీలకం

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రెవెన్యూ శాఖకు జిపిఓ లు కీలకమని, రెండు కళ్ళ లాంటి వారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నూతనంగా నియమితులైన జిపిఓ లకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై విధుల పట్ల జిపిఓ లకు మార్గదర్శక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ విధులు అత్యంత కీలకమని, చాలా బాధ్యతాయుతమైనటువంటి జిపిఓ లు గ్రామాల్లో ప్రభుత్వానికి కళ్లు, చెవులు లాంటి వారని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండటం వారి ప్రధాన బాధ్యతని తెలిపారు. భూముల సమస్యలు, రైతుల ఇబ్బందులు, ప్రజల అభ్యర్థనలను మొదటగా గుర్తించేది జి.పి.ఓ లేనని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టంను ప్రవేశపెట్టిందని, ప్రతి జి.పి.ఓ ఈ చట్టంపై పూర్తి అవగాహనతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 54 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిశీలనలో జి.పి.ఓ లు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా అవినీతి లేదా అక్రమాలకు పాల్పడితే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మన కర్తవ్యమని గుర్తుంచుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జి.పి.ఓ లు తమ పనిని సేవా దృక్పథంతో, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వర్తిస్తే, భూ భారతి కార్యక్రమం విజయవంతమవుతుందని కలెక్టర్ రాహుల్ శర్మ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, భూపాలపల్లి తహసిల్దార్ శ్రీనివాసులు, జిపిఓలు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడులు



**మల్హర్, అక్టోబర్ 15(జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలంలోని కొయ్యూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడిచర్ల అటవీ ప్రాంతంలో రహస్యంగా పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు బుధవారం టాస్క్ ఫోర్స్ సిఐ రమేష్, కొయ్యూర్ ఎస్ఐ వద్లకొండ నరేష్, ఎస్ఐ 2రాజన్ కుమార్ ల సంయుక్త నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరం పై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 10 మందిని అరెస్ట్ చేసి, రూ. 50,500/- నగదు, 10 మొబైల్ ఫోన్లు, 52 ప్లేయింగ్ కార్డులు, ఒక ద్విచక్ర వాహనం, ఒక షిఫ్ట్ డిజైర్ కారు ను కొయ్యూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని కొయ్యూరు ఎస్ఐ వద్లకొండ నరేష్, ఎస్ఐ 2రాజన్ కుమార్ లు హెచ్చరించారు.

# బీసీ రిజర్వేషన్‌లపై కేంద్రం రాజకీయ ఆటలు

- బీసీ రిజర్వేషన్ల అమలుకు అడ్డుకట్ట వేస్తున్న కేంద్రం
- బీసీ బిల్లు అమలుకు కేంద్రంపై రాష్ట్రం ఒత్తిడి తేవాలి
- అక్టోబర్ 17న చలో రాజ్ భవన్ ముట్టడి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



**ఖమ్మం, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు పై కేంద్రం రాజకీయ ఆటలు ఆడుతుందని, సామాజిక న్యాయం కోసం, పేద, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం అవసరమైన ఈ రిజర్వేషన్లను అడ్డుకోవడం బీజేపీ ప్రభుత్వం దుర్మార్గమైన చర్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు లు విమర్శించారు. బుధవారం నాడు స్థానిక సుందరయ్య భవనంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వరకు సభ్యులు యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో పోతినేని, నున్నా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజకీయ ఉద్దేశంతోనే బీసీ రిజర్వేషన్ అమలు కాకుండా అడ్డుకుందని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అసెంబ్లీలో చర్చ పెట్టిందని ఆ సమయంలో అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు. అసెంబ్లీ ఆమోదంతో బిల్లును రాష్ట్రపతి, గవర్నర్ లకు రాష్ట్ర ప్రభుత్వం పంపించిందని అక్కడ బిల్లు ఆమోదించకుండా కేంద్రం కావాలనే కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బిజెపియతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలో ప్రభుత్వాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. బిసి రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పక్షాల నాయకులను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై బలమైన ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు అడ్డుపడే ప్రయత్నాలను సిపిఎం గట్టిగా ఎదుర్కొంటుందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే ఉద్యమాలను చేపడతామని స్పష్టం చేశారు. ఇప్పటికే స్థానిక ప్రభుత్వాలు లేకపోవడం వల్ల గ్రామాల్లో అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర నుంచి వచ్చే నిధులు రాకుండా పోతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. సత్వరమే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన పార్టీ యంత్రాంగం సర్వేలు నిర్వహించి ఉద్యమాలు చేపడతామని తెలియజేశారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేయాలని, రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని అక్టోబర్ 17న చలో రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, వై విక్రమ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, బండి పద్మ మరియు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ రెచ్చిపోతున్న మట్టి మాఫియా



**అశ్వరావుపేట, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** అడ్డు అదుపు లేకుండా ఇష్టానుసారం అందినకాడికి మట్టి తొలేస్తూ దోచుకుంటుంది మట్టి మాఫియా అశ్వారావుపేట మండల అధికారులు ఎవ్వరు అడ్డు చెప్పకపోవడంతో వారి అండదండాలు పుష్టిగా ఉంటదంతో అక్రమ మట్టి దందా కొనసాగించేస్తున్నారు. అనుమతులు లేకపోయినా మేమే చూసుకుంటాం అంటూ ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ ఓ గిరిజనేతరుడు తన అంగ బలంతో జమ్మిగూడెం గ్రామంలో అనుమతి లేకుండా యేదేచ్ఛగా సాగుతున్న మట్టి రవాణాను స్థానిక రైతులు అడ్డుకున్నారు. జెసిబిల సాయంతో ప్రభుత్వ భూములలో అడ్డగోలుగా తవ్వి 50 ట్రాక్టర్లతో ఎర్రమట్టిని తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలానే మితిమీరిన వేగంతో ఇష్టానుసారం ట్రాక్టర్లు నడుపుతుండటంతో పొలాలకు వెళ్లేందుకు పోసుకున్న రహదారులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై స్థానిక రెవెన్యూ అధికారులను అడిగితే ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సమాధానం ఇస్తున్నారు. అయితే అక్రమ మట్టి రవాణాను అడ్డుకోకుండా అధికారులు మౌనంగా ఉండటం పట్ల గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ మట్టి తొలకంపై విచారణ చేపట్టి మట్టిరవాణాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఇద్దరు వ్యక్తుల నుండి గంజాయి స్వాధీనం

**కామేపల్లి, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** మండలంలో ఇద్దరు వ్యక్తులు నుండి ఒక కేజీ 485 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి శ్రీకాంత్ బుధవారం విలేకరులకు తెలిపారు.ఆయన తెలిపిన వివరాలు మేరకు ఇలా ఉన్నాయి.మండలంలోని ముచ్చర్ల క్రాస్ రోడ్ వద్ద మంగళవారం రాత్రి ఎస్సై తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పట్టుకుని వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా అందులో గంజాయి ప్యాకెట్లు ఒక కేజీ 485 గ్రాములు లభించిందని దీని విలువ రూ 74,250 రూ ఉంటుందని వారి వద్ద పల్సర్ బైక్ వాహనం,రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు ఇద్దరూ కామేపల్లి మండల పరిధిలోని జాస్తి పల్లి గ్రామానికి చెందిన పల్లపు వేణు ముచ్చర్ల గ్రామానికి చెందిన షేక్ యాసిన్ గా గుర్తించి వారిని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఎస్సై పి శ్రీకాంత్ వివరించారు. వీరు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన అభి అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసుకొని వస్తున్నారని వివరించారు.కారేపల్లి రూరల్ సిఐ తిరుపతిరెడ్డి సూచన మేరకు వారిపై కేసు నమోదు చేసి ఖమ్మం కోర్టు రిమాండ్ కు తరలించినట్లు. అభి అనే వ్యక్తి పరారీ లో ఉన్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.బుధవారం సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామంలో ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.రైతులకు మద్దతు ధర అందించాలన్నారు. మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైఎస్సార్, ఆర్డీఆర్ ఆలోచన మేరకు ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామసాని రమేష్, మాజీ ఎంపిపి భూక్యా కాంత, మాజీ వైస్ ఎంపిపి రామసాని శ్రీనివాస్, దండు మైసమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్ గౌడ్, చందా దాసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగాని జనార్ధన్, మాజీ కో ఆప్షన్ సభ్యులు రహ్మేతుల్లా, తాడూరి లింగయ్య, మాజీ సర్పంచ్ మారేపల్లి ప్రభాకర్, కంచర్ల వేణురెడ్డి, సరిపెల్లి రమణయ్య, మర్రి నారాయణ, పడిదల రమేష్, సరిపెల్లి మధు, మాజీ ప్రజా ప్రతినిధులు, డైరెక్టర్లు, అధికారులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చర్ల సీహెచ్‌సీలో మొదలైన సిజేరియన్ ఆపరేషన్లు

- హర్షం వ్యక్తం చేస్తున్న చర్ల ప్రజలు



**చర్ల, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** భద్రాద్రి జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో సైతం వైద్య సదుపాయాలు బలోపేతం అవుతున్నాయి. జిల్లా కలెక్టర్ జితేశ్ పాటిల్ ప్రత్యేక దృష్టి డీసీ హెచ్ ఎస్ రవి బాబు చొరవ కలగలిపి జిల్లాలోని వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రులలో ఆశించిన స్థాయిలో సేవలు అందుతున్నాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతమైన చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. గత కొన్నాళ్ళుగా ప్రాథమిక వైద్యానికే పరిమితమైనా వైద్య సదుపాయాలు నేడు స్పెషాలిటీ వైద్య సేవలను సైతం అందుబాటులోకి వచ్చింది.ఎం ఎల్ ఏ చొరవతో ప్రత్యేక దృష్టి పెట్టిన జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అదనపు ప్రోత్సాహాలు ప్రకటించి గర్భిణి స్త్రీల ఆరోగ్య రీత్యా ఒక ప్రసూతి వైద్యురాలు,ఒక పిల్లల వైద్య నిపుణుడు,ఒక మత్తు వైద్యుడు ని నియమించారు.ఈ నియామకంలో డి సి హెచ్ ఎస్ డాక్టర్ రవి బాబు ప్రత్యేక చొరవ చూపి వైద్యులను పది రోజుల క్రితం నియమించారు.ఈ క్రమం లో నేడు చర్ల సి హెచ్ సి లో మొదటి సీజేరియన్ ఆపరేషన్ జరిగింది. చర్ల మండలం కొత్తూరు గ్రామం కి చెందిన తన్నీరు రాజేశ్వరి మొదటి కాన్పు కోసం రాగా సుఖప్రసవం కోసం ప్రయత్నం చేసి కాన్పు చేయలేని పరిస్థితిలో తల్లి బిడ్డ క్షేమం కోసం ఎమర్జెన్సీ ఆపరేషన్ చేసి పండంటి రెండు కేజీల మగ బిడ్డకి ఊపిరిపోశారు. గతం లో ప్రసూతి సేవల కోసం అరవై కిలోమీటర్ల దూరంలో భద్రాచలం వెళ్లే పరిస్థితులు ఉండేవి. కానీ ఏజెన్సీ లో ని చర్ల లో సైతం ప్రసూతి సేవలను అందుబాటులో తెచ్చిన ఎం ఎల్ ఏ తెల్లం వేంకట రావు ,కలెక్టర్ జితేష్ పాటిల్,డి సి హెచ్ ఎస్ రవి బాబు లకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి వర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు.ఆసుపత్రిలో లో అందుతున్న స్పెషాలిటీ సేవల పట్ల చర్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆపరేషన్ లో ప్రసూతి వైద్యురాలు శ్రావణి,పిల్లల వైద్యులు రవి కుమార్ ,మత్తు వైద్యుడు శివ రామ కృష్ణ , నర్సింగ్ ఆఫీసర్ ఝాన్సీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఘన స్వాగతం



**భువనగిరి, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల మరియు సినీ ఆటోగ్రాఫి శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి తల్లి దశదిన కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యంలో భువనగిరి పట్టణ బైపాస్ రోడ్డు బ్లూ ఫ్లాక్స్ హెూటల్ లో భువనగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలకడం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ గత పది సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనేక అక్రమ కేసులు నమోదు చేసినప్పటికీ కూడా కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలకు స్థానిక సంస్థ ఎన్నికలలో సరైన గుర్తింపు ఇవ్వడంతో పాటు సర్పంచులు ఎంపీటీసీలు, జడ్పిటిసిలు,కౌన్సిలర్లు లాగా గెలిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ పోత్నక్ ప్రమోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, పోతాంశెట్టి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పడిగెల ప్రదీప్, ఈరపాక నరసింహ, పిట్టల బాలరాజ్, దాసరి మధు, దేవరకొండ నరసింహ చారి,మజర్ శిగ నరేష్ గౌడ్, జువ్వగాని శ్రీధర్, నరేష్, దేవరకొండ నరసింహ చారి, చందుపట్ల గ్రామ శాఖ అధ్యక్షులు వెంకటేష్, శ్రవణ్ రెడ్డి,బర్రె నరేష్, పొట్ట శివ, సాల్వేరు ఉపేందర్, కాకునూరి మహేందర్, పిట్టల బాలరాజ్, కృష్ణమూర్తి, పల్లెర యాదగిరి, మహేందర్, సాయి, నరేందర్, తదితరులు పాల్గొనడం జరుగుతుంది.

## పోషణ లోపం లేని సమాజ నిర్మాణమే పోషణ మాస లక్ష్యం

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** ఆరోగ్యవంతమైన మహిళ కోసం కుటుంబ సభ్యులు భాద్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. పోషణ మాసంలో భాగంగా సూర్యాపేట పట్టణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.పోషణ లోపం లేని సమాజాన్ని నిర్మించడమే పోషణ మాసం లక్ష్యమని, అందుకు క్రింది స్థాయిలో కృషి చేస్తున్న అంగన్వాడీ టీచర్లకు అభినందనలు తెలిపారు.గర్భిణీల పోషణలో కుటుంబ సభ్యులందరి పాత్ర ఉంటుందని, ప్రతి సమావేశంలో వీరందరినీ భాగస్వాములను చేయాలని చెప్పారు.ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ బాల్య ఆరంభ దశ సంరక్షణ, విద్యపై దృష్టి సారించాలని అన్నారు. ప్రతి పిల్లవాడు వెళ్లే మొట్టమొదటి బడి అంగన్వాడి కేంద్రమేనని స్పష్టం చేశారు. పిల్లవాని అభివృద్ధికి పునాదులు వేసే అంగన్వాడి కేంద్రం సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. పోషకాహార లోపం లేని సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు.జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహారావు మాట్లాడుతూ మన ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యమని,పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుబ్బలక్ష్మి,సూపర్వైజర్లు, పోషణ అభియాన్ జిల్లా బ్లాక్ కోఆర్డినేటర్లు,అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను శాస్త్రీయంగా మార్చాలి

**చౌటుప్పల్, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను శాస్త్రీయంగా మార్చాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కేంద్రంలోని దివిస్ లాబొరేటరీస్ పరిశ్రమను కాపాడేందుకు పేద రైతుల భూములను పొట్టగొడతారా అని నిలదీశారు.మున్సిపల్ పరిధిలో ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ ప్రకారం భూములు కోల్పోతున్న రైతుల భూములను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్‌ను అశాస్త్రీయంగా ఓఆర్ఆర్ రోడ్డు నుంచి 40 నుంచి 60 కిలోమీటర్లు తీసుకొని, చౌటుప్పల్‌కు ఉత్తర దక్షిణ ప్రాంతంలో 28 కిలోమీటర్లకు ఎందుకు కుదించారని ప్రశ్నించారు. ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను పాము వంకరలా తిప్పుతూ ఒకచోట 50 కిలోమీటర్లు, మరోచోట 60 కిలోమీటర్లు, చౌటుప్పల్ దగ్గరికి వచ్చేసరికి 28 కిలోమీటర్లు ఎన్ని రకాలుగా మార్చడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.ఫార్మా కంపెనీల కోసం కాకుండా, పేద రైతులను దృష్టిలో పెట్టుకొని శాస్త్రీయంగా అలైన్‌మెంట్ చేయాలన్నారు. సన్న, చిన్న కారు రైతులను నాశనం చేసి,వారి శవాలపై రోడ్లు నిర్మిస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ,ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను 60 కిలోమీటర్ల దూరానికి మార్చాలని, అక్కడ కూడా భూమి పోయే రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి ఇవ్వాలని లేదా బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం 3 రెట్లు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై శాసనమండలి సమావేశంలో చర్చిస్తామని, ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, భూ నిర్వాసితులు చింతల దామోదర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, కురిమిద్దె శ్రీనివాస్, బోడ సుదర్శన్, కళ్లెం కృష్ణ, ఎం.డి. ఇమ్రాన్, పెరబోయిన మహేందర్, పగిల్ల మోహన్ రెడ్డి, పిల్లి శంకర్, కొండూరి వెంకటేష్, ఉడుత రామలింగం, బద్దుల సుధాకర్, భూ నిర్వాసితులు సందగల మల్లేశం, జాల శ్రీశైలం, బోరం ప్రకాష్ రెడ్డి, గుండెబోయిన వేణు, మార్గం నరసింహ, సుర్కంటి శశికళ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి ప్రేమ్ చంద్



**మిర్యాలగూడ, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ప్రేమ్ చంద్ రెస్ట్ స్థాయి కబడ్డీ క్రీడలకు ఎంపికయ్యాడు. మంగళవారం హుజూర్నగర్ లో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-14 కబడ్డీ పోటీలలో ఆడి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల16,17,18 తేదీలలో హైదరాబాదులోని పటాన్ చెరువులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడకు ఆడుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు ధర్మనాయక్ తెలిపారు. విద్యార్థి ప్రేమ్ చంద్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులుఅభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలలో ప్రావీణ్యము పొందాలని అన్నారు. వారి వెంట వ్యాయామ ఉపాధ్యాయిని వినోద, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుర్ర కృష్ణ కాంత్ నాయక్,ఉపేందర్, ముంతాజ్ బేగం, తావుర్య,సంతోష్, అనిత జ్యోతి, ధనలక్ష్మి, అశ్విని, స్పందన, బేబీ రాణి, వినోద, కాంతయ్య, జానయ్య,జంగయ్య, స్వామి, లక్ష్మయ్య, మీనా, భవాని, రేణుక, నస్రీన్, సీమ,పేరయ్య, తనూజ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, సైబర్ మోసాల నివారణకు అవగాహన కల్పించాలి

- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ ప్రజాభరోసా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ కె.నరసింహ ముఖ్య అతిథిగా పాల్గొని శాంతి భద్రతలు, చట్టాలు, మంచి ప్రవర్తన, విద్యార్థి ఉన్నత లక్ష్యాలు, పట్టుదలతో కృషి చేయడం, విజయాల గురించి అవగాహన కల్పించారు.భారతదేశ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని అబ్దుల్ కలాం జీవితం గురించి, సాధించిన విజయాలు,దేశానికి చేసిన సేవ, కృషి గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలని అన్నారు. అబ్దుల్ కాలంను స్ఫూర్తిగా తీసుకోవాలని , ఆశయ సాధన కోసం కృషి చేస్తేనే విజయాలు వస్తాయని తెలిపారు. చదువు చాలా విలువైనదని,ప్రపంచంలో చదువుతోనే విజ్ఞానం వెలుగొందుతుందన్నారు. మనకు విజ్ఞానాన్ని, తెలివిని, మంచి నడవడికను విద్యాలయాలు నేర్పిస్తాయని, విద్యార్థికి తరగతి గది ఒక ప్రయోగశాల అన్నారు.బాగా చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు.సదుపాయాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యం కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు.అవకాశాలు లేని రోజుల్లో మంచి విజయాలు సాదించిన గొప్పవాళ్ళు ఉన్నారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.బాలికలు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలని అన్నారు.సమాజంలో ఎన్నో రుగ్మతలు ఉన్నాయి వాటి నిర్మూలనకు చదువు మార్గమని పేర్కొన్నారు.ప్రావీణ్యం ఉన్న అంశంలో కృషి చేయాలని, ఆటలు ఆడాలి, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. భేటీ బచావో - భేటీ పడావో నినాదంతో బాలికల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని,బాలికలను ఎదగనివ్వాలని కోరారు. బాల్య వివాహాలు చేయవద్దన్నారు. విద్యార్థులు చిన్నచిన్న సమస్యలకు ఒత్తిడికి లోనై, ఆకర్షణలకు లోనై బంగారు జీవితాన్ని భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దని,ఆత్మహత్య లాంటివి చేసుకోవద్దని సూచించారు.కష్టపడి చదివి తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు.ఏ రకంగా నైనా వేధింపులు జరుగుతున్న తెలిసినవాళ్లు బంధువులు ఎవరైనా చెడు బుద్ధితో శరీరాన్ని తాకుతున్నట్లు గ్రహించిన వెంటనే తల్లిదండ్రులకు లేదా గురువులకు తెలియజేయాలన్నారు. ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ మోసాలు మాదకద్రవ్యాలు అతిపెద్ద సమస్యగా ఉన్నాయని వీటిపై విద్యార్థులు ఫ్రంట్ వారియర్స్ లాగా పనిచేసి పెద్దలకు అవగాహన కల్పించాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే వాటికి ప్రభావితం కావొద్దని, ఇంటర్నెట్ నుంచి జ్ఞాన సముపార్జనకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు,ఎస్ఐలు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.




# వరుస నష్టాలకు బ్రేక్..

**• లాభాల్లోకి షేర్ మార్కెట్లు**



**న్యూఢిల్లీ:**రెండు రోజుల వరుస నష్టాల అనంతరం దేశీయ స్టాక్‌మార్కెట్లు బుధ వారం లాభాల్లో ముగిశాయి. ప్రపంచ ఆశావాదం, ముడి చమురు ధరల తగ్గుదల కారణంగా భారతీయ బెంచ్ మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ పుంజు కుని లాభాలలో స్థిరపడ్డాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 575.45 పాయింట్లు లేదా 0.70 శాతం పెరిగి 82,605.43 వద్ద స్థిరపడింది. అలాగే ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 178.05 పాయింట్లు లేదా 0.71 శాతం ఎగిసి 25,323.55 వద్ద ముగిసింది.బీఎస్ఈలో బజాజ్ ట్విన్స్, ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, ఎటర్న ల్ (జొమాటో) టాప్ గెయినర్స్ లో ఉండగా, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ టాప్ లూజర్స్‌గా నిలిచాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ రియాల్టీ 3.04 శాతం, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ 1.67 శాతం, నిఫ్టీ మెటల్ 1 శాతం లాభపడ్డాయి. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, స్మాల్ క్యాప్ 100 వరుసగా 1.11 శాతం, 0.82 శాతం లాభపడ్డాయి.

# 'ఇంతింతై వటుడింతై' అన్నట్టుగా పసిడి, వెండి ధరలు

**ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ?మంగళవారంతో పోలిస్తే బుధవారం బంగారం ధరలు మరింత అధికమయ్యాయి. అక్టోబర్ 18న ధన త్రయోదశికి ముందు పసిడి ధరల ఇలా భారీగా పెరగడం వినియోగదారుల్లో ఆందోళన కలిగిస్తుంది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.**




# ఈపీఎఫ్ మొత్తం తీసేయాలంటే..

# మూడేళ్లు ఆగాల్సిందే..




**న్యూఢిల్లీ:**మీకు ఉద్యోగం లేదా.. రాజీనామా చేసి చాలాకాలమైందా? మూడేళ్లు కూడా దాటిపోయిందా.. అయితే ఇక మీరు మీ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్‌లో ఉన్న డబ్బు మొత్తం డ్రా చేసేసుకోవచ్చు.ఉద్యోగం లేకుండా ఉంటే రెండు నెలలు దాటగానే పీఎఫ్ అకౌంట్‌ను ఖాళీ చేసేందుకు ఇప్పటివరకూ అవకాశం ఉండగా... ఈపీఎఫ్ఓ బోర్డు తాజా నిర్ణయంతో అది మూడేళ్లకు పెరిగింది.కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈపీఎఫ్ఓ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈ మార్పును ఆమోదించింది. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ దీర్ఘకాలం పాటు ఉపాధి లేకుండా కొనసాగిన సందర్భాల్లోనే సభ్యులు తుది పరిష్కారాన్ని ఎంపిక చేసుకునేందుకు, భవిష్యనిధి ఖాతాలోని మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు అనుమతించింది. 12 నెలలుగా ఉద్యోగం లేని వారు (పదవీ విరమణ కాలం తీరకముందే ) ఈపీఎఫ్ తుది పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చు.36 నెలల పాటు ఉద్యోగం లేకుండా కొనసాగితే అప్పుడు భవిష్యనిధితోపాటు పెన్షన్ ఖాతాలో ఉన్న మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చని ఈపీఎఫ్‌వో ప్రకటించింది. ప్రస్తుతం రెండు నెలలుగా ఉద్యోగం లేకుండా ఉన్న వారు నిధులను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఉంది. దీంతో చాలా మంది 2 నెలల తర్వాత ఖాతాను ఖాళీ చేస్తున్న నేపథ్యంలో.. వారి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈపీఎఫ్‌వో తెలిపింది.

ఇక మూడు రకాల ఉపసంహరణలే..

ఇంతకుముందు, ఈపీఎఫ్ నుండి పాక్షిక ఉపసంహరణకు అనుమతించే 13 నిబంధనలు ఉండేవి. వీటన్నింటినీ విలీనం చేస్తూ కేవలం మూడు నిబంధనలను ఉంచాలని సీబీటీ నిర్ణయించింది. అవి అత్యవస పరిస్థితులు, గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులు

100% వరకు విత్ డ్రాయల్స్

ఈపీఎఫ్ఓ సభ్యులు ఇప్పుడు ఉద్యోగి, యాజమాన్యం వాటాతో సహా ప్రావిడెంట్ ఫండ్‌లోని అర్హత కలిగిన బ్యాలెన్స్‌లో 100% వరకు ఉపసంహరించుకోవచ్చు.

మరిన్ని విత్ డ్రాలు:సీబీటీ ఉపసంహరణ పరిమితులను సరళీకృతం చేసింది. విద్య సంబంధ అవసరాలకు ఇప్పుడు 10 సార్ల వరకు, వివాహం కోసం 5 సార్ల వరకు పీఎఫ్ ఉపసంహరించుకోవచ్చు. ఇవి గతంలో 3 సార్ల వరకే ఉండేవి.

12 నెలల తరువాత పాక్షిక ఉపసంహరణ: అన్ని పాక్షిక ఉపసంహరణలకు కనీసం ఉండాల్సిన సర్వీస్ కాలాన్ని ఏకరీతిగా 12 నెలలకు తగ్గించారు.

ప్రత్యేక పరిస్థితులకు ఎలాంటి కారణం అవసరం లేదు:'ప్రత్యేక పరిస్థితులలో' పీఎఫ్ విత్‌డ్రా చేయాలంటే ఇంతకు ముందు కారణాలు అంటే ప్రకృతి వైపరీత్యాలు, లాకౌట్లు / సంస్థల మూసివేత, నిరంతర నిరుద్యోగం, అంటువ్యాధి వ్యాప్తి మొదలైనవి సభ్యుడు స్పష్టం చేయాల్సి వచ్చేది. ఇప్పుడు, సభ్యుడు ఈ కేటగిరీ కింద ఎటువంటి కారణాలు పేర్కొనకుండానే దరఖాస్తు చేసుకోవచ్చు.


25 శాతం కనీస బ్యాలెన్స్ తప్పనిసరి:సభ్యుల ఖాతాలో 25% కాంట్రిబ్యూషన్‌ను కనీస బ్యాలెన్స్‌గా తప్పనిసరిగా ఉంచాలని నిబంధన తీసుకొచ్చారు.

100% ఆటో సెటిల్‌మెంట్:సభ్యులకు ఎక్కువ సౌలభ్యం కల్పించేందుకు సెటిల్‌మెంట్ నిబంధనలను ఈపీఎఫ్‌వో సరళీకృతం చేసింది. ఎటువంటి డాక్యుమెంటేషన్ అవసరం లేకుండా, పాక్షిక ఉపసంహరణ కోసం క్లెయిమ్‌ల 100% ఆటో సెటిల్‌మెంట్‌ను ఈపీఎఫ్‌వో అనుసరించనుంది.

ముందస్తు ఫైనల్ సెటిల్‌మెంట్, పెన్షన్ ఉపసంహరణ:పదవీ విరమణ కాలం తీరకముందే ముందస్తు ఈపీఎఫ్ ఫైనల్ సెటిల్మెంట్‌ను పొందే వ్యవధిని ప్రస్తుతం ఉన్న 2 నెలల నుండి 12 నెలలకు, ఫైనల్ పెన్షన్ ఉపసంహరణను 2 నెలల నుండి 36 నెలలకు పెంచాలని సీబీటీ నిర్ణయించింది.

# మైక్రోసాఫ్ట్ మొదటి ఏఐ ఇమేజ్ జనరేటర్ విడుదల

**న్యూఢిల్లీ:**టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కృత్రిమ మేధ రంగంలో మరో కీలక ముందడుగు వేసింది. సంస్థ పూర్తిగా అంతర్గతంగా శిక్షణ ఇచ్చిన తన మొదటి ఏఐ ఇమేజ్ జనరేటర్ 'మై ఇమేజ్-1'ను విడుదల చేసింది. ఇప్పటివరకు ఈ విభాగంలో ఓపెన్‌ఏఐపై ఆధారపడు తుండడాన్ని తగ్గించుకునేందుకు మైక్రోసాఫ్ట్ కృషి చేస్తోంది. మోడల్ ఫొటోరియలిస్టిక్ ఇమేజరీని ఉత్పత్తి చేయడంలో మెరుగ్గా పని చేస్తుంది. ఫొటోలో లైటింగ్ పరిస్థితులు, నీటిపై ప్రతిబింబాలు, ప్రకృతి దృశ్యాలు అత్యంత వాస్తవికంగా ఉంటాయి. భారీ ఎల్‌ఎల్‌ఎంలు వాడుతూ నెమ్మదిగా అవుట్‌పుట్ ఇచ్చే మోడళ్లతో పోలిస్తే ఇది చాలా మంచి ఫలితాలు ఇస్తుంది. అత్యంత వాస్తవిక అవుట్‌పుట్‌లను సాధించడానికి ఇప్పటికే నిపుణుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నాం' అని కంపెనీ తెలియజేసింది. మైక్రోసాఫ్ట్ ఇప్పటికే ప్రముఖ ఏఐ బెంచ్‌మార్క్ అయిన ఎల్‌ఎంఅరెనా లో టాప్ 10లో స్థానం సంపాదించింది. ఏఐ అవుట్‌పుట్‌ల ఆధారంగా వివిధ మోడళ్లను పోల్చి ఉత్తమమైన వాటికి ఓటు వేస్తారు. ఏఐ ఇమేజ్ జనరేషన్ విభాగంలో ఓపెన్‌ఏఐ గూగుల్ వంటి సంస్థలు ఇప్పటికే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చిన ఈ టెక్నాలజీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ రంగంలో సంస్థ తనదైన ముద్ర వేయాలని ప్రయత్నిస్తోంది. మరోవైపు ఓపెన్‌ఏఐ తన సోరా 2 టూల్‌ను ఉపయోగించి వీడియోలను సృష్టించే యాప్‌ను ఇప్పటికే అమెరికా, కెనడాలోని యాపిల్ యాప్ స్టోర్‌లో ప్రారంభించింది.




# 'ఐయామ్ సారీ.. సోషల్ మీడియాకు దూరంగా ఉంటా..'



**న్యూఢిల్లీ:**జోహొ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీధర్ వెంబు సోషల్ మీడియా నుంచి తాత్కాలికంగా కొన్ని రోజులు దూరంగా ఉంటానని ప్రకటించారు. కంపెనీ కొత్త టెక్నాలజీలను అభివృద్ధి చేస్తున్న తరుణంలో కొన్ని కోడ్‌లను మరింత సమర్థవంతంగా సృష్టించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల కాలంలో ఎక్స్ వంటి సామాజిక మధ్యమాల్లో చాలా చురుకుగా ఉన్న వెంబు తాను రన్ చేయాలనుకునే కొన్ని కోడ్‌లను మెరుగుపరిచేందుకు కొంతకాలం ఆన్‌లైన్ ఎంగేజ్‌మెంట్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. పనిలో నాణ్యత ముఖ్యమని చెప్పడం కంటే మనమే ఆ పనిని సమర్థంగా చేసి చూపించాలన్నారు. తన సోషల్ మీడియా అనుచరులకు ఇలా కఠినమైన పరిమితిని విధించవలసి వచ్చినందుకు చింతిస్తున్నానని చెప్పారు.ఇటీవల కాలంలో కంపెనీ తయారు చేసిన దేశీయ ఆన్‌లైన్ కమ్యునికేషన్ ప్లాట్‌ఫామ్ అరట్టై యాప్‌కు ఆదరణ పెరుగుతోంది. ఆ యాప్‌ను ఉపయోగించాలని పలువురు మంత్రులు, వ్యవస్థాపకులు, సీఈఓలు పిలుపునిచ్చారు. దీంతో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేవారు సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్ యాపిల్ యాప్ స్టోర్‌లలో అందుబాటులో ఉంది. అరట్టై అంటే.. తమిళంలో సరదాగా ముచ్చటించుకోవడం అని అర్థం. దీనిని జోహొ సంస్థ.. వాట్సప్‌కు పోటీగా అభివృద్ధి చేసింది. ఇది వాట్సప్ కంటే ఎక్కువ ఫీచర్స్ కలిగి ఉంది. దీనికి అశ్వినీ వైష్ణవ్, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్ వంటి కేంద్రమంత్రులు కూడా మద్దతు ప్రకటించారు. దేశీయ పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా కూడా తాను అరట్టై డౌన్‌లోడ్ చేసుకున్నానంటూ ట్వీట్ చేశారు.అరట్టై.. వాట్సాప్ రెండూ మెసేజింగ్ యాప్స్ అయినప్పటికీ, అరట్టైలో కొన్ని అదనపు ఫీచర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ యాప్ గురించి జోహొ సీఈఓ శ్రీధర్ వెంబు గత కొన్ని రోజులుగా తన ఎక్స్ ఖాతాలో చెబుతూనే ఉన్నారు.అరట్టై ఆండ్రాయిడ్ టీవీలతో సహా విస్తృత శ్రేణి పరికరాలకు యాక్సెస్‌ను అందిస్తుంది. అయితే వాట్సాప్ ప్రస్తుతం వీటికి మద్దతు ఇవ్వదు. వినియోగదారులు తమ అరట్టై ఖాతాను ఒకేసారి ఐదు పరికరాల్లో ఉపయోగించవచ్చు.అరట్టైలో పాకెట్ ఫీచర్ ఉంది. ఇది వినియోగదారులు ఫోటోలు, వీడియోలు, నోట్స్, రిమైండర్‌లు, ఇతర ఫైల్‌లను స్టోర్ చేసుకోవచ్చు. ప్రస్తుతం వాట్సాప్‌లో ఈ ఫీచర్ లేదు. అయితే, వాట్సాప్ 'యు' చాట్ విండోను అందిస్తుంది, ఇక్కడ వినియోగదారులు తమతో తాము చాట్ చేసుకోవచ్చు, కావలసినవి సేవ్ చేసుకోవచ్చు. అరట్టై యాప్.. తక్కువ మెమరీ ఉన్న స్మార్ట్‌ఫోన్‌లు పాత నెట్‌వర్క్‌లలో కూడా సజావుగా పనిచేసేలా రూపొందించబడింది. ఇది గ్రామీణ వినియోగదారులకు, బడ్జెట్ పరికరాలను కలిగిన వారికి అందుబాటులో ఉంటుంది.

# శాంతి చర్చలవేళ సంచలనం..

**• హమాస్ ప్రత్యర్థుల ఊచకోత**



**గాజా:** ఇజ్రాయెల్ బందీల విడుదల అనంతరం హమాస్ సాయుధ గ్రూపు చూపు ఇప్పుడు ప్రత్యర్థి వర్గాలపై పడింది. గాజా ప్రాంతంపై పట్టు తిరిగి సాధించేందుకు విరోధి సాయుధ శ్రేణులను ఏరి పారేసే పనికి పూనుకుంది.ఈ పరిణామం అమెరికా మధ్యవర్తిత్వంతో నెలకొన్న కాల్పుల విరమణ మనుగడపై కొత్త అనుమానాలను తెరపైకి తెస్తోంది. ఇప్పటికైనా శాంతి నెలకొందని సంతోష పడుతున్న పాలస్తీనియన్లను హమాస్ వైఖరి భయపెడుతోంది. వివరాల ప్రకారం.. హమాస్ ఫైరింగ్ స్క్వాడ్ తాజాగా ప్రత్యర్థి వర్గాలకు చెందిన 8 మందిని కాల్చి చంపినట్లు సమాచారం. మొత్తమ్మీద 50 మందిని ఇప్పటి వరకు మట్టుబెట్టి ఉంటుందని వైనెట్ వార్తా సంస్థ తెలిపింది. అంతర్గత భద్రతను హమాస్ చూసుకుంటుందని ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపట్లోనే ఈ పరిణామాలు చోటుచేసుకున్నట్లు ఆ సంస్థ వ్యాఖ్యానించింది. కళ్లకు గంతలు కట్టి, బంధించిన వారిని ముసుగులు ధరించిన హమాస్ సభ్యులు దాదాపు బహిరంగంగానే కాలుస్తున్నట్లుగా ఉన్న వీడియోను షఫఖ్ న్యూస్ ప్రసారం చేసింది. దీనిపై స్పందించిన హమాస్.. ఇజ్రాయెల్ బలగాలకు సహకరించడంతోపాటు నేర కార్యకలాపాల్లో పాల్గొన్నందుకే వీరిని శిక్షించామని తెలిపింది. అయితే, హమాస్ చర్యలు గాజాలోని డొగ్‌ముష్ వంటి గ్రూపులతో హింసాత్మక ఘర్షణలకు దారి తీస్తున్నాయి. డొగ్‌ముష్ వర్గం గాజాలోని అత్యంత శక్తివంతమైన సాయుధ గ్రూపుల్లో ఒకటి. హమాస్ భద్రతా విభాగంతో జరిగిన కాల్పుల్లో డొగ్‌ముష్‌కు చెందిన 52 మంది చనిపోయారని వైనెట్ పేర్కొంది. ఈ పోరులో 12 మంది హమాస్ సాయుధులు కూడా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో హమాస్ సీనియర్ నేత బస్సెమ్ నయీమ్ కుమారుడు కూడా ఉన్నట్లు వైనెట్ పేర్కొంది. ప్రత్యర్థుల ప్రాంతాల్లోకి గుట్టుచప్పుడు కాకుండా అంబులెన్సుల్లో వెళ్లిన హమాస్ శ్రేణులు శత్రు సం హారం చేస్తున్నారని తెలిపింది. పౌరుల ప్రాణాలకు ప్రమాదం కలిగించేలా వ్యవహరిస్తోందంటూ హమాస్‌పై విమర్శలు వస్తున్నాయి.అత్యంత అధునాతన, భారీ ఆయుధాలు కలిగిన డొగ్‌ముష్‌కు ఎప్పట్నుంచో హమాస్‌తో విభేదా లున్నాయి. ఈ గ్రూపునకు ఇజ్రా యెల్ మద్దతుందనే అనుమానాలు కూడా ఉన్నాయి. రఫా లోని యాసెర్ అబూ షబాబ్ సారథ్యంలోని గ్రూపు సహా గాజాలోని పలు ముఠాలకు పరిమితంగా సాయం, ఆయుధాలు అందిస్తున్నట్లు ఇజ్రాయెల్ ఇటీవల ప్రకటించడం గమనార్హం. ఇటీవల హమాస్ శ్రేణులు యాసెర్ అబూ షబాబ్ సన్నిహితుడొకరిని చంపేసినట్లు ప్రకటించుకున్నాయి. షబాబ్‌ను వదిలేది లేదని కూడా తెలిపాయి.హమాస్‌లోని యారో యూనిట్ హింసాత్మక ప్రతీకార చర్యల్లో ఆరితేరిందని నిపుణులు అంటున్నారు. ఇన్నాళ్లూ సొరంగాల్లో రహస్యంగా నక్కుతూ పనిచేసిన హమాస్ సాయుధులు ఇప్పుడు తమ శత్రువుల అంతం చూసే పనిలో నిమగ్నమైనట్లు చెబుతు న్నారు. శాంతి ఒప్పందాన్ని అనుసరించే ఉద్దేశం హమాస్ లేనట్లు కనిపిస్తోందంటున్నారు. 'ఆయుధాలను ఉంచుకోవాలనే ఉద్దేశంతోనే హమాస్ ఇప్పటికీ ఉంది. నిరాయుధీకరణ రెండో దశ చర్చలు ప్రారంభమయ్యేటప్పటికి గాజాపై పట్టు నిలుపుకోవాలనే పట్టుదలతో ఉంది'అని విశ్లేషకులు అంటున్నారు.

# త్వరలో వందేభారత్ 4.0

వెల్లడించారు.సీఐఐ ఇంటర్నేషనల్ రైల్ కాన్ఫరెన్స్‌లో కేంద్రమంత్రి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం రైల్వేల అభివృద్ధిపై బలంగా దృష్టి సారించిందని వెల్లడించారు. 11 ఏళ్లలో 35,000 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌ల నిర్మాణం జరిగిందని చెప్పారు. జపాన్ బుల్లెట్ రైల్ నెట్‌వర్క్ మాదిరిగానే హైస్పీడ్ ప్యాసింజర్ రైల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పారు. గరిష్ఠంగా గంటకు 350 కి.మీ వేగంతో రైలు ప్రయాణించేలా వాటి డిజైన్ ఉంటుందని తెలిపారు.



# నక్సల్స్‌పై రివార్డుకు పన్ను మినహాయింపు

**న్యూఢిల్లీ:**భారతదేశంలో నక్సల్స్/ మావోయిస్టులు లొంగిపోవడం అనేది నిరంతర ప్రక్రియ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాలు, ఇతర కొన్ని కారణాల వల్ల చాలా మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోతున్నారు.అయితే ముఖ్య నేతలపై ఉండే భారీ నజరానా (రివార్డు)ను లొంగిపోయిన తర్వాత వారికి అందిస్తారు. ఈ నేపథ్యంలో లొంగిపోయిన నక్సల్స్‌కు ఇచ్చే నజరానాపై ఆదాయపు పన్ను (%×అషీఎవ ఖఇ%) ఉంటుందా? అనే అనుమానం సహజంగా ఉత్పన్నమవుతుంది. దానికి సంబంధించిన విషయాలు తెలుసుకుందాం. తొలితరం మావోయిస్టు అగ్రనేత, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను గడ్చిరోలి(మహారాష్ట్ర) పోలీసులకు లొంగిపోయారు. ఆయనపై రూ.6 కోట్ల వరకు రివార్డు ఉంది. తనతోపాటు మరో 60 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

నక్సల్స్ లొంగుబాటు, నజరానా

నక్సల్స్‌కు ప్రభుత్వాలు ప్రకటించే లొంగుబాటు విధానంలో భాగంగా సాయుధ దళాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి రావాలనుకునే వారికి పునరావాసం కల్పిస్తారు. ఈ విధానంలో లొంగిపోయిన నక్సల్స్‌కు, ముఖ్యంగా కీలక స్థానాల్లో ఉండి లొంగిపోయేవారికి వారి స్థాయి, హింసాత్మక చర్యల తీవ్రత ఆధారంగా ప్రభుత్వం భారీ మొత్తంలో నగదు బహుమతి (నజరానా/రివార్డు) ఇస్తుంది. లొంగిపోయిన తర్వాత సాధారణ జీవితాన్ని ప్రారంభించేందుకు, ఇల్లు కట్టుకోవడానికి, వృత్తిపరమైన శిక్షణ పొందడానికి వారికి ఇది ఆర్థిక సాయంగా ఉంటుంది.

ఆదాయపు పన్ను చట్టం ఏం చెబుతోంది?

భారతదేశ ఆదాయపు పన్ను చట్టం, 1961 ప్రకారం ప్రభుత్వాల నుంచి పొందే కొన్ని రకాల అవార్డులు లేదా నజరానాలపై పన్ను మినహాయింపు ఉంటుంది.సెక్షన్ 10 ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ఏదైనా సంస్థ ద్వారా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేసిన అవార్డు లేదా నజరానా కింద నగదు రూపంలో, ఇతర రూపంలో పొందిన ఏదైనా చెల్లింపులపై పన్ను మినహాయింపు ఉంటుంది.

ప్రభుత్వ లక్ష్యం: నక్సల్స్ లొంగుబాటు అనేది ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టిన ఒక కార్యక్రమం. నక్సలిజాన్ని అంతం చేయడానికి, శాంతిని పునరుద్ధరించడానికి, హింసను విడిచిపెట్టినవారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి ఈ రివార్డులు, పునరావాస విధానాలు రూపొందించారు. ఈ లక్ష్యాలను పరిగణనలోకి తీసుకుంటే నక్సల్స్ లొంగుబాటుపై ఇచ్చే నజరానా ప్రజా ప్రయోజనం కిందకు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ విషయంలో తుది నిర్ణయం కోసం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల పునరావాస విధాన మార్గదర్శకాలు, కేంద్ర ఆదాయపు పన్ను శాఖ అధికారిక నోటిఫికేషన్లను పరిశీలించవలసి ఉంటుంది.



# మడగాస్కర్‌లో సైనిక కుట్ర అధ్యక్షుడి తొలగింపు

**అంటననారివో:** జెన్ జెడ్ ఆందోళనలతో అట్టుకుతున్న మడగాస్కర్‌లో సైనిక తిరుగుబాటు జరిగింది. అధ్యక్షుడు ఆండ్రీ రజొలినా పదవి నుంచి ఉద్వాసనకు గురయ్యారు.రజొలినాను అభిశంసిస్తూ పార్లమెంట్ తీర్మానం ఆమోదించింది. ఆ వెంటనే ఆయన గుర్తు తెలియని ప్రాంతానికి వెళ్లిపోయారు. తిరుగుబాటుకు నేతృత్వం వహించిన క్యాప్‌శాట్ సైనిక విభాగం నేత కల్నల్ మైకేల్ రండ్రియానిరినా మీడియా సమక్షంలో ఒక ప్రకటన చేశారు. అధికారం తమ చేతుల్లోకి వచ్చిందన్నారు. మిలటరీ, పోలీసు ఉన్నతాధికారులతో ఏర్పాటయ్యే కౌన్సిల్ ప్రభుత్వాన్ని నడిపిస్తుందని ప్రకటించారు. త్వరలోనే ప్రధానిని కూడా నియమి స్తామన్నారు. అత్యున్నత న్యాయస్థానం అధికారాలను రద్దు చేశామన్నారు. రెండేళ్లలోగా దేశంలో రెఫరెండం జరిపిస్తాన్నారు. దీంతో, రాజధానిలో ప్రజలతోపాటు సైనికులు సంబరాలు చేసుకున్నారు.

# ఛీ.. ఈ చెత్త ఏంటి? అసహ్యామేస్తోంది..

## ఎందుకిలా చేశారు?: ట్రంప్ ఫైర్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సంతోషం వచ్చినా.. కోపం వచ్చినా అస్సలు ఆగరు. తాజాగా టైమ్ మ్యాగజైన్ ఆయన్ని పొడుగుతూ ఓ కథనం ఇచ్చింది. అయినా కూడా ట్రంప్‌కు బాగా కోపం వచ్చింది.ఇంతకీ ఏం జరిగిందంటే..టైమ్ మ్యాగజైన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సొంత సోషల్ మీడియా సోషల్ ట్రూత్‌లో ఓ పోస్ట్ పెట్టారు కవర్ పేజీపై తన ఫొటోలో జుట్టు సరిగా కనిపించకపోవడమే అందుకు ప్రధాన కారణం. ఇంతకీ ఆయన ఆ పోస్టులో ఏమన్నారంటే..నా గురించి వచ్చిన కథనం కొంతవరకు బాగానే ఉంది. కానీ కవర్‌పై ఉన్న ఫొటో మాత్రం చరిత్రలోనే చెత్త ఫొటో. వాళ్లు నా జుట్టును కనిపించకుండా చేశారు. నా జుట్టును తలపై చిన్న తలపాగా.. ఏదో తేలియాడుతున్నట్లుగా చూపించారు. ఇది చాలా విచిత్రంగా అనిపించింది. నాకు ఎప్పుడూ కింది యాంగిల్ నుంచి తీసే ఫోటోలు నచ్చవు. ఇది మాత్రం చాలా చాలా చెత్త ఫొటో. అందుకే దీన్ని తప్పక విమర్శించాలి. అసలు వాళ్లు ఏం చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు?" అంటూ ట్రంప్ మేనేజ్‌మెంట్‌పై మండిపడ్డారు.ఇదిలా ఉంటే టైమ్ మ్యాగజైన్‌ను ట్రంప్ కోపడ్డడం ఇదే తొలిసారేం కాదు. ఫిబ్రవరిలో.. డోజ్ చీఫ్‌గా ఉన్న ఎలాన్ మస్క్ ఓవల్ ఆఫీస్‌లో రెజల్యూట్ డెస్క్ మీద కూర్చున్నట్లు ఓ ఫొటోను ప్రచురించింది. ట్రంప్ ఆ ఫొటోపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు టైమ్ మ్యాగజైన్ ఇంకా నడుస్తుంది అనుకోలేదు అంటూ వెటకారం ప్రదర్శించారు. అదే సమయంలో.. అయితే మస్క్ పని తీరును ఆ సమయంలో ఆయన ప్రశంసించారు.ఇదిలా ఉంటే.. ఇప్పుడు ట్రంప్ మీద టైమ్ మాగజైన్ అనే శీర్షికతో కవర్ పేజీ ఇచ్చింది. గాజా శాంతి ఒప్పందంలో ఆయన చేసిన కృషికిగానూ ఈ కథనం ప్రచురించింది. ఈ ఒప్పందంతోనే 20 మంది ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడుదల చేయగా.. ఇజ్రాయెల్ సుమారు 2,000 మంది పాలస్తీనా ఖైదీలను, 360 మంది పాలస్తీనీయుల మృతదేహాలను విడుదలకు సిద్ధమైంది. అయితే ఈ ఏడాదిలోనే తాను పలు యుద్ధాలను ఆపానంటూ ట్రంప్ నోబోల్ శాంతి బహుమతి డిమాండ్ చేయగా.. రూల్స్ అడ్డురావడంతో ఆయన కల నెరవేరలేదు!. దీంతో వచ్చే ఏడాదైనా దక్కవచ్చనే ఆశ పెట్టుకున్నారాయన.

# కొనసాగుతున్న ఉద్రిక్తతలు

స్పిన్ బోల్డాక్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన దాడుల్లో దాదాపు 20 మంది తాలిబాన్ సభ్యులు మరణించారని పాకిస్తాన్ సైన్యం తెలిపింది. పౌర జనాభాను పట్టించుకోకుండా ఈ దాడి జరిగిందని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. పాకిస్తాన్ సైన్యంతో సరిహద్దులో రాత్రిపూట జరిగిన ఘర్షణల్లో దాదాపు 30 మంది మరణించారని తెలుస్తోంది.రెండు దేశాల మధ్య సరిహద్దుల్లో జరిగిన తాజా హింసలో 15 మంది పౌరులు మృతి చెందారని సంబంధిత అధికారులు ఆఫ్ఘన్ వార్తా సంస్థకు తెలిపారు. పాకిస్తాన్ సరిహద్దు జిల్లా ఒరాక్జాయ్‌లో దళాలు ఉగ్రవాదుల మధ్య జరిగిన పోరాటంలో ఆరుగురు పాకిస్తాన్ పారామిలిటరీ సైని కులు మృతి చెందారని, పలువురు గాయపడ్డారని భద్ర తా అధికారులు వెల్లడించినట్లు రాయిటర్స్ పేర్కొంది. కాగా తాలిబాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజా హిద్ పాక్ భారీ ఆయుధాలతో దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌లో జరిగిన దాడికి ప్రతి స్పందనగా ఇరు దేశాల మధ్య దాడులు కొనసాగు తున్నాయి.కాగా తమ దాడుల్లో 58 మంది పాకిస్తాన్ సైనికులు మరణించారని ఆఫ్ఘనిస్తాన్ ప్రకటించినప్పటికీ, మృతుల సంఖ్య 23 అని పాకిస్తాన్ తెలిపింది.

## నగర అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- రామగుండం నగరంలో ఎమ్మెల్యేతో కలిసి విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**గోదావరిఖని, జనంసాక్షి :** నగర అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ తోలి కలిసి రామగుండం నగరంలో విస్తృతంగా పర్యటించారు. గోదావరిఖనిలోని సమ్మక్క సారలమ్మ జాతర గద్దెల అభివృద్ధి పనులు, గోదావరి నది ఒడ్డున ఉన్న స్మశాన వాటిక నిర్మాణ పనులు, రామగుండం మసీదు టర్నింగ్, రామగుండం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రైల్వే స్టేషన్ ఎదురుగా జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, సమ్మక్క సారలమ్మ గద్దల అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. సింగరేణి, ఆర్ఎఫ్‌సిఎల్, ఎన్టిపిసి, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు.
గోదావరి నది ఒడ్డున ఉన్న స్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. నగరంలోని అంబేద్కర్ విగ్రహం ముందు జంక్షన్ అభివృద్ధి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. మసీదు టర్నింగ్ పాయింట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు.రామగుండం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.
అంతకుముందు రామగుండం మున్సిపల్ కార్యాలయంలో నగర అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ పై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 28 కోట్ల 8 లక్షల రూపాయల డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా నగరంలో 181 అభివృద్ధి పనులు మంజూరు చేయడం జరిగిందని, వీటికి సంబంధించి టెండర్ల ప్రక్రియ త్వరగా చేపట్టి పనులు గ్రౌండ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.రామగుండం నియోజకవర్గ పరిధిలో ఎన్టిపిసి సంస్థ సిఎస్ఆర్ నిధుల ద్వారా 8 కోట్ల 55 లక్షల రూపాయలతో 31 అభివృద్ధి పనులు మంజూరు చేసామని, వీటిలో చాలావరకు నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్నాయని, అభివృద్ధి పనులకు నిధులు ఆటంకం లేనందున ఎక్కడ ఆలస్యం కాకుండా త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చేలా అధికార యంత్రాంగం పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యా దాతకు అరుదైన అవార్డు

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు స్వీకరించిన అల్ఫోర్స్ చైర్మన్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనంసాక్షి):**
విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించడం ద్వారా వారికి ఉజ్జ్వల భవిష్యత్తు ఉంటుందని వివిధ రంగాలలో ఘనవిజయాలు సాధిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి. బుదవారం రోజు హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అత్యుత్తమ ఉపాధ్యాయుని అవార్డు స్వీకరించిన సందర్భంగా మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర విద్యా రంగంలో 1991 నుండి విద్యార్థులకు విద్యాసంస్థల ఏర్పాటు ద్వారా అత్యుత్తమ విద్యను అందించడమే కాకుండా వారిని ఉత్తమ స్థానాలలో స్థిరపడేదందుకు కృషి చేస్తున్నామని వారు తెలిపారు. ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు అన్ని రంగాలలో నిపుణులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీ పరీక్షలలో విజేతలుగా నిలుపుతున్నామని వారు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యారంగంలో చాలా ప్రశంసనీయమైన, విశిష్టమైన సేవలను అందిస్తున్నందుకు, ప్రపంచ ప్రమాణాలు పాటిస్తూ.. విద్యానందిస్తున్నందుకు, సాంకేతిక పరిజ్ఞానాన్ని చక్కగా వినియోగించడంలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు ప్రధానంగా అత్యుత్తమ అధ్యాపకులచే విద్యార్థులకు నాణ్యతమైన శిక్షణ ఇప్పిస్తూ.. ఘనవిజయమైన వైపు పయనించే విధంగా చేస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అత్యుత్తమ ఉపాధ్యాయుని అవార్డు స్వీకరించడం చాలా గర్వించదగ్గ విషయమని వారు తెలిపారు. అవార్డు అబ్దుల్ కలాం కి అంకితమిస్తున్నానని, విద్యా సంస్థల అభివృద్ధికై అహర్నిశలు చేయూతనిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వారం రోజుల వ్యవధిలోనే మరో ప్రతిష్టాత్మక అవార్డు రావడం పట్ల ఉమ్మడి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అభినందనలు వెలువడుతున్నాయని, ఈ అవార్డు బాధ్యత పెంచినదని తెలిపారు. నరేందర్ రెడ్డి కృషికి మరో అవార్డు రావడం చాలా గొప్ప విషయమని వారు తెలిపారు. చాలా ప్రతిష్టాత్మక అవార్డు పట్ల రాజకీయ ప్రముఖులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల యజమాన్యాలు, విద్యార్థి సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ రానున్న రోజుల్లో మరిన్ని చారిత్రాత్మక అవార్డులను గెలుచుకొని తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి గొప్ప దీక్సూచిగా ఉండాలని వారు ఆకాంక్షించారు.

## యువశక్తికి ప్రేరణగా నిలిచిన అబ్దుల్ కలాం

### స్వచ్ఛంద యువజన సంఘాల రాష్ట్ర నాయకులు శంకర్



**గోదావరిఖని, జనంసాక్షి :** భారతరత్న, మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా నిలిచిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94 జయంతి సందర్భంగా రామగుండం యువ మిత్ర సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక గోదావరిఖని మార్కండేయ కాలనీలోని యువ మిత్ర కార్యాలయంలో బుధవారం అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించడం జరిగింది. కలాం జయంతి పురస్కరించుకొని ప్రపంచ విద్యార్థి దినోత్సవం సందర్భంగా కాలేజీ విద్యార్థులకు కేక్ కట్ చేసి తినిపించడం జరిగింది ఈ సందర్భంగా ఈదునూరి శంకర్ మాట్లాడుతూ...ఉన్నంత కలలు కనండి సాకారానికి కఠోర సాధన చేయండి అంటూ నినాదించిన అబ్దుల్ కలాం జీవితం తెరిచిన పుస్తకం యువతకు మార్గదర్శకం నేటి యువతకు ప్రేరణత్మకం ఆయన ఇంజనీర్, సైంటిస్ట్, రచయిత, ఆచార్యులు, యువత ఆరాధ్య దైవం రాజకీయవేత్త ,యువతకు మార్గదర్శకం గా బహుముఖను ప్రతిభను కలిగిన అబ్దుల్ కలాం బోధనలు అనితర సాధ్యాలు, నేను చేయగలనని దృఢ సంకల్పం విజయాలను అందిస్తుందని దేశ భవిష్యత్తు యువశక్తి పైనే మీదనే ఆధారపడి ఉందని నిరంతరం శ్రమించిన అబ్దుల్ కలాం యువతకు ప్రేరణగా నిలుస్తారని మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా నిలిచిన అబ్దుల్ కలాంని కొనియాడినారు ఈ కార్యక్రమంలో ఇన్కమ్ టాక్స్ ఆడిటర్ ఎండి ఇబ్రహీం, నాయకులు బుద్దే గోవర్ధన్, రామగుండం యువ మిత్ర సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎలకంటి సుధీర్, యువ మిత్ర నాయకులు రౌతు శరత్, తుంగపిండి సురేష్ , సంఘ స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు

## ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై
# దేశవ్యాప్తంగా అతిపెద్ద రాజకీయ కుట్ర

- మాల మహానాడు అండ్ రాక్స్, నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనంసాక్షి):**
బీజేపీ, ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యత పై దేశవ్యాప్తంగా చరిత్రలోనే అతి పెద్ద రాజకీయ కుట్ర అని మాల మహానాడు అండ్ రాక్స్, నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ కరీంనగర్‌లో ఒక ప్రైవేట్ హెూటల్‌లో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా డా.ఆర్ ఎస్. రత్నాకర్ మాట్లాడుతూ... అసలు ఈ ఎస్సీ వర్గీకరణను శాంపుల్‌గా పంజాబ్, హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అని, బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని దేశం మొత్తం చేశాడు మన ప్రధాని మోడీ. దేశంలో అందరికన్నా ముందుగా ఎస్సీ వర్గీకరణ తెలంగాణ రాష్ట్రం లో చేయడం, దాన్ని కర్ణాటక కాంగ్రెస్ సర్కార్ ఫాలో అవ్వడం, దేనికి నిదర్శనం? రాహుల్ గాంధీకి ఇదంతా తెలిసే జరుగుతుందా? ఎస్సీ వర్గీకరణ అనేది సామాజిక న్యాయం అని డప్పు కొట్టుకునే రేవంత్ రెడ్డి, ఈ సామాజిక న్యాయం ఎస్సీలకు రిజర్వేషన్ పేరుతో పడేసే కేవలం ఎంగిలి మెతుకుల్లోనేనా? ఈ దేశ సంపద, ముఖ్యమంత్రి పదవి, మంత్రి పదవులు, ఈ దేశ పరిశ్రమలు, జడ్జెస్ నియామకాలు, పరిశ్రమల్లో అక్కర్లేదా? రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. నిజానికి ఎస్సీ వర్గీకరణ వల్ల వందలో నలుగురికే బెనిఫిట్ జరుగుతోందని, ఈ వందలో నలుగురికి ఇచ్చే ఈ ఈ ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు ప్రదాన మంత్రి మోడీ? అలాగే ఈ నాలుగు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు? ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నిస్తూ ఉన్నానని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాల సామాజిక వర్గం పై పగపెంచుకుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలపై తనకు ఏ విధమైన ఈర్ష ద్వేషాలు ఉన్నాయో చేసి చూపించాడని, మాలల హెూల్సేల్ మేనమామ మాలలకు అన్యాయం జరుగుతున్న ముద్దులతో సరిపెట్టేసాడు తప్ప ఈనాటికీ స్పందించలేదు. ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవి కదా, ఇక చేసేదేముందని అనుకోకండి మిత్రులారా, ప్రజలు తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే, తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం, అన్యాయం, చెంచాగిరికి అలవాటు పడ్డ మాల నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని, రిజర్వేషన్లు బెనిఫిట్ పొందిన మాల ఉద్యోగులరా! మాల జాతిని తొక్కేస్తా ఉన్నారు ఇకనైనా కళ్ళు తెరిచి బయటకు రండి, మా ఈ పోరాటానికి మద్దతు ఇవ్వండి, తెలుగు రాష్ట్రాల్లో ఏ నాడు ఎదుర్కొనటువంటి గడ్డు పరిస్థితిని మాల సామాజిక వర్గం నేడుఎదుర్కొంటూ ఉందన్నారు. పూర్తిగా తెలుగు రాష్ట్రంలో మన కులం, ఉనికిని కోల్పోయాం , శాంతియుత పోరాటానికి సిద్ధం కండి అని డా. ఆర్ఎస్ రత్నాకర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమం లో బల్లెం లక్ష్మణ్, కామన్ ప్రభాకర్ రావు, మిరియాల బాలశౌరి, కొప్పుల ప్రేమ్ బాబు, నెల్లి సూరిబాబు, కామా ప్రభాకర్, కనికెళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.





## జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక గుర్రపు మేఘన మర్కల్

**సదా శివనగర్ అక్టోబర్ 15 (జనం సాక్షి)** ఎస్‌జిఎఫ్ అండర్ 19 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక ఈనెల 12, 13, 14 తేదీలలో ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది .జాతీయ స్థాయి పోటీలు నవంబర్ చివరి వారంలో మణిపూర్ ఇంపాల్ రాజధానిలో జరిగే పోటీలకు మేఘన తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున పాల్గొంటుంది. ఈమె స్వగ్రామం మర్కల్ సదాశివనగర్ మండలం ఈమె ప్రస్తుతం దోమకొండ గురుకుల బాలికల పాఠశాల తెలంగాణ సోషల్ వెల్ఫేర్‌లో ప్రస్తుతం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపు చదువుతుంది .ఈమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయినందుకు మర్కల్ గ్రామస్తులు దోమకొండ బాలికల పాఠశాల అధ్యాపక బృందం కళాశాల ప్రిన్సిపల్ మేఘనను అభినందించారు.

## తేజాస్‌లో ఖో-ఖో విజేతలకు చైర్మన్ సతీష్ రావు పారితోషికాలు




**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా తేజాస్ జూనియర్ కళాశాలలో 69వ ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఖో-ఖో పోటీలో గెలిచిన జట్లకు కళాశాల చైర్మన్ సి.హెచ్. సతీష్ రావు పారితోషికాలు అందజేశారు. అండర్-14 బాలికల విభాగంలో తిమ్మాపూర్ మండల జట్టు మొదటి స్థానం, గంగాధరం మండల జట్టు రెండో స్థానం సాధించాయి. అదే విధంగా అండర్-14 బాలురు విభాగంలో కరీంనగర్ రూరల్ జట్టు మొదటి స్థానం, కొత్తపల్లి జట్టు రెండో స్థానం నిలిచాయి. ఈ విజేతలకు చైర్మన్ సతీష్ రావు క్రీడా దుస్తులు, నగదు పారితోషికాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన చైర్మన్ సతీష్ రావు క్రీడల్లో పాల్గొనే విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనవారికి అందరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి బి. వేణుగోపాల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు బాబు శ్రీనివాస్, అంతటి శంకరయ్య, తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో సంఘ రెఫరీస్ బోర్డ్ కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

## నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలో రైస్ మిల్లులకు తరలించాలి

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభించేలా ప్రణాళిక
- అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




**పెద్దపల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలో మద్దతు ధరకు కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో వానాకాలం పంట కొనుగోలు పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ డి. వేణు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ఓపెన్ చేయాలని, ఒకేసారి ధాన్యం భారీగా రాకుండా క్రమ పద్ధతిలో వచ్చేలా చూడాలని అన్నారు. మన కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేసి 24 గంటల లోగా రైస్ మిల్లులకు తరలించి ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు.రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి వేగవంతంగా జరిగేలా పటిష్ట వ్యవస్థను పౌరసరఫరాల సంస్థ సిద్ధం చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రం, రైస్ మిల్లుల వద్ద హమాలీల కొరత రాకుండా చూడాలని అన్నారు.ప్రతి మండలంలో హార్వెస్టర్లతో వ్యవసాయ విస్తరణ అధికారులు సమావేశం నిర్వహించి వరి కోతల సమయంలో పాటించాల్సిన నిబంధనల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. నవంబర్ చివరి వరకు పెద్దపల్లి జిల్లాలో 2 లక్షల పైగా మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేలా కార్యాచరణ ఉండాలని అన్నారు.నవంబర్ నెలలో ప్రతిరోజు మన పెద్దపల్లి జిల్లాలో 10 నుంచి 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
అకాల వర్షాలు కురిసే సమయంలో టార్పాలిన్ కవర్లతో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీధర్, మేనేజర్ ఎం శ్రీకాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు

**గంభీరావుపేట అక్టోబర్ 15 (జనం సాక్షి):** గంభీరావుపేట మండల కేంద్రంలోని బుధవారం రోజు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రముఖ వైద్యులు సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ,ఆధ్వర్యంలో కళాశాల లోని విద్యార్థిని విద్యార్థులకు సామాజిక భావోద్వేగా పరిస్థితులు సంబంధించిన మరియు మానసిక ఆరోగ్యం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ సిహెచ్ఓ రమేష్, వైద్య సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

## రాజన్న ఆలయ అభివృద్దే ఎజెండా

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి) :**
దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి ఎజెండాగా ముందుకు సాగుతామని ప్రభుత్వ విప్ బుధవారం ఆది శ్రీనివాస్ తెలిపారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ అభివృద్ధి పనులపై ఈనెల19, 20 న శృంగేరి పీఠాధిపతి శ్రీ విధిశేఖర భారతి తీర్థస్వామి పర్యటన నేపథ్యంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో,ఆలయ అభివృద్ధి పనులు ఎలా నిర్వహిస్తారని ఆలయ పరిసర ప్రాంతాలు పరిశీలన చేసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలు పరిశీలన చేసిఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులు,భక్తుల దర్శనాలు శృంగేరి పీఠాధిపతి పర్యటన క్రమంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రూ 76 కోట్లతో మొదటి దశలో ఆలయ అభివృద్ధి పనులు,రూ 35 కోట్లతో నిత్యాన్నదాన సత్రం భవనం నిర్మాణం,రూ 47 కోట్లతో రహదారి విస్తరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి క్రమంలో భక్తులకు ఆలయం ముందు భాగంలోని రావి చెట్టు కింద ఎల్ఈడీ తెర ఏర్పాటు చేసి స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు.స్వామివారి రథంతో ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించి స్వామి వారి ఆశీర్వాదం అందించామన్నారు. అదే విధంగా ఆలయ ఆవరణలో రథాన్ని నిలిపి స్వామి వారి దర్శన భాగ్యం ఆశీస్సులు అందిస్తామన్నారు. ఆలయ అభివృద్ధిపై ప్రతి శుక్రవారం అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజన్న ఆలయ అభివృద్ధి ఏ ఒక్కరి ఎజెండా కాదని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి, జిల్లా మంత్రుల సలహాలు సూచనలు,భక్తుల సలహాలు సూచనలు ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగుతాయన్నారు. శృంగేరి పీఠాధిపతి పర్యటనలో భక్తులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పర్యటన విజయవంతం చేయాలని కోరారు. అభివృద్ధి పనుల్లో భాగంగా భక్తుల సేఫ్టీని దృష్టిలో ఉంచుకొని దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఇన్చార్జి కమిషనర్ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి విస్తరణ పనులలో భాగంగా భక్తుల దర్శనాలు, కోడె మొక్కులు ఇతర పూజలు కల్పించే విషయమై చర్చించినట్లు తెలిపారు. మరో రెండు వారాల్లో కళ్యాణకట్ట ఇతర కట్టడాలు కూల్చివేతలో పూర్తవుతాయన్నారు. కూల్చి వేతలు ఒకవైపు మరోవైపు మహా మండపం నిర్మాణం పూర్తి కావాల్సి ఉందన్నారు. ఆలయ తూర్పు భాగంలో స్వామివారి రథోత్సవంలో శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ రాజరాజేశ్వర స్వామి, శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులతో భక్తులకు దర్శన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయంలో స్వామివారి ఏకాంత సేవల్లో భక్తుల మొక్కుబడి కోసం టికెట్లు తీసుకున్న భక్తుల గోత్రనామాలు చదివి పూజలు చేస్తారన్నారు. రథంపై అమర్చిన ఉత్సవమూర్తులను,ఎల్ఈడి స్క్రీన్ పై చూపిస్తున్న స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవలన్నారు. భీమేశ్వరాలయంలో సైతం ఆర్జిత సేవలు భక్తులకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, వీటిడిఎ వైస్ చైర్మన్ హరిత, ఎస్పీ మహేష్ బి గీతే, అడ్వైజర్ గోవింద హరి, ఆలయ ఆర్కిటెక్చర్ సూర్యనారాయణ మూర్తి, ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయి, ఏఎస్పి శేషాద్రిని రెడ్డి, ఆర్అండ్‌బి, అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్ సారు మా స్కూలుకు బస్సులు నడిపించండి





### మోడల్ స్కూల్ విద్యార్థులు

**గంభీరావుపేట అక్టోబర్ 15 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా జంభీరావుపేట మండల కేంద్రంలోని దమ్మన్నపేట గ్రామంలో గల మోడల్ స్కూల్ వెళ్లాలంటే అరకొర బస్సులు.. విద్యార్థుల అవస్థలు బడి బస్సులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పలు మార్గాల్లో బస్సు సర్వీస్‌లు లేవు. ఉన్న రూట్లలో సమయానికి రాక ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సమయానికి బస్సులు రాకపోవడంతో పాఠశాలలకు వెళ్లలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. కలెక్టర్ సారు.. మా పాఠశాల సమయంలో బస్సులు నడిపించాలని వేడుకుంటున్నారు,, సమయానికి బస్సులు రాక మోడల్ స్కూల్లో చదివే వివిధ గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు సమయా నికి బస్సు లేక, సమయానికి చేరుకోలేక, ఇబ్బంది పడుతున్నామని విద్యార్థి విద్యార్థినీలు బాధపడుతున్నారు,

**బస్సులు లేక నడుచుకుంటూ విద్యార్థులు:**
దమ్మనంపేట గోరంటాల సముద్రా లింగాపూర్, నాగంపేట, విద్యార్థులు విద్యార్థినీలు, కామారెడ్డి కరీంనగర్ డిపోల నుండి పెద్దమ్మ స్టేజి వద్ద దిగి నడుచుకుంటూ,, విద్యార్థులు బస్సులు లేక వస్తున్నారు, మార్గమధ్యంలో కోతుల బెడదతో భయం భయంగా వస్తున్నారు, కలెక్టర్ సారు మా పాఠశాలకు సమయానికి బస్సు వచ్చే విధంగా చూడాలని కోరుకుంటున్నారు,

**దీన్ని అదునుగా చేసుకుంటున్న ప్రైవేటు పాఠశాలలు :**
బస్సులు నడవకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో చదవాలనుకున్న విద్యార్థులు తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూల్లో వేయడమే మేలుకుంటున్నారు, ప్రభుత్వ పాఠశాలలో చదవాలంటే బస్సు సౌకర్యం లేకుండా పోయింది, దీన్ని అదునుగా చేసుకొని ప్రవేట్ పాఠశాలలు వారి బస్సుల నుండి విద్యార్థులను తరలించడం వల్ల అదే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచన చేస్తున్నారు.. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు మొగ్గు చూపుతున్నారు..

**దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు :**
లింగన్నపేట కొత్తపల్లి గంభీరావుపేట ముస్తాబాద్ మండలాల నుండి వచ్చేవారికి గంభీరావుపేట లింగన్నపేట మధ్య రోడ్డు మొన్నటి వర్షాలకు కొట్టుకపోవడంతో, బ్రిడ్జి పనులు నత్త నడక సాగడంతో, బస్సులు నడవలేకపోతున్నాయి, వచ్చే బస్సులు సిద్దిపేట బస్సులు నర్మల మీదుగా కామారెడ్డికి వెళ్తున్నాయి, దీనివల్ల గంభీరావుపేట ప్రజలు మోడల్ స్కూల్లో చదివే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకుండా పోయింది, ఇప్పటికైనా రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారులు, డిపో మేనేజర్లు ఆలోచన చేసి గంభీరావుపేట మీదగా,, బస్సులు నడపాలని,, విద్యార్థి విద్యార్థినీలు ప్రజలు కోరుకుంటున్నారు

# మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- డ్రగ్స్ నష్టాలపై విస్తృత ప్రచారం కల్పించాలి
- మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించిన అదనపు కలెక్టర్ డి.వేణు



**పెద్దపల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యల పై ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బనావత్ వనజ తో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు.జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ, చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, హాస్టల్స్ (ప్రభుత్వ, ప్రైవేట్)లలో విద్యార్థుల అలవాట్లను పర్యవేక్షించాలని, విద్యా సంస్థల పరిసర ప్రాంతాలలో ఎక్కడ డ్రగ్స్, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు రాకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాల పై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన వివరిస్తూనే సమాంత రంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు.అటవీశాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య బద్ధంగా డిసిసి ఎన్నిక

- రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం
- కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ బలోపేతం చేయాలి
- తమిళనాడు మాజీ ఎంపీ డా. జయ కుమార్
- పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణారావు



**పెద్దపల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్.కే గార్డెన్స్ లో బుధవారం ఎ.ఐ.సి.సి పరిశీలకులు తమిళనాడు మాజీ ఎంపి డా. జయ కుమార్ తో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ముందుగా పెద్దపల్లి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఎ.ఐ.సి.సి పరిశీలకులు డా. జయ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించిన ఎమ్మెల్యే విజయరమణ రావు.ఈ సందర్భంగా ఏఐసీసీ పరిశీలకులు, తమిళనాడు ఎంపీ డాక్టర్ జయ కుమార్ మాట్లాడుతూ ఏఐసీసీ నిర్ణయం హర్షించదగ్గదని, రాబోయే భవిష్యత్తు కాలంలో సమస్తవంతమైన నాయకుని ఎన్నుకోగలుగుతామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ను కిందిస్థాయి నుంచి వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి, పిసిసి కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ నాయకత్వంతో అమలవుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గంలతో పాటు ధర్మపురి నియోజకవర్గం ధర్మారం గ్రామంలో కూడా అభిప్రాయ సేకరణ చేయనున్నట్లు వివరించారు.డిసిసి ఎన్నికకు ప్రతి కార్యకర్త స్వేచ్ఛగా పోటీ చేయవచ్చని, అయితే అభిప్రాయ సేకరణ అనంతరం అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఆయన వివరించారు. డిసిసి అధ్యక్షుని ఎంపిక దరఖాస్తు కోసం ఈ నెల 22 వరకు చేసుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రం కేంద్రానికి పంపిన బీసీ బిల్లు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు తేల్చకపోవడం సరి కాదన్నారు. అమలు కానీ 42% బిసి రిజర్వేషన్ అసెంబ్లీ తీర్మానం చేసిందని చెబుతున్న బిజెపి నాయకులు కేంద్రంలో నాయకత్వం వహిస్తున్న నరేంద్ర మోడీని నిలదీయాలన్నారు.అభిప్రాయ సేకరణతో పెద్దపల్లి జిల్లా డిసిసి ఏర్పాటు పారదర్శకంగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు. పార్టీ డి.సి.సి ఎంపిక ప్రజాస్వామ్య బద్ధంగా ఉంటుందని అన్నారు. రాహుల్ గాంధీ జాతీయ భారత్ జోడో యాత్రతో మార్పు వచ్చిందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలని గ్రామీణ స్థాయి ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ నేషనల్ కో ఆర్డినేటర్ కేతూరి వెంకటేష్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ రాజేష్, టీపీసీసీ ప్రోటోకాల్ సెక్రటరీ బసిత్, పార్టీ జనరల్ సెక్రటరీ కాశీపాక రాజేష్, మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాన్నాయక దామోదర్ రావు, ఆరే సంతోష్, మార్కెట్ చైర్మన్లు మినుపాల ప్రకాష్ రావు,ఈర్ల స్వరూప,గండు సంజీవ్, మరియు మండల పార్టీ అధ్యక్షులు కాదర్ల శ్రీనివాస్,చిలుక సతీష్, మూల ప్రేమ్ సాగర్ రెడ్డి,సామ రాజేశ్వర్ రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, సదయ్య, పట్టణ అధ్యక్షులు భూషణవేణి సురేష్ గౌడ్, వేగోలపు అబ్బయ్య గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్, అసెంబ్లీ అధ్యక్షులు ముత్యాల నరేష్, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# జస్టిస్ గవాయిపై దాడికి తక్షణ చర్యలు తీసుకోండి

## సీనియర్ న్యాయవాది కొరివి డిమాండ్



**కరీంనగర్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** సుప్రీం కోర్టు జస్టిస్ బి.ఆర్. గవాయిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రముఖ సీనియర్ న్యాయవాది కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. గత బుధవారం ఖజురాహో దేవాలయాల కేసు విచారణ సమయంలో జస్టిస్ గవాయి వాఖ్యాలను కొందరు వక్రీకరించారు. దీనిపై ఆయన వివరణ ఇచ్చిన, రాకేష్ కిషోర్ అనే న్యాయవాది ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరారు. ఇది కేవలం ఆయనపై దాడి కాదు, రాజ్యాంగం, జుడీషియలీ, డెమోక్రసీ, దళితుల ఆత్మాభిమానంపై చేసిన దాడని కొరివి వేణుగోపాల్ అభివర్ణించారు. దళిత జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన దీక్ష నిర్వహించిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసు తీర్పు తర్వాత 20 రోజుల పాటు కుట్ర పన్ని ఈ దాడి జరిగిందని ఆరోపించారు. మరో నెల రోజుల్లో జస్టిస్ గవాయి పదవీవిరమణ పొందుతున్నందున, ఆయన ఏతప్పుడూ లేకపోయినట్టు చూపించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. రాజ్యాంగ వ్యతిరేక శక్తుల ఈ బావజాలాన్ని దళిత వర్గాలు, ప్రజాస్వామికవాదులు, బడుగు బలహీన వర్గాలు అర్థం చేసుకుని తిప్పికొట్టాలని, అధర్మం నశించి రాజ్యాంగం వృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షలో జేఏసీ నాయకులు నల్లాల కనకరాజు, బోయినిపల్లి చంద్రయ్య, కడపల విజయ్‌కుమార్, మరె రాజేందర్, గొర్రె రాజయ్య, సుతారి లచ్చన్న, గండి రాజేశ్వర్, ఉరుమల్ల విశ్వం, బాబుల్ వర్మ, సొల్లు బాబు, శుక్రుద్దీన్, గంటల రేణుక, మార్వాడి సుదర్శన్, మేడి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్టియానో రోనాల్డోకు 41 గోల్స్ మైలురాయి

**లిస్‌బన్, :** లెజెండ్ క్రిస్టియానో రోనాల్డో మరో సారి చరిత్ర సృష్టించాడు. వరల్డ్‌కప్ 2026 క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లలో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా 40 ఏళ్ల వయసులో నిలిచాడు. పోర్చుగల్ తరపున ఆడుతూ ఇప్పటివరకు 50 మ్యాచ్‌లలో 41 గోల్స్ సాధించి, గ్వాటమాలా మాజీ స్ట్రైకర్ కార్లోస్ రూయిజ్ 39 గోల్స్ రికార్డును బ్రేక్ చేశాడు. లిస్‌బన్‌లోని ఎస్టాడియో జోష్ అల్వాలేడ్ స్టేడియంలో హంగేరీతో జరిగిన క్వాలిఫైయర్ మ్యాచ్‌లో రోనాల్డో బ్రేస్ (రెండు గోల్స్) చేశాడు. మ్యాచ్ 2-2 డ్రాగా ముగిసినప్పటికీ, అతని మొదటి గోల్ (22వ నిమిషం)తో 40 మైలురాయి దాటి, రెండోది (ఫస్ట్ హాఫ్ స్టాపేజ్ టైమ్)తో 41వ గోల్ సాధించాడు.





# మన చేతుల్లోనే ... మన ఆరోగ్యం

## ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనం సాక్షి) :** ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చేతులు అపరిశుభ్రంగా ఉండటంతో అతిసార శ్వాస కోసం వ్యాధులతో ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా అనేకమంది పిల్లలు చనిపోతున్నార న్నారు. 2008 లో ఐక్యరాజ్యసమితి అక్టోబర్ 15న ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవంగా ప్రకటించిందన్నారు.మన చేతులకు ఎన్నో బ్యాక్టీరియాలు, వైరస్ లకు నిలయంగా మారాయని,మనం నిత్యం ఏదో ఒక పని చేస్తూ రకరకాల వస్తువులను తాకుతుంటామని, వాటితో పలు రకాల బ్యాక్టీరియాలు,వైరస్లు చేతివేళ్లు, ముంజేతులు,గోళ్ళలోకి, చేరుకుంటాయన్నారు. ఆహారం తీసుకునే ముందు,మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత సబ్బుతో గాని లోషన్ తో గాని చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. శుభ్రపరచుకున్న చేతులతో ఆహారం తీసుకుంటే కడుపులో ఎలాంటి క్రిములు చేరవని, ఆరోగ్యంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతోందని,పిల్లలకు శుభ్రత అనేది బాల్యం నుండి అలవాటు అవుతుందన్నారు. మన చేతిలో మన కంటికి కనిపించని సూక్ష్మక్రిములు ఉంటాయని,చేతుల పరిశుభ్రత ఉద్దేశం మట్టి,సూక్ష్మజీవులు ,బ్యాక్టీరియాలనుతొలగించడమే నని, తుమ్మినా,దగ్గినా వెంటనే చేతులు కడుకోవాలని పిల్లలకు ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి ముందు విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై తెలియజేయాలని ,అందరం చేతులను శుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా జీవించడంతో పాటు రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మారుద్దామన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ ,దాసరి సుజాత,అంగన్వాడి టీచర్ లిక్కిడి మంజుల,విద్యార్థులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సులు బంద్ చేయకండి సారూ



**మక్తల్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని మైక్ పట్టుకొని చెప్పే ప్రజా ప్రతినిధులు, అధికారులు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్కూల్ పిల్లల బస్సులు బంద్ చేసి రాజకీయ నాయకుల మీటింగులకు, ముఖ్యమంత్రి సభలకు బస్సులు పంపడం వలన స్కూల్ పిల్లలతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ కొత్త సాంప్రదాయ ప్రారంభిస్తే, కొత్తగా వచ్చిన రేవంత్ రెడ్డి ఈ సాంప్రదాయానికి ముగింపు పలికి విద్యార్థులకు న్యాయం చేస్తాడు అనుకుంటే వారు కూడా అదే మార్గం పాటిస్తూ విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు. పండుగలు, జాతర్లు, రాజకీయ నాయకుల మీటింగులు వస్తె చాలు బస్సులు బందు అవుతున్నాయని తెలిపారు. రేపు కర్నూలు లో ప్రధానమంత్రి మీటింగుకు ఈ రోజు మధ్యాహ్నం బస్సులు పంపాలని బస్సులు బంద్ చేయడం వలన బిజ్వార్, అవుసలోని పల్లి, పెద్దజట్రం స్కూల్ పిల్లాలు 9 కిమీ నడుచుకుంటూ వెళ్లి పెద్దజట్రం గేట్ దగ్గర ఎంతో ఎదురుచూసిన బస్సులు రాలేదు అని తెలిపారు. నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు ప్రైవేట్ వాహనాలు ఆపే క్రమంలో ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకొని పోయి స్కూల్ పిల్లల బస్సులు బంద్ చేయకుండా చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.

# పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు

## ఏడాదికి రెండు సార్లు టీకా కార్యక్రమం : ఏడిఏ నోవా



**కొడంగల్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** పశువుల ఆరోగ్యం, రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం లక్ష్యంగా తెలంగాణ పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ, కేంద్ర ప్రభుత్వ సహాయంతో జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం ద్వారా ప్రతి ఏడాది రెండుసార్లు గాలికుంటు వ్యాధి నిరోధక ఉచిత టీకాలు నిర్వహిస్తుందని కొడంగల్ ఏడిఏ నోవా తెలిపారు. గాలికుంటు వ్యాధి పికార్నో వైరస్ వల్ల సంక్రమించే తీవ్రమైన అంటువ్యాధి. ముఖ్యంగా సంకరజాతి పశువుల్లో తీవ్రత ఎక్కువగా ఉండి, పాల ఉత్పత్తి, వ్యవసాయ పనుల సామర్థ్యం, పునరుత్పత్తి శక్తిని దెబ్బతీస్తుంది. మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వ్యాధి ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వ్యాధి లక్షణాలుగా శరీర ఉష్ణోగ్రత 104°F-106°F వరకు పెరగడం, నోటి, గిట్టల్లో పుండ్లు ఏర్పడటం, మేత, నీరు తీసుకోవడంలో ఇబ్బంది, పాల దిగుబడి తగ్గిపోవడం, వ్యవసాయ పనులకు పనికిరాని స్థితి, దూడలు మరణించే ప్రమాదం ఉన్నాయి. నివారణకు పశువుల వాసస్థలాలను శుభ్రంగా ఉంచాలి. నాలుగు నెలల వయస్సు దాటిన పశువులకు ఆరు నెలలకొకసారి టీకా వేయించాలి. లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే సమీప పశువైద్యుడిని సంప్రదించాలి. ఈ సంవత్సరం కూడా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మూడు నెలల వయస్సు దాటిన గేదెజాతి, గోజాతి పశువులకు ఉచిత టీకాలు వేస్తారు. పశువులకు చెవిపోగు వేసి వివరాలను భారత్ పశుధన ఆప్‌లో నమోదు చేస్తారు. రైతులందరూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, తమ పశువులకు టీకాలు వేయించి, తెలంగాణను గాలికుంటు వ్యాధి రహిత రాష్ట్రంగా మార్చేందుకు సహకరించాలని ఏడిఏ నోవా పిలుపునిచ్చారు.

# విద్యార్థిని ప్రియాంక మృతిపై సమగ్ర విచారణ జరిపించి కుటుంబానికి న్యాయం చేయాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ ఎస్పీని కలిసిన గద్వాల ఎమ్మెల్యే

**మల్దకల్ అక్టోబర్ 15 (జనంసాక్షి) :** మండల కేంద్రానికి చెందిన ఉప్పరి నాగేష్, పదమ్మ దంపతుల కుమార్తె విద్యార్థి ప్రియాంక మహబూబ్‌నగర్ మండలంలోని రామ్‌రెడ్డి గూడెం గురుకుల ఇంటర్మీడియట్ చదువుతున్న మూడు రోజుల కిందట ఆత్మహత్య చేసుకోవడం జరిగింది.తమకు న్యాయం చెయాలని విద్యార్థిని తల్లి దండ్రులు ఎమ్మెల్యే కి విన్నవించగా బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్, ఎస్పీనిగద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి విద్యార్థిని ప్రియాంక మృతి పట్ల పూర్తి సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్దకల్ ఉప్పరి నాగేష్ పదమ్మ దంపతులు కుమార్తె ప్రియాంక మృతి చెందడం చాలా బాధాకరం,చిన్న వయసులోనే అమ్మాయి మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల కడుపు కోత బాధ తీర్చలేనిదని, మృతికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎస్పీనీ కోరారు.విద్యార్థిని మృతిపై వచ్చిన ఆరోపణల్లో వెంటనే ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలించి భవిష్యత్తులో మళ్లీ పునరావత్తం కాకుండా ఆ కుటుంబానికి న్యాయం చేసే విధంగా సహకరించాలని అధికారులను కోరారు. విద్యార్థిని కుటుంబ సభ్యుల కు ఎమ్మెల్యే అన్ని విధాలుగా అండగా ఉంటానని నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసాను ఇచ్చారు.ఎమ్మెల్యే వెంటనే మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న నాయకులు అజమ్, వెంకటన్న, నరేందర్, మధు, తిమ్మరాజు పాల్గొన్నారు.



## "అక్టోబర్ 20 నుండి 31 వరకు"

# పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనంసాక్షి):**

తెలంగాణ రాష్ట్ర డి.జి.పి ఆదేశాల మేరకు, విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను, త్యాగాలను స్మరించుకుంటూ ఈ నెల 20 నుండి 31 వరకు 'పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు' ఘనంగా నిర్వహించనున్నట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. గతంలో పనిచేసిన కొంతమంది పోలీస్ అధికారులు, సిబ్బంది తమ అమూల్యమైన ప్రాణాలను విధి నిర్వహణలో భాగంగా త్యాగం చేయడం జరిగిందని, వారి త్యాగం వలనే నేడు శాంతియుత వాతవరణం నెలకొని ప్రజలు శాంతియుతంగా జీవిస్తున్నారని కమీషనర్ పేర్కొన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకోవడంలో భాగంగా, ఈ పన్నెండు రోజుల పాటు కరీంనగర్ కమీషనరేటులోని పోలీసు హెడ్ క్వార్టర్స్ తో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీసు కమీషనర్ తెలిపారు. ప్రజలందరూ ఈ సంస్మరణ వారోత్సవాలలో పాల్గొని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ జీవితాలను అంకితం చేసిన అమరవీరులకు నివాళులర్పించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

**పోలీసు సంస్మరణ వారోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలు.**

అక్టోబర్ 20న, బహిరంగ ప్రదేశాల్లో అమరవీరుల పోస్టర్ల ప్రదర్శన, అక్టోబర్ 21న, అమరవీరుల దినోత్సవ కవాతు, వారి కుటుంబాలను సత్కరించడం, బహుమతుల ప్రదానం. అక్టోబర్ 22న, పోలీసు ప్రధాన కార్యాలయంలో రెండు విభాగాలలో అస్త్ర సమావేశంలో ఆఫ్‌లైన్‌లో పోలీసు అధికారులకు వ్యాస రచన పోటీ విద్యార్థులు, ప్రజలకు వ్యాస రచన పోటీ, షార్ట్ ఫిల్మ్‌లు , ఫోటోగ్రఫీ పోటీ కోసం ఆన్‌లైన్ లింక్‌ను ప్రారంభించారు. అక్టోబర్ 23న, పోలీసు ప్రధాన కార్యాలయంలో విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమం, ఆయుధాల ప్రదర్శన, షీ టీమ్ అవగాహన, ట్రాఫిక్ నియమాలపై అవగాహన, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన.

**అక్టోబర్ 24న, మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ**

అక్టోబర్ 25న, ప్రజలను కలుపుకుని పోలీసులు నిర్వహించిన సైకిల్ ర్యాలీ. అక్టోబర్ 26న, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను కలవడం, వారి సంక్షేమం గురించి తెలుసుకోవడం, పోలీసు అమరవీరుల విగ్రహాలకు నివాళులు అర్పించడం.

అక్టోబర్ 27న, హుజురాబాద్ డివిజన్ పోలీసులచే విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమం. ఆయుధాల ప్రదర్శన, షీ టీమ్ అవగాహన, ట్రాఫిక్ నియమాలపై అవగాహన, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన, విద్యార్థుల కోసం పోలీస్ స్టేషన్లను సందర్శించడం, కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆన్‌లైన్ ఓపెన్ హౌస్ కార్యక్రమం. అక్టోబర్ 28న, పోలీసు అమరవీరుల త్యాగాలు, ప్రస్తుత పరిస్థితిపై ప్రజలకు అవగాహన కార్యక్ర మాలు, వ్యాస రచన పోటీ, షార్ట్ ఫిల్మ్‌లు, ఫోటోగ్రఫీ పోటీల కోసం విద్యార్థు లు, ప్రజలకు ఆన్‌లైన్ లింక్ ద్వారా వ్యాస రచన ముగింపు. అక్టోబర్ 29న, పోలీసు ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించబడుతుంది. అక్టోబర్ 30న, ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన మొదటి ముగ్గురు విజేతలకు (వ్యాస పోటీ, షార్ట్ ఫిల్మ్, పోలీసులకు సంబంధించిన ఫోటోలు) బహుమతి పంపిణీ కార్యక్రమం. అక్టోబర్ 31న పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థం కొవ్వొత్తుల ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించబడునని సీపీ తెలిపారు.

# సింధూర్ ఎంక్లేవ్ సమస్యలు పరిష్కరిస్తాం

- ట్రాఫిక్, డ్రైనేజీ సమస్యలపై చర్యలు
- పోలీసులతో మాట్లాడి పార్కింగ్‌ను నియంత్రిస్తాం
- మెట్రో ఫ్లైఓవర్‌తో రద్దీ తగ్గుతుంది : మధుయాష్కి గౌడ్
- పార్కు అభివృద్ధికి అధికారుల సూచన



**ఎల్బీనగర్, అక్టోబర్ 15 (జనంసాక్షి):**

ఎల్బీనగర్‌లోని సింధూర్ ఎంక్లేవ్ అపార్ట్‌మెంట్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరిస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ హామీ ఇచ్చారు. యువేరా అపార్ట్‌మెంట్‌లో కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వాసులు ట్రాఫిక్ రద్దీ, ప్రైవేట్ టాక్సీ డ్రైవర్ల అడ్డగోలు పార్కింగ్, దాడులు, పార్కు అభివృద్ధి, డ్రైనేజీ సమస్యలను వివరించారు.

మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ, ప్రధాన జాతీయ రహదారి నుంచి సింధూర్ ఎంక్లేవ్‌కు నేరుగా రోడ్డు కనెక్టివిటీకి ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం చూపిస్తామని చెప్పారు. సర్వీస్ రోడ్డులో అడ్డగోలు పార్కింగ్‌కు పోలీసులతో మాట్లాడుతానని, టాక్సీ డ్రైవర్ల దాడులు, కార్లలో మద్యం సేవ జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రోజు నలుగురు కానిస్టేబుల్స్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ట్రాఫిక్ డీసీపీతో ఫోన్‌లో మాట్లాడి రోడ్డు కనెక్టివిటీ, రద్దీ పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.


ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి, ల్యాండ్ ఆర్డర్ ఎస్ఐతో మాట్లాడి టాక్సీ డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి వాసులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. డ్రైనేజీని కలిపే విషయం కోర్టు పరిధిలో ఉండటంతో స్టే రద్దు చేయించాలని, కాలనీ వెనుక ఖాళీ స్థలంలో పార్కు అభివృద్ధి చేపట్టాలని అధికారులతో మాట్లాడతానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎల్బీనగర్‌లో 200 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, గతంలో నగర నిధులన్నీ కలేశ్వరానికి తరలించారని విమర్శించారు.

మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ నుంచి ఆందోల్ మైసమ్మ వరకు 650 కోట్లతో మెట్రో కామ్ ఫ్లైఓవర్, రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని చెప్పారు. సింధూర్ అపార్ట్‌మెంట్‌కు రోడ్డు కనెక్టివిటీకి జోనల్ కమిషనర్, ట్రాఫిక్ అధికారులతో ఇప్పటికే మాట్లాడామని, మిగిలిన సమస్యలు త్వర పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, మనసురాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ, నాయకులు భీమిడి రామకృష్ణారెడ్డి, అపార్ట్‌మెంట్ వాసులు నర్సిరెడ్డి, రాజేందర్ రెడ్డి, జానకి రామ్ రెడ్డి, రాజు, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
16 అక్టోబర్ 2025


# హ్యామ్ ప్రాజెక్టుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

- హ్యామ్‌తో పూర్తిగా మారనున్న గ్రామీణ రహదారుల రూపురేఖలు
- మొదటి దశలో 7,449 కి.మీ రహదారుల నిర్మాణం
- శుక్రవారం టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క



**హైదరాబాద్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** హైబ్రిడ్ యాన్యుయిటీ మోడ్ (హ్యామ్) ప్రాజెక్టు అమలుతో గ్రామీణ రహదారి సదుపాయాలు మరింత బలోపేతం అవుతాయని, దాంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఈ హ్యామ్ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి కోసం చేపట్టిన అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమం అని ఆమె పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా గ్రామీణ రహదారుల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, రవాణా సౌకర్యాలు విస్తృతంగా మెరుగుపడతాయని తెలిపారు. హ్యామ్ ప్రాజెక్టుల కోసం టెండర్ నోటిఫికేషన్ ఈ శుక్రవారం విడుదల కానుందని, టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఫేజ్-1లో 17 ప్యాకేజీల కింద, 96 నియోజకవర్గాల పరిధిలో మొత్తం 2,162 రహదారులు (7,449.50 కిలోమీటర్ల పొడవుతో) నిర్మించనున్నామని తెలిపారు. హ్యామ్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ గ్రామీణ రహదారులు కొత్త దశలోకి ప్రవేశిస్తాయని, జాతీయ, అంతర్జాతీయ రహదారి నిర్మాణ సంస్థలు ఈ ప్రాజెక్టు టెండర్లలో పాల్గొనాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీ నుండి మండల కేంద్రం, మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రం, జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర కేంద్రం వరకు రహదారి కనెక్టివిటీని పెంచేందుకు హైబ్రిడ్ యాన్యుయిటీ మోడ్ (హెచ్ఏఎం) పద్ధతిలో నిర్మాణం, అప్‌గ్రేడేషన్, నిర్వహణ చేపట్టేందుకు సంకల్పించిందని, ఈ విధానంలో లో ప్రాజెక్ట్ వ్యయానికి 40% ప్రభుత్వమే నిర్మాణ దశలో చెల్లిస్తుంది, మిగిలిన 60% మొత్తాన్ని కాంట్రాక్టర్లు బ్యాంకుల ద్వారా సమీకరిస్తారని, రహదారుల నిర్మాణం పూర్తయిన తర్వాత 15 సంవత్సరాల పాటు నిర్వహణ బాధ్యత కూడా కాంట్రాక్టర్లదే అవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టును మూడు దశల్లో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఫేజ్-1 కోసం టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ స్టడీని పూర్తి చేశారని, ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు, ఎంపీల ప్రతిపాదనలకు అనుగుణంగా ప్రతిపాదిత పనులను పంచాయతీ రాజ్ ఇంజనీర్లు ఎంపిక చేశారు. కేబినెట్ ఇప్పటికే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ (పీఆర్ఈడీ) ప్రతిపాదనలు ఆమోదించిందని, ప్రభుత్వం 17 ప్యాకేజీలుగా పీఆర్ ఇంజనీరింగ్ డిపార్టమెంటు సర్కిళ్ల వారీగా పరిపాలనా అనుమతి మంజూరు చేసిందని తెలిపారు. ప్రాజెక్ట్ మొత్తం అంచనా వ్యయం రూ. 6,294.81 కోట్లుగా ఉందని, దీనికి సంబంధించి ఆర్థిక అనుమతి మంజూరైందని, దీంతో ఫేజ్-1 హ్యామ్ రోడ్ల టెండర్ల ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చిందని తెలిపారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు 17 ప్యాకేజీలకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ఈ శుక్రవారం నుంచే ప్రారంభించేందుకు పంచాయతీరాజ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ జోగారెడ్డి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అదే రోజున పేపర్ నోటీసు ద్వారా టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి టెండర్ ప్రక్రియ పూర్తైన వెంటనే పనులు ప్రారంభమయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ కంచుకోట ఉమ్మడి నల్లగొండ జిల్లా

- భవిష్యత్‌లోనూ అద్భుతమైన విజయాలు సాధించాలి
- నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పిస్తాం
- ఈ నెల 25న ఐటీ, ఫార్మా మెగా జాబ్ మేళా
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి




**కోదాడ (జనంసాక్షి) :** ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు సూర్యాపేట కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.గడిచిన లోకసభ ఎన్నికలలో సాధించిన ఫలితాలే ఇందుకు అద్దం పడుతున్నాయన్నారు.యావత్ భారత దేశంలోనే లోకసభ ఎన్నికల్లో సూర్యాపేట జిల్లా సంచలన రికార్డులు నమోదు చేసుకుందని ఆయన చెప్పారు. హుజునగర్ నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజారిటీ సాధించగా కోదాడలో 97 వేలు, సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గాలలో 70 వేల మెజారిటీ సాధించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగతన్ సృజన్ అభియాన్ సదస్సుతో పాటు నూతన డిసిసి ఎంపిక కోసం హుజుర్‌నగర్, కోదాడ నియోజక వర్గాల ముఖ్యకార్యకర్తల సమావేశం బుధవారం రోజున కోదాడ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించారు. ఏఐసిసి పరిశీలకుడు సారత్ రౌత్, శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ, డి.సి.సి ప్రెసిడెంట్ చెవిటివెంకన్న యాదవ్,డి.సి.సి డెలిగేట్లు సి.హెచ్ లక్ష్మీనారయణ రెడ్డి, దొంగరి వెంజటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు వంగవీటి రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సభకు ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ లోనూ కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన ఫలితాలు సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తల అకుంఠిత దీక్ష, శ్రమ ఈ విజయాల వెనుక ఉన్నాయన్నారు.సమజానికి నిరుద్యోగ సమస్య పెను సవాల్‌గా మారిందన్నారు. అటువంటి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 25 న హుజుర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో మేఘా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సుమారు 150 కంపెనీలు పాల్గొనే ఈ మేఘా జాబ్‌మేళాలో కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం భాగస్వా మ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఉద్బోధించారు. ఐటి,ఫార్మా వంటి పరిశ్రమలతో పాటు వివిధ పరిశ్రమలు మేఘా జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ నియామకాలు చేపడుతాయన్నారు.సింగరేణి కాలరీస్ ,డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణా సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ మేఘా జాబ్ మేళలో పాల్గొనే వారందరికీ వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏఐసిసి పరిశీలకుడు సారత్ రౌత్ మట్లాడుతూ దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా ఈ తరహా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేసే వరకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నియమకాలు కోసం అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, పి.సి.సి ప్రతినిధులు లక్ష్మీ నారాయణ రెడ్డి,దొంగరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ ఆత్మహత్యకు కారణమైన

# డీజీపీ, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోండి

- ప్రధానమంత్రికి లేఖ రాసిన నాగర్ కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి
- పూరన్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని వెల్లడి



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన డీజీపీ, ఇతర పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని.. నాగర్ కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి ప్రధాని మోదీకి లేఖ రాశారు. పూరన్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయంలో లేఖను అందజేసిన అనంతరం.. ఎంపీ మల్లు రవి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేఖరులతో మాట్లాడారు. 'హర్యానాలో తెలంగాణకు చెందిన దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ, ఐఐఎంలలో చదివి.. అతి చిన్న వయస్సులోనే సివిల్స్ రాసి ఐపీఎస్ అధికారి అయ్యారు. రాష్ట్రపతి అవార్డు కూడా తీసుకున్నారు. ఆయన పైఅధికారుల ఒత్తిడి కారణంగా అతను ఆత్మహత్య చేసుకున్నారు. ఇది చాలా దురదృష్టకరం. అతని సూసైడ్‌కు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీని కోరాం. అలాగే.. మరోచోట ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని అన్ని రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీలకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం' అని మల్లు రవి వివరించారు. 'ఆత్మహత్య చేసుకొని వారం గడుస్తున్నా.. ఇంకా పోస్టుమార్టం జరగలేదు. ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు కారణమైన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని అతని భార్య, కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. డీజీపీని సస్పెండ్ చేయాలని కోరుతున్నారు. వీలైనంత త్వరగా హోంమంత్రి వారి డిమాండ్లను అమలు చేయాలి. షెడ్యూల్ క్యాస్ట్ పార్లమెంట్ మెంబర్‌గా నేను కూడా డిమాండ్ చేస్తున్నా. దీనికి సంబంధించిన లెటర్‌ను కూడా ప్రధాని కార్యాలయంలో అందజేశాం' అని ఎంపీ చెప్పారు. 'ఆత్మహత్యకు పాల్పడ్డ ఐపీఎస్ అధికారి కుటుంబ సభ్యులకు కూడా లేఖ రాశాం. అధైర్యపడొద్దని భరోసా ఇచ్చాం. దేశంలోని దళితులందరూ మద్దతుగా నిలుస్తారని లేఖలో ధైర్యాన్నిచ్చాం. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కమిటీ మీటింగ్‌లో నేను సభ్యుడిగా ఉన్నాను. ఇవాళ కమిటీ సమావేశం జరగనుంది. ఐపీఎస్ అధికారి సూసైడ్ ఘటనను కమిటీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్తా. బాధ్యులైన డీజీపీ, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరతా. అంతేకాకుండా నేషనల్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు కూడా దీని గురించి వివరిస్తా. ప్రధానికి రాసిన లేఖను అందజేస్తా. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరతా. జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఈ లేఖలను పంపిస్తా. అంతేకాకుండా.. అన్ని రాష్ట్రాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ ఎంపీలను కలుస్తా. అందరం కలిసి ప్రధాని, హోంమంత్రిని కలిసి చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేయాలని వారికి తెలియజేస్తాం. అవసరమైతే వారి అందరితో కలిసి చండీఘర్ వెళ్తాం. వారి కుటుంబానికి అండగా నిలుస్తాం.' అని స్పష్టం చేశారు. 'రెండు రాష్ట్రాలను కలుపుతున్న బ్రిడ్జ్ కోసం కూడా అడిగాం. ఆ బ్రిడ్జ్ అచ్చంపేట సమీపంలోని మద్దిమడుగు నుంచి మాచర్లను కలుపుతుంది. దీన్ని కృష్ణా నదిపై నిర్మించాల్సి ఉంది. ఇంటర్ స్టేట్ కనెక్టివిటీ స్కీమ్ కింద ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి లేఖ రాసి పంపించారు. ఈ రెండు లేఖలను ప్రధానమంత్రి కార్యాలయంలో అందజేశాం' అని ఎంపీ డా.మల్లు రవి వెల్లడించారు.

# భమ్మృక్కుద్దౌలా చెరువు ప్రారంభోత్సవానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** పాతబస్తీలోని భమ్మృక్కుద్దౌలా చెరువు ప్రారంభోత్సవానికి, అక్కడ జరుగుతున్న చెరువు పునరుద్ధరణ పనులకు హై కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో తమ స్థలాలు ఉన్నాయని చెరువు అభివృద్ధి పనులు ఆపాలని అక్కడి వారు కోర్టును ఆశ్రయించగా బుధవారం హై కోర్టు ఈ తీర్పు చెప్పింది. చెరువు పునరుద్ధరణ, బ్యూటిఫికేషన్ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని ఈ దశలో ఆ పనులు ఆపలేమని హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్ రెడ్డి తీర్పు చెప్పారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో యింటి స్థలాలు ఉంటే టీడీఆర్ ద్వారా నష్ట పరిహారానికి ప్రయత్నించాలని జస్టిస్ విజయసేన్ రెడ్డి గారు సూచించారు. హైడ్రా తరపున అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ ఈ కేసును వాదించారు. ఈ చెరువుకు ఎంతో చారిత్రక నేపథ్యం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ చెరువు పనులు 90 శాతం అయి.. చెరువులో నీరు వున్న ఫోటోలను కోర్టుకు సమర్పించారు. పాతబస్తీలో చెరువు ఆవశ్యకతను ఇమ్రాన్ ఖాన్ గారు వివరిచారు. వీటన్నిటినీ పరిశీలించాక.. చెరువుల పునరుద్ధరణను ఆహ్వానించదగ్గది అని జస్టిస్ విజయసేన్ రెడ్డి గారు వ్యాఖ్యానించారు. నగరంలో ఎన్నిచెరువులు అభివృద్ధి చేస్తున్నారని వివరాలు తెలుసుకున్నారు. చెరువుల అభివృద్ధిలో హైడ్రా చర్యలను అభినందించారు.

# దుశ్శాసనులను మించిన మంత్రులు

- మహిళలను అవమానించడం సరికాదు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**హైదరాబాద్, అక్టోబర్15 (జనంసాక్షి) :** భర్తను కోల్పోయి బాధలో మాగంటి సునీత కన్నీళ్లు పెడితే డ్రామా, సీరియల్ అంటూ అవమానిస్తున్న కాంగ్రెస్ మంత్రుల తీరు దుశ్శాసనుడిని మించిపోయిందని బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎట్లయినా గెలవాలని మహిళలను అవమానించేలా ఘోరమైన సంస్కృతికి తెరలేపింది కాంగ్రెస్ అని ఆయన మండిపడ్డారు. ఇందిరా గాంధీ చనిపోతే చాలామంది కన్నీళ్లు పెట్టుకున్నారు మీ దృష్టిలో అది కూడా సీరియల్, డ్రామానేనా? అని ఆర్ఎస్పీ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ అన్న మాటలు చూస్తే.. ఇలాంటి మంత్రి కూడా కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా అని అనిపిస్తుంది. మాగంటి సునీత కన్నీళ్లు పెడితే డ్రామాలు చేయడం అందరికీ వచ్చు.. ఇది సినిమా కాదు సీరియల్ కాదు అనడం సరికాదు. రాజీవ్ గాంధీ, ఇందిరాగాంధీ, వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయినప్పుడు చాలా మంది కన్నీళ్లు పెట్టారు.. అది కూడా డ్రామాలేనా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. మాగంటి సునీత జామా మసీదు ఎదుట రోడ్డు మీద నిలబడి కాంగ్రెస్ బాకీ కార్డులు పంచితే కేసు నమోదు చేశారు. ఆమె మసీదులోకి వెళ్లలేదు, రోడ్డు మీద నిలబడి ప్రచారం చేయడం ఏ రకంగా నేరం అవుతుంది. డిప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు చేయగానే వెంటనే మాగంటి సునీత మీద, ఆమె కూతురు చిన్న అమ్మాయి అక్షర మీద కేసు నమోదు చేశారు. అలానే ఇతరులు అని మెన్షన్ చేశారు.. ఎందుకంటే ఇంకెవరైనా బీఆర్ఎస్ నాయకులు ప్రచారంలో తిరిగితే వారిపై కూడా కేసులు నమోదు చేసి జైళ్లలో వేయాలని చూస్తున్నారు అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. మాగంటి సునీత కన్నీళ్లు పెడితే అది ఒక డ్రామా, సీరియల్ అని అన్న పొన్నం ప్రభాకర్‌కు మహిళా కమిషన్ ఛైర్మెన్ నేరెళ్ల శారద నోటీసులు ఇచ్చారా? కేటీఆర్ మహిళలు బస్సులో ప్రయాణిస్తుంటే చేయని కామెంట్‌కు ఆయనకు నోటీసులు ఇచ్చి మహిళా కమిషన్‌కు వచ్చేదాకా పట్టుబట్టారు కదా.. ఇప్పుడు పొన్నం ప్రభాకర్‌కు నోటీసులు ఇవ్వరా? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త

- ఎలాంటి లింకులను ఓపెన్ చేయొద్దని పోలీసుల సూచన




**హైదరాబాద్, అక్టోబర్15 (జనంసాక్షి) :** ఆన్‌లైన్ మోసాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. దీపావళితో పాటు రాబోయే పండుగల సందర్భంగా ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసే వాళ్లు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఫేక్ ఈ కామర్స్ వెబ్‌సైట్లు, మాల్వేర్, ఫిషింగ్ లింకులు, సోషల్ మీడియా ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఫెస్టివల్ డిస్కౌంట్ల పేరుతో బ్యాంక్ వివరాలు, క్రెడిట్ కార్డ్ సమాచారంతో మోసాలకు సైబర్ కేటుగాళ్లు పాల్పడుతున్నారని తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ ద్వారా ఫేక్ షాపింగ్ లింక్‌లపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. నమ్మకమైన ఈ కామర్స్ వెబ్‌సైట్లలో మాత్రమే షాపింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని ఖాతాలకు 2-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ ఆప్షన్ ఏర్పాటు చేసుకోవాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.



# బీసీ నినాదాలతో రాస్తారోకో

**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 15 (జనం సాక్షి):** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావి సెంటర్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు కడారి సురేష్ యాదవ్, మండల అధ్యక్షుడు పొన్నాల మహిపాల్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ నర్సంపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బుధవారం ధర్నా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, నర్సంపేట నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ జేఏసీ చైర్మన్ ద్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ దుగ్గొండి మండలంలోని బీసీ సంఘాల నాయకులు, బీసీ కుల సంఘాలతో బీసీ సంఘాల నాయకులు, బీసీ కుల సంఘాలతో వరంగల్ నర్సంపేట ప్రధాన రహదారిపై దాదాపు గంటపాటు జరిగిన ధర్నా రాస్తారోకో లో బీసీ నినాదాలతో ఇరువైపులా కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. బీసీల రిజర్వేషన్లను అగ్రవర్ణ కులాలకు చెందిన దుర్మార్గులు హైకోర్టు లో పిటిషన్ వేసి బీసీలకు రావలసిన 42 శాతం రిజర్వేషన్లు అడ్డుకున్నారని హైకోర్టులో స్టే వచ్చే విధంగా చేసిన అగ్రవర్ణాల కుట్రలను తెలంగాణ బీసీ సమాజం తిప్పి కొట్టే విధంగా రాస్తారోకో ధర్నాలతో మన రిజర్వేషన్‌లను సాధించుకునే వరకు పోరాటాలు చేయాలని అన్నారు. ఇప్పటికైనా బీసీ కులాలకు చెందిన వారు ఏకమై ఈనెల 18న బిసి జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన తెలంగాణ బంద్ ను విజయవంతం చేయాలని కోరారు. వరంగల్ జిల్లాతోపాటు నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, జిల్లా కార్యదర్శి కానుగుల కుమారస్వామి, జిల్లా నాయ కులు కోరే రాజేష్ కురుమ, ద్యాగం శివాజీ, మండల అధ్యక్షుడు పొన్నాల మహిపాల్, మండల కార్యదర్శి మొకిడే శ్రీకాంత్, మండల యూత్ అధ్యక్షులు బండారి ఉదయ్ కిరణ్, మహ్మదా పురం గ్రామాధ్యక్షుడు నన్నరాజు, మండల నాయకులు బండారి ప్రకాష్, ముత్యాల స్వామి, ముదిరాజ్ బండారి రమేష్, కోంట్రోజు చంద్రమౌళి, మెరుగు కట్టమల్లు తదితరులు పాల్గొన్నారు.

# అలనాటి గాయని రావు బాలసరస్వతి దేవి అస్తమయం

- అనేక చిత్రాల్లో పాటలు పాడిన ఘనత ఆమెది



**హైదరాబాద్, అక్టోబర్15 (జనంసాక్షి) :** అలనాటి గాయని రావు బాలసరస్వతి దేవి (97) అనారోగ్యంతో హైదరాబాద్ మణికొండలోని స్వగృహంలో బుధవారం ఉదయం 8 గంటలకు తుదిశ్వాస విడిచారు. 1928 ఆగస్ట్ 29న జన్మించిన రావు బాలసరస్వతి గొంతు ఆకాశవాణి సంగీత కార్యక్రమాలతో తెలుగు వారికి సుపరిచితం. ఆకాశవాణి కార్యక్రమంతో తెలుగు వారికి పరిచయమయ్యారు. 'సతీ అనసూయ' చిత్రంలో తొలి పాటను ఆలపించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీతో పాటు పలు భాషల్లో 2000కు పైగా పాటలు పాడారు. బాల సరస్వతి అసలు పేరు సరస్వతిదేవి. చిన్నప్పటి నుంచే పాటలు పాడడంతో అందరూ ఆమెను బాలసరస్వతి అని పిలిచారు. దీంతో ఆమెకు బాలసరస్వతిగా గుర్తింపు వచ్చింది. 'సతీఅనసూయ ధ్రువవిజయం' అనే చిన్నపిల్లలు నటించిన సినిమాలో గంగ పాత్రలో బాల సరస్వతి కనిపించారు. తల్లిదండ్రులకు ఇష్టం లేకపోవడంతో పాటు నటనపై ఆసక్తి లేకపోవడంతో ఆ తర్వాత అవకాశాలు వదులుకున్నారు.

# తమిళనాడులో బాంబు బెదిరింపులు

- కాన్సులేట్లకు బెదిరింపులతో తనిఖీలు



**చెన్నై, అక్టోబర్15 (జనంసాక్షి) :** తమిళనాడులో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. గత కొన్నాళ్లుగా ప్రముఖుల ఇళ్లు, ప్రధాన కార్యాలయాలకు బాంబు బెదిరింపులు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా చెన్నైలోని పలు విదేశీ రాయబార కార్యాలయాలతో పాటు ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా స్టూడియోకు ఈ తరహా బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. చెన్నై లోని అమెరికా, రష్యా, ఇంగ్లాండ్, థాయిలాండ్, శ్రీలంక, సింగపూర్ కార్యాలయాలకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ మెయిల్స్ వచ్చాయి. బాంబు పేలుళ్లు జరగనున్నట్లు ఆ సందేశాల సారాంశం. దీంతో పోలీసులు ఆయా కార్యాలయాల వద్ద ముమ్మరంగా సోదాలు చేపట్టారు. టి.నగర్‌లోని ఇళయరాజా స్టూడియోకు మంగళవారం బాంబు బెదిరింపు వచ్చింది. డీజీపీ ఆఫీసుతో పాటు ఇళయరాజాకు మెయిల్ ద్వారా ఈ బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే బాంబ్ స్క్వాడ్‌తో స్టూడియోకు చేరుకొని తనిఖీలు చేపట్టారు. అయితే, అక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. దీంతో దాన్ని నకిలీ బెదిరింపుగా తేల్చారు. ఇదే మెయిల్ అడ్రస్‌తో గత కొన్ని వారాలుగా చెన్నైలోని పలువురు వీఐపీలకు ఇదేతరహా బెదిరింపులు వచ్చినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370